Pubilshed from Vijayawada

PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 Vol.No : 15 | సంచిక : 98 Issue No : 98 | శనివారం Saturday | జూలై 18, 2026 18 JULY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## పాకిస్తాన్‌లో సైనిక ఆపరేషన్‌లో 24మంది ఉగ్రవాదుల మృతి

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో చేపట్టిన సైనిక ఆపరేషన్‌లో 24మంది ఉగ్రవాదులు మరణించారు. నిఘా సమాచారం ఆధారంగా వరుస ఆపరేషన్‌లు చేపట్టినట్లు సైన్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

- మిగతా 2లో..



## చాబహార్ ఓడరేవుపై అమెరికా దాడి..

### కూలిన టవర్

టెహ్రాన్ : ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవుపై అమెరికా విరుచుకు పడింది. శుక్రవారం అమెరికా జరిపిన వైమానిక దాడుల కారణం గా, ఆఫ్ఘనిస్థాన్‌కు కీలకమైన వాణిజ్య మార్గంగా ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలోని చాబహార్

- మిగతా 2లో..

(రామమోహన్ రెడ్డి)

"తప్పులెన్నువారు తండోప తండంబు
లుర్విజనులకెల్ల నుండు దప్పు
తప్పులెన్నువారు తమతప్పులెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ."

ఎదుటివారిలో తప్పులు చూసేవారు, చెప్పేవారు ఎంతోమంది ఉన్నారు. ఈ భూమిమీద పుట్టిన ప్రతి మనిషీ ఎదో ఒక తప్పు ఎప్పుడో ఒకప్పుడు చేస్తూనే ఉంటాడు. "నీది తప్పు, మార్చుకో" అని ఎదుటివారికి చెప్తూ ఉండేవారు తమ తప్పు ఏమిటో, తాము ఏమి మార్చుకోవాలో అని అసలు ఆలోచించరు. అని వేమన భావం.

# ఇది కాదా విధ్వంసం..





» ఇది సీఈర్ ప్రెస్ అకాడమినా...? » ఏపీయూ డబ్ల్యూ జే అకాడమినా..

» నిధులు ప్రభుత్వానివి... విధులు ఏపీయూడబ్ల్యూజేవి నా.. » ప్రెస్ అకాడమి అంటే యూనియన్ ది కాదుగా.. » రాజ్యాంగ పదవి, క్యాబినెట్ హోదా ఇందుకేనా.. » తెలంగాణ యూనియన్ కోసం ఆంధ్రుల ఆస్తులు అమ్మాలా.. » వారు చేసింది అరాచకం.. మరి మనము చేస్తుంది రాజరికమా.. » దేనిని విధ్వంసం అంటారు..ఏది విధ్వంసం అంటారు.. » చెప్పేది శ్రీరంగ నీతులు..చేసేది మరి..! » ఆంధ్రా జర్నలిస్టులకు పౌరుషం లేదా.. » చావ చచ్చి బ్రతకాల్సిందేనా.. » ఆంధ్రులకు ఆత్మాభిమానం ఉందా లేదా... » తెలంగాణ నాయకుల అడుగులకు మడుగుల ఒత్తాల్సిందేనా... » తెలంగాణ వారు తన్ని తరిమినా సిగ్గు రాదా... ఇంకా రాలేదా... » ఆలపాటి అడుగులు ఆంధ్రా కోసం కాదా...ఆయన యూనియన్ కోసమా...?

» ఏది విధ్వంసం... ఎవరిది విధ్వంసం....!

ఇది సరిగ్గా సీఆర్ అకాడమీ చైర్మన్ గా రాజ్యాంగ బద్ధ పదవి లో ఉన్న వారికి అన్వయించడంలో తప్పేమి కాదని చెప్పాలి.కారణం పైన యోగి వేమన చెప్పబడిన పద్యం లో లాగా ప్రస్తుత శ్రీ రాఘవాచారి ప్రెస్ అకాడమి చైర్మన్ విధి విధానాల అమలు తీరు అలాగే ఉందని చెప్పాలి. ఇక్కడ ప్రధానంగా చర్చించాల్సిన విషయాలు బోలెడు ఉన్నాయి. ఏమిటయ్యా అవి అంటే...ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ (ప్రస్తుతం సి. రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ) 1996లో విజయవాడలో ఏర్పాటయింది. ఇది జర్నలిస్టుల నైపుణ్యాలు పెంచడానికి, వృత్తి ప్రమాణాలు మరియు పరిశోధనలను ప్రోత్సహించడానికి పనిచేస్తున్న ప్రభుత్వ సంస్థ.అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు కాబడినది.మరి ఈ ప్రెస్ అకాడమి ద్వారా గతంలో కానీ ఇప్పుడు కానీ జర్నలిస్టులకు ఎలాంటి ప్రయోజనాలను సమకూర్చారంటే అది సమాధానం దొరకని పరిస్థితి.



⏭ వివరాలు 2లో..




హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది...

# అదే నాలో కసిని పెంచింది

### మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్

» మంగళగిరిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగం
» 91 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగ ప్రసంగం
» డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని స్పష్టీకరణ
» అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తామని, పెట్టుబడులు ఆకర్షిస్తామని హామీ

2 పేజీలో..



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : "హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారీ నాకు అసూయ కలుగుతుంది. అక్కడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ఐటీ టవర్లు చూసినప్పుడు కలిగే ఆ అసూయే.. నాలో కసిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకాన్ని ఇచ్చింది" అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఆధునిక హంగులతో కూడిన మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ సభలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ప్రసంగంలో అభివృద్ధి, రాజకీయాలు, వ్యక్తిగత ప్రస్థానాన్ని కలగలిపి, ప్రజల్లో నూతనోత్సాహం నింపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని లోకేశ్ కొనియాడారు. "ఒకప్పుడు రైళ్లు సమయానికి వచ్చేవి కావు, బోగీలు శుభ్రంగా ఉండేవి కావు. కానీ నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ భద్రతా టెక్నాలజీ, 100 శాతం విద్యుదీకరణతో రైల్వే రంగం స్వరూపమే మారిపోయింది. దేశాభివృద్ధికి రైల్వేలే కీలకమని ప్రధాని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు"



## స్థానిక సంస్థల ఎన్నికలలో అదే ఫార్ములా కుదరదు

» మంత్రి మనోహర్ » సార్వత్రిక ఎన్నికల పరిస్థితి వేరు

ప్రజాభూమి ప్రతినిధి, గుంటూరు : సార్వత్రిక ఎన్నికలలో కూటమి బలోపేతం కోసం పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయంతో కొంత వెనక్కు తగ్గిన మాట వాస్తవమేనని కానీ స్థానిక సంస్థల ఎన్నికలలో ఆ పరిస్థితి ఉండదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని వివిధ వార్డులలో పర్యటించిన ఆయన స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ప్రకటన చేశారు. కొన్ని సామాజిక మాధ్యమాలలో 2024 సార్వత్రిక ఎన్నికల ఫార్ములానే స్థానిక సంస్థల ఎన్నికలలో కొనసాగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

- మిగతా 2లో..

## రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

» రుణ వితరణ కార్యక్రమంతో వ్యాపారవేత్తలుగా సామాన్యులు
» సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మాలాసీతారామన్ సహకారం
» కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
» నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు
» వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి




ప్రజాభూమి ప్రతినిధి,నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలు చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు.

2 లో..

వైసీపీ ప్రభుత్వం చేసిందే ఇప్పుడు కూటమి

# ప్రభుత్వం చేస్తోంది

» ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల
» అమ్మఒడి ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ మోసం చేసిందన్న షర్మిల
» కూటమి ప్రభుత్వం కూడా తల్లులను మోసం చేస్తోందని విమర్శ
» మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్

2 పేజీలో..



అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు

# టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి

### మంత్రి నారాయణ డెడ్‌లైన్!

» అమ్యూజ్‌మెంట్ పార్క్, ఎకో టూరిజం పార్కులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్న ప్రభుత్వం
» అమరావతిలో రోడ్లు, భవనాలు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్టులు పూర్తి కావాలన్న నారాయణ
» పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశం



2 పేజీలో..

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కేవలం పరిపాలనా నగరంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తులు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కృష్ణా నదీ తీరాన 'రివర్ ఫ్రంట్ టూరిజం' అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది.అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) అధికారులతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో ఏడీసీఎల్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథితో పాటు పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు.

ఈ సమీక్షా సమావేశం ముఖ్యాంశాలు : పీపీపీ విధానంలో పార్కుల అభివృద్ధి: అమరావతిలో సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించేలా భారీ 'అమ్యూజ్‌మెంట్ పార్క్', పర్యావరణాన్ని ప్రతిబింబించేలా 'ఎకో టూరిజం పార్కు'లను పబ్లిక్ ప్రైవేట్

# ప్రజాభూమి

శనివారం, జూలై 18, 2026 2


## సంపాదకీయం

### హాట్‌హాట్‌గా సాగనున్న పార్లమెంట్ !

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. ఈ సమావేవాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నాయి. ఈ క్రమంలో ఎవవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. విపక్ష పార్టీలు కూడా తగిన వ్యూహాలతో సిద్ధం అవుతున్నారు. అధికార పార్టీ వేసే ఎత్తుగడలకు ధీటుగా నిలవాలని ఇండియా కూటిమి సన్నద్ధం అవుతోంది. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతున్న సమావేశాలు కాబట్టి ఈసారి హాట్‌హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేసింది. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థలో అవ్యవస్థలు, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. అలాగే నియోజక వర్గాల పునర్విభజన, మంత్రులు-ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అధికార ఎన్‌డిఎ పెద్దగా పట్టించుకోవడం లేదు. గత పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ఇలాంటి డిమాండ్ వచ్చింది. అయినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. పార్లమెంటులో చర్చించే ముందు అఖిలపక్షంతో చర్చించడం ఆనవాయితీ ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దానిని తుంగలో తొక్కారు. అఖిలపక్షాలు ఏర్పాటు చేయడం, చర్చించడం మోడీకి పెద్దగా ఇష్టం ఉండదని గత 12 ఏళ్లుగా చూస్తున్నాం. ఇకపోతే జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేసుకుంది. రామ మందిర విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, రాజ్యాంగ సంస్థల బలహీనత, రాజకీయ పార్టీల విభజన, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు, ఎథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నరికివేత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీలిమిటేషన్ బిల్లును మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్.. ఆరోపించారు. ఏప్రిల్ 17న ప్రభుత్వం రెండు మూడవ వంతు మెజారిటీ సాధించడంలో విఫలమైందని, ఇప్పుడు మరోసారి అదే బిల్లును తీసుకురావాలని చూస్తోందన్నారు. డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ గతంలో ఎలా వ్యతిరేకించిందో ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 30 రోజుల పాటు జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు జైరాం రమేష్ తెలిపారు. అలాగే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సవరణలు వంటి బిల్లులను కూడా కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం తీసుకురానున్న శాసనసభ్య కార్యక్రమాల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వగల బిల్లు ఏదీ కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే అమలు చేస్తే కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. అమిత్ షా రాజకీయ పార్టీలను చీల్చి రెండు మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. అయితే బీజేపీకి లోక్‌సభలో రెండు మూడవ వంతు మెజారిటీ సాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి సోమవారం వ్యూహ సమావేశం నిర్వహించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై వర్షాకాల సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించనుంది. జూలై 20 నుంచి ప్రారంభ మయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులతో పాటు పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మరోవైపు నీట్ ప్రశ్నాపత్రాల లీక్, రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెరుగుతున్న చమురు ధరలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కేంద్రం కూడా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా వ్యవహరిస్తోంది.

దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నా, వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకునే చొరవ కూడా తీసుకోవడం లేదు. మొత్తంగా ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ప్రవేశ పెడితే ఎలా నెగ్గుకు వస్తారన్నదే ఆసక్తిగా మారింది. మహిళా బిల్లును కలిపే పెడతారా అన్నది తెలియదు. అఖిలపక్షంలో చర్చించేందుకు ఎందుకనో మోడీ ఇష్టపడడం లేదని తెలుస్తోంది. అదేదో పార్లమెంటులోనే చర్చించాలన్నది ఆయన వ్యూహంగా ఉన్నట్లు అర్థం అవుతోంది.

## వైసీపీ ప్రభుత్వం చేసిందే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తోంది

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :** కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. "తల్లికి వందనానికి పంగనామం-బిడ్డలకు ఎగనామం" ఇదే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీ అంటూ ఆమె విమర్శించారు.

అంతేకాదు గత ముఖ్యమంత్రి జగన్‌కి వారసుడు నేటి సీఎం చంద్రబాబు అంటూ ఆమె ఎద్దేవా చేశారు. గత వైసీపీ మోసాలను తు.చ తప్పకుండా పాటించడం కూటమి ప్రభుత్వ విధానమైందని మండిపడ్డారు.

అమ్మఒడి పేరుతో ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ ప్రభుత్వం తల్లులను పచ్చిమోసం చేసిందని వ్యాఖ్యానించారు. "నీకు 15, నీకు 15, ఎంతమంది ఉంటే అన్ని 15 వేలు అని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు చంద్రబాబు తల్లులను నయవంచన చేస్తున్నారని షర్మిల ఆరోపించారు. కోతల రాయుడు కోతలంటూ జగన్ ను ఎద్దేవా చేసిన చంద్రబాబే మళ్లీ కోతలకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యారని విమర్శించారు. తల్లికి వందనంపై నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే 87 లక్షల మంది బిడ్డలకి ఇవ్వాల్నారు. కోతలు పెట్టకుండా ప్రతి బిడ్డకు 15 వేలు జమ చేయాలన్నారు. కొర్రీలు పెట్టకుండా మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి పథకం కింద ఒక్కబిడ్డకే ఇచ్చి తల్లులను మోసం చేశారని... ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే మార్గం అనుసరిస్తోందని షర్మిల ఆరోపించారు. తల్లికి వందనం పథకం కేవలం ఎన్నికల ముందు ఇచ్చిన హామీగా మిగిలిపోయిందని విమర్శించారు.

## పాకిస్తాన్‌లో సైనిక ఆపరేషన్‌లో 24మంది ఉగ్రవాదుల మృతి

మొదటి పేజీ తరువాయి

బన్ను జిల్లా, దాని పరిసర ప్రాంతాల్లో గత 24 గంటలుగా ఈ ఆపరేషన్లు కొనసాగాయని సైనిక దళాల మీడియా విభాగం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఆపరేషన్లలో 24 మంది ఉగ్రవాదులు మరణించారని, వారి వద్ద నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఆ ప్రకటన తెలిపింది. పలు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నారని, ప్రజల మృతికి కారణమయ్యారని పేర్కొంది. విజయవంతమైన ఆపరేషన్లు చేపట్టిన సైనికులను ప్రశంసిస్తూ పాకిస్తాన్ ప్రధాని అసిఫ్ అలి జర్దారీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

## ఇది కాదా విధ్వంసం..

ఏ రాజకీయ పార్టీ అధికారం లో ఉంటే ఆ పార్టీ కి అనుకూలంగా ఉన్న ఓ సీనియర్ జర్నలిస్టుకి అలంకార ప్రాయంగా ప్రెస్ అకాడమి చైర్మన్ గా పదవి కట్టబెట్టడం సహజం.అయితే అప్పట్లో జర్నలిస్టుల సంఖ్య పరిమితము గా ఉండడం మూలాన సహజంగానే జర్నలిస్ట్ యొక్క ప్రవర్తనా నియమావళిని బట్టి ఆనాటి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇచ్చే వారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత ఉభయ తెలుగు రాష్ట్రాల లో మెజార్టీ జర్నలిస్టులు వివక్షకు గురవ్వడం నిత్యకృత్యమైనదని చెప్పడం లో పెద్దగా అచ్చర్య పడాల్సిన అవసరం లేదని స్పష్టం అవుతోంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ జమానాలో ప్రస్తుత వైసీపీ అధినేత మానస పుత్రిక జగతి పబ్లికేషన్స్ ప్రారంభం తో పత్రికా యాజమాన్యాల మధ్య ఏర్పడిన అగాధం జర్నలిస్టులకు ప్రాణసంకటంగా మారిందనేది యాదార్థం. అది కాస్తా విభజిత ఆంధ్రప్రదేశ్ లో నానాటికి పెరిగి పెద్దది అయ్యి చివరికి ఇంటి కుక్క ఇంటి యజమానినే కరిచిదన్న రీతిలో పత్రికా యాజమాన్యాలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పొసుకోవడం పరిపాటి గా మారి జర్నలిస్టుల బ్రతుకులను ఛిద్రం చేసే స్థాయికి పరిస్థితి ని దిగజార్చి వేశారు.

ఇలాంటి సందర్భం నుంచి రాజకీయ పార్టీల అధినేత లు కూడా తమ రాజకీయ మనుగడ కోసం పత్రికా వ్యవస్థను విభజించు పాలించు అన్న చందంగా తయారు చేశారు.దీనికి అనుసంధానంగా యూనియన్ లు కూడా రాజకీయ నాయకుల అడుగులకు మడుగులెత్తడం సర్వ సాధారణంగా మారింది.అది కాల క్రమేణా పరిమితి కి మించి పోయింది.

దీనిని ఆసరా గా తీసుకున్న ఏపీయూడబ్ల్యూ జే నాయకులు తమ ప్రయోజనాల కోసం జర్నలిస్టుల విలువలను దిగజార్చడానికి ఏమాత్రం వెనుకడుగు వేయలేదు.వైఎస్ మరణం తరువాత వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి విషయంలో నాడు నేడు కూడా ఏపీయూడబ్ల్యూజే యూనియన్ తమ పంథాను ఏ మాత్రం మార్చుకోక పోయిన జగన్ మీడియా వారు కూడా ఇదే యూనియన్ లో కీలకపదవులలో వుంటున్నారు. అయితే ఆ యూనియన్ పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రిజిస్టర్ అయ్యి ఉంది.దాని మూలాలన్ని తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి.తెలంగాణ జర్నలిస్ట్ లు మాత్రం ఆంధ్ర అన్న పదం కూడా వినడానికి ఇప్పటికి ఇష్టపడడం లేదన్నది మెజార్టీ జర్నలిస్టుల కు విదితమే.ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు కాబడినా




హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎంతో ఉన్నతంగా ఉన్నా అది తెలంగాణ వారికే కేటాయింపు జరిగింది. ఇక ఆంధ్రాకు జిల్లా కు ఒక ప్రెస్ క్లబ్ ఉన్నా అవన్నీ గబ్బు గబ్బు గా నడుస్తున్నాయన్నది కూడా అంతే సత్యం. ఇక ఇలాంటి పరిస్థితి లలో కూడా ఆంధ్రప్రదేశ్ కు చెందిన జర్నలిస్ట్ లు తెలంగాణ మూలాలతోనే నడుస్తున్న ఏపీయూడబ్ల్యూజె మోచేతి నీరు త్రాగుతా అది ఒక అపర సంజీవనిలాగ బావించు కుంటూ ఉన్నారు.

... కాక పోతే రాష్ట్రం విడిపోయిన ఉమ్మడిరాజధాని గా పదేళ్ల పాటు హైదరాబాద్ ఉన్నా ఈ రాష్ట్రంలో చాలా గొప్ప మేధావులు గా భావించే సదరు యూనియన్ నాయకులు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఆంధ్రా జర్నలిస్ట్ లకు ప్రాధాన్యత కల్పించడానికి ఎటువంటి చర్యలు చేపట్టారంటే అందుకు సమాధానం దొరకని పరిస్థితి. ఇక విజయవాడలో ఉన్న ప్రెస్ క్లబ్ పరిస్థితి మరింత దారుణం.దాతల సహకారం ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తే దాదాపు 2కోట్ల బకాయిలు అద్దె ,నీటి పన్ను ఇలా బకాయిలు పడి హైకోర్టు, లోకాయుక్త కోర్టుల్లో వ్యాజ్యాలు నడుస్తున్న పరిస్థితి దాపురించడం ఏపీయూడబ్ల్యూ జే చేసిన దుర్మార్గపు పని వల్లే అన్న విమర్శలు లేక పోలేదు.

అలాంటి యూనియన్ అనుబంధం గా ఉన్న ఐ జేయు లో నాయకులు గా ఉన్న ప్రస్తుత సీఆర్ ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచి కూడా ఏపీయూ డబ్ల్యూ జె యూనియన్ కె పెద్ద పీట వేస్తూ తన స్వామి భక్తిని చాటుకున్నారనే ఆరోపణలు తరచూ వింటూనే ఉన్నాము.

ప్రెస్ అకాడమి స్వయం ప్రతిపత్తి కలిగి ఉన్నా ఒక సీనియర్ జర్నలిస్ట్ అయిన ఆలపాటి సురేష్ కుమార్ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన విధానాలను విమర్శలు చేస్తూ జగన్ మీడియా ద్వారా కూడా సహాయ సహకారాలు అందిపుచ్చుకుని విధ్వంసం పుస్తకం రాసి నాటి ప్రతిపక్ష పార్టీల అధినేతలు అమరావతి ఉద్యమ నేతల సమక్షంలో పుస్తక ఆవిష్కరణ చేయడం ఆపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం సీఆర్ ప్రెస్ అకాడమి చైర్మన్ అవ్వడం జరిగింది. మరి ఒక ముఖ్యమంత్రి రాజ్యాంగ వ్యవస్థలను విధ్వంసం చేశాడని పుస్తకం రాసిన గొప్ప సీనియర్ జర్నలిస్ట్ స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రెస్ అకాడమి ని ఏపీ యూ డబ్ల్యూ జే అకాడమి గా మార్చడం జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తం చేసే విదంగా ప్రభుత్వ నిధులు వెచ్చిస్తూ సదరు యూనియన్ నాయకులనే స్టేజీపై కూర్చొని బెట్టి వారి తప్ప ఇంకెవరు లేరన్న ధోరణి ని తీసుకు రావడం జర్నలిస్టుల జీవితాల ను విధ్వంసం చేయడం కాదా అన్న ప్రశ్న సదరు జర్నలిస్టుల నుండి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పోనీ ఆ యూనియన్ ఏమైనా ప్రభుత్వాలతో పోరాడి హైదరాబాద్ లాంటి ప్రెస్ క్లబ్ కు ధీటుగా ఏర్పాటు చేసిందా అంటే అది లేదు.కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కనీసం తినడానికి ఉప్పు పప్పు గాని,ప్రమాద వశాత్తు ,లేదా దాడుల్లో మరణించిన కుటుంబాలకు ఎలాంటి భరోసా కల్పించారో ఈ పెద్ద మనుషులు నిజాయితీ ఒప్పుకునే సత్తా ఉందా అంటే దానికి సమాధానం దొరకని పరిస్థితి. మరి దేనికోసం ఉందయ్యా అంటే అక్రిడేషన్ కమిటీలలో ఉంటూ ఆయా సభ్యులు పనిచేస్తున్న సంస్థలకు ఏ విదంగా లబ్ది చేకూర్చాలని చూసేందుకు, ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వాదినేత వద్దకు వెళ్లి అయోచిత లబ్ధి పొందడానికి అది కూడా కేవలం ఆ యూనియన్ ను భుజస్కంధాలపై పెట్టుకుని మోసేవారి కి కాకుండా ప్రదానంగా ఉన్న వారికి కుల సమీకరణాలు ఆధారంగా ఇలా చేసుకోవడానికి ఉన్న ఏపీయూ డబ్ల్యూ జే యూనియన్ ను సీఆర్ ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ గ్రామీణ విలేకరుల పునఃచ్చరణ తరగతులకు ఆహ్వానించి ఆ యూనియన్ పేరు పెద్దగా వేసి ప్రచారం కల్పించడం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటని ఇది కదా జర్నలిస్టుల విధ్వంసం అని మేధావి వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో ఆంధ్రా జర్నలిస్టులు సిగ్గు ఎగ్గు లేకుండా పౌరుషం లేకుండా అందరి కష్టం తో అభివృద్ధి చేసై తన్ని తరిమి వేసిన తెలంగాణ ప్రాంత ఆధిపత్యం లో నే ఇంకా బానిస బ్రతుకులు బ్రతుకుతూ ఉండాలా అనేది ఆంధ్రా జర్నలిస్టులు ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్రాంత పాత్రికేయులు తమ మనోగతం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

మొదటి పేజీ తరువాయి

ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు.




**నిర్మలా సీతా రామన్ సంస్కరణల వాది :** "మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారు

**చిన్న వ్యాపారులకు అండగా కేంద్రం-కేంద్ర మంత్రి :** దేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు.

**ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (ఙజజదీ) కి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. సభకు ముందు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

## చాబహార్ ఓడరేవుపై అమెరికా దాడి.. కూలిన టవర్

ఓడరేవులోని టవర్ కూలిపోయినట్లు హోమ్జగన్ యూనివర్శిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సమాచారం ఆధారంగా మీడియా పేర్కొంది. శుక్రవారం తెల్లవారుజాము నుండి అమెరికా దాడులను పెంచిందని, ఇరాన్‌లోని పలు బ్రిడ్జిలపై దాడులు చేపట్టినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దక్షిణ ఓడరేవు నగరమైన బందర్ ఖమీర్‌లోని వంతెలనపై జరిపిన దాడుల్లో ఏడుగురు మరణించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. సుమారు 12కి పైగా లక్ష్యాలపై తాజాగా దాడులు జరిపినట్లు పేర్కొంది.

## స్థానిక సంస్థల ఎన్నికలలో అదే ఫార్ములా కుదరదు

పార్టీ కోసం కష్టపడిన వారు సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసే అవకాశం ఉన్నప్పటికీ కొన్ని ప్రత్యేక పరిస్థితులలో వెనక్కి తగ్గామన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి సార్వత్రిక ఎన్నికలలో అవకాశం దక్కకపోయినా భవిష్యత్తు లో సముచిత న్యాయం జరుగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారని అన్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీ అవకాశం ఉన్న మేరకు పోటీ చేస్తుందని, పార్టీ శ్రేణులు కూడా అన్ని విధాలుగా పార్టీ బలోపేతానికి సహకరించాలని కోరారు. పరోక్షంగా స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

## అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి

పార్టనర్‌షిప్ పద్ధతిలో అభివృద్ధి చేయాలని ఏడీసీఎల్ నిర్ణయించింది.

**మంత్రి నారాయణ డెడ్‌లైన్:** రాజధాని పరిధిలో ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఒక కొలిక్కి వచ్చే సమయానికే.. సమాంతరంగా ఈ పర్యాటక ప్రాజెక్టులన్నీ కూడా పూర్తి కావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. **సీఎం చంద్రబాబు విజన్:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా.. దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్ట్ డిజైన్లు ఉండాలని, పనుల్లో వేగం పెంచాలని మంత్రి స్పష్టం చేశారు.

రైతులకు, పర్యాటకులకు అనుకూలంగా ఉండేలా ఇప్పటికే టూరిజం ప్రాజెక్టుల కోసం భూములు తీసుకున్న ఇతర ప్రైవేట్ సంస్థలు కూడా కాలయాపన చేయకుండా తక్షణమే తమ నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. తాజా సమీక్షతో అమరావతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులకు మరింత ఊపు రానుంది.



## హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది... అదే నాలో కసిని పెంచింది

అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మరిన్ని రైళు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సభాముఖంగా కోరారు.అమరావతి అభివృద్ధిపై లోకేశ్ తన దార్శనికతను స్పష్టం చేశారు. "రాజధాని అమరావతికి రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానం అత్యంత కీలకం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అనుసంధానిస్తూ ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. 2019-24 మధ్య ఆగిపోయిన అమరావతి పనులను ఇప్పుడు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ సిటీగా మార్చడమే మా అందరి లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉన్న 'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే ఇది సాధ్యమని ఆయన అన్నారు. దశాబ్దాల కల అయిన విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ ఆచరణలోకి తెచ్చారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మంగళగిరితో తనకున్న అనుబంధాన్ని, రాజకీయ ప్రయాణాన్ని లోకేశ్ భావోద్వేగంగా పంచుకున్నారు. "2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినప్పుడు కుంగిపోలేదు. ఐదేళ్లు మీ మధ్యనే ఉన్నా, చెమటోడ్చి కష్టపడ్డా, మీ మనసు గెలుచుకున్నా. నేను ఏ మెజారిటీతో అయితే ఓడిపోయానో, దాని పక్కన ఒక సున్నా పెట్టి గెలిపించాలని కోరాను. మీరు నా మాట నిలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే టాప్-3 మెజారిటీతో, 91 వేల ఓట్ల ఆధిక్యంతో నన్ను గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ గెలుపు నాకు కొండంత బలాన్నిచ్చింది, నాపై బాధ్యతను పెంచింది" అని అన్నారు. ఈ మెజారిటీని చూపించే కేంద్ర, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గానికి పనులు చేయిస్తున్నానని తెలిపారు.ఎమ్మెల్యే,



ఎంపీ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంగళగిరి ఒక ఉదాహరణ అని లోకేశ్ అన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేస్తూ లక్ష్మీ నరసింహ స్వామి గుడి అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ వంటి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్, అదానీ అంకా వంటి పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, రాబోయే మూడేళ్లలో యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజల కోసం అహర్నిశలు కష్టపడతానని, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

# ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా 3

శనివారం, జులై 18, 2026


# గుడివాడకు సీఎం చంద్రబాబు...

# స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొనున్న సీఎం

❖ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ముమ్మర సన్నాహాలు... కూటమి నాయకత్వం రంగంలోకి ❖ ప్రజా ఉత్సవంగా సీఎం పర్యటన నిర్వహిస్తాం: ఎమ్మెల్యే రాము ❖ సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ బాలాజీ సమీక్ష... అధికారులకు దిశా నిర్దేశం ❖ గుడివాడలో భారీ ఏర్పాట్లు... హెలిప్యాడ్, బహిరంగ సభ, కార్యకర్తల సమావేశ వేదికలు ఖరారు ❖ గౌతమ్ పాఠశాల వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం... పలు ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు ❖ కీలక సూచనలు చేసిన ఎమ్మెల్యే రాము.... సీఎం పర్యటన విజయవంతానికి కూటమి నాయకత్వానికి పిలుపునిచ్చిన ఎమ్మెల్యే

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

గుడివాడకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. గౌతమ్ పాఠశాల వద్ద జరగనున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు.సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సీఎంఓ అధికారులతో కలిసి గుడివాడ బైపాస్ రోడ్డు, ఇంజనీరింగ్ కళాశాల, ఏఎన్ఆర్ కళాశాలను పరిశీలించారు.కలెక్టర్ బాలాజీ అధ్యక్షతన సమీక్ష సీఎం పర్యటన విజయవంతానికి గుడి వాడ మున్సిపల్ కౌన్సిల్ హాల్లో కలెక్టర్ డీకే బాలాజీ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భద్రత, ట్రాఫిక్, ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో గుడి వాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని పర్యటన ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సీఎం పర్యటనను ప్రజా ఉత్సవంగా నిర్వహిస్తామని, అధికారుల సమన్వయంతో కూటమి నాయకత్వం పూర్తి స్థాయిలో భాగస్వామ్యం అవుతుందని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు.



**వేదికలు ఖరారు**

సీఎం పర్యటనలో భాగంగా ఏఎన్ఆర్ కళాశాలలో హెలిప్యాడ్, ఎన్టీఆర్ స్టేడియంలో బహిరంగ సభ, బైపాస్ రోడ్డులోని యలవర్తి గ్రౌండ్స్ లో టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశ వేదికలను అధికారులు ఖరారు చేశారు.సీఎం పర్యటనకు గంటల వ్యవధి ఉండడంతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకత్వంలో టీడీపీ నాయకత్వం ముమ్మర ఏర్పాట్లలో నిమగ్నమైంది.సీఎం పర్యటన ఏర్పాట్లు మరియు సమావేశంలోఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మండల పట్టణ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, పంద్రాజ్ సాంబయ్య, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కుమార్, గుడివాడ ఆర్టీవో బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తో పాటు పోలీస్ మరియు పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఈనెల 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ నిరసన

జగ్గయ్యపేట, ప్రజాభూమి



రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 396 జీవోను వ్యతిరేకిస్తూ ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మూడు రోజులపాటు రాష్ట్రంలోని దస్తావేజు లేఖరులు పెన్డౌన్ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు జగ్గయ్యపేట దస్తా వేజు లేఖరుల సంఘం అధ్యక్షులు జిల్లా కార్యదర్శి మాడపాటి కిషోర్ తెలిపారు. శుక్రవారం వారు తెలిపిన వివరాల ప్రకారంజూన్ నెల 30 వ తారీకు రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటి కరణ చేస్తూ జీవో నెంబర్ 396 జారి చేసింది అన్నారు. ప్రైవేటి కరణతో స్టాంపు వెండర్స్ ,దస్తావేజు లేఖరులు, సహాయకులు , డిటిపి అపరేటర్లు, అందరు మనుగడ లేకుండా పోయే అవకాశం ఉన్నది అన్నారు. కావున రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘము వారు పిలుపు మేరకు ఈనెల 20వ తేదీ నుండి 22. వ తేదీ వరకు మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టి నట్లు తెలిపారు. ఆ మూడు రోజులు ఏవిధమైన రిజిస్ట్రేషన్ గాని, అగ్రిమెంట్ లు , ఏవిధమైన కార్యక్రమాలు జరగవనీ కావున కక్షిదారులు, సానుభూతి పరులు ప్రజ సంఘాలు విద్యార్థి సంఘాలు కూడా కలసి మాతో పాటు నిరసన కార్యక్రమం పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా మాడపాటి కిషోర్ కోరారు.

# నీట్‌లో ఆల్ ఇండియా 126వ ర్యాంకు సాధించిన వడ్డేపల్లి దుష్యంత్‌ను, రోళ్ళ కంటి సాహితీని అభినందించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట, ప్రజాభూమి

ఇటీవల విడుదలైన ఎన్ ఈ ఈ టి-యుజి 20 26 ఫలితాల్లో జగ్గయ్యపేట పట్టణం మార్కండేయ బజార్ 18వ వార్డుకు చెందిన వడ్డేపల్లి శ్రీనివాసరావు కుమారుడు వడ్డేపల్లి దుష్యంత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 126వ ర్యాంకు, కేటగిరీ ర్యాంకు 24 సాధించడంతో పాటు 720 మార్కులకు గాను 690 మార్కులు సాధించి జగ్గయ్యపేటకు గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా జగ్గయ్య పేట మండలం బలుసుపాడు గురుధామ్ లో రమణ గురుదేవుల ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం, జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , యువనేత శ్రీరాం చిన్నబాబు దుష్యంత్‌ను శాలువాతో సత్కరించి, అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ_వడ్డేపల్లి దుష్యంత్ సాధించిన ఈ అపూర్వ విజయం జగ్గయ్యపేట నియోజకవర్గానికే గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిరంతర శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం ఉంటే అత్యున్నత విజయాలు సాధించవచ్చని దుష్యంత్ నిరూపించారని అన్నారు.

ఇలాంటి విజయాలు సాధించే విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి సేవ చేసే వైద్యునిగా ఎదగాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆకాంక్షించారు. అలాగే దుష్యంత్ తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను, గురువులను ప్రత్యేకంగా అభినందిస్తూ వారి కృషిని ప్రశంసించారు.

**నీట్ లో సీటు సాధించిన రో ళ్ళ కంటి సాహితిని అభినందించిన ఎమ్మెల్యే రాజగోపాల్**

జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన రోళ్ళ కంటి వరబాబు కుమార్తె సాహితి నిట్ లో 500 మార్కులు సాధించి మెడికల్ సీట్ సాధించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సాహితీ నీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ అభినందించారు. కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాల ను చేరుకోవచ్చని సాహి తీ నిరూపించిందని అ న్నారు .వైద్య విద్యలో మరింత ఉన్నత శిఖరా లను అధిరోహించి సమా జా నికి సేవ చేసే గొప్ప వైద్యురాలిగా ఎదగాలని ఎమ్మెల్యే రాజగోపాల్ ఆకాంక్షించారు.





## సమాజంలో ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలన్న ఆశయం తో

# జయప్రద ఫౌండేషన్ సేవలు

## జయప్రద ఫౌండేషన్ ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ వేదాద్రిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

జగ్గయ్యపేట, ప్రజాభూమి

సమాజంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలి, ఆనందంగా జీవించాలనే ఉన్నత ఆశయంతో విలువలతో కూడిన వైద్య సేవలు అందిస్తున్న ట్లు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపా ధ్యక్షులు తొండపు దశరథ జనార్ధన్ తెలిపారు. జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేదాద్రి గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ప్రతి ఒక్క కుటుంబం నుండి ఆరోగ్య సమస్యలు తెలియజేస్తూ కంటి వైద్యం, జనరల్ వైద్యం పట్ల పలువురు మహిళలు ఆసక్తిగా వారికి ఉన్న సమస్యలను డాక్టర్లకు వివరిస్తూ వారి సమస్యలను వింటూ డాక్టర్లు కూడా ఉదయం నుండి సాయంత్రం వరకు శిబిరమునకు వచ్చిన ప్రతి వారి సమస్యలు తెలుసుకుని వారికి తగిన మందులు అందజేయడమైనది.

వైద్య శిబిరంలో పాల్గొనేందుకు గ్రామానికి విచ్చేసిన తొండపు దశరథ జనార్ధన్ ముందుగా అన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం శిబిరాన్ని సందర్శించి అన్ని కౌంటర్ల వద్దకు వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరిస్తు వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. సందర్భంలోశిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కర వైద్య శిబిరం గురించి మాట్లాడుతూ చాలా బాగా నిర్వహిస్తున్నారని అవసరమైన వారందరూ కు మం దులు ఉచితంగా ఇస్తున్నారని మా గ్రామంలో ఇలాంటి శిబిరాన్ని ఎవరు నిర్వహించలేదని మారు మూల ప్రాంతమైన మా వేదాద్రి గ్రామంలో ఇలాంటి శిబిరం నిర్వహించటం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేసినారు.ఈ వైద్య శిబిరంలో మొత్తం 481 మందికి వైద్య సేవలు అందించారువారిలో కంటి వైద్యం పొందిన వారు 261మంది.కళ్ళజోడు అవసరమైన వారు 158 మంది.

ఆపరేషన్ అవసరమైన వారు శుక్లములు 35 మంది. పొరలు ఉన్న వారు 6 గురు. అలాగే జనరల్ వైద్య సేవలు పొందినవారు 220. వారిలో అవసరమైన వారందరూ ఉచితంగా మందులు అందజేయబడినవి.రక్త,బీపీ, షుగర్, పరీక్షలు 299 మందికి. హిమగ్లోబిన్ పరీక్షలు 301 మందికి. నిర్వహించబడినవి. ఈనాటి కార్యక్రమంలో శిబిర కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు, టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, సుంకర సాయి సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు బాణావత్ రవి, కన్నా జానకిరామయ్య, బండి వంశీ,నరేష్, గుడారి పేరయ్య,తుమాటి నాగేశ్వరరావు, ఎక్స్ సర్పంచ్ జగజీవన్, యాదగిరి, శివా నాయక్, భూక్య శీను, హరిబాబు, కన్నా నాగయ్య,సపావత్ వెంకటేశ్వర్లు,బాణావత్ నరసింహారావు,కన్నా బుజ్జి, అడుసుమల్లి ప్రభు, పెంటేల పూర్ణ, గింజపల్లి రమేష్, కళ్యాణం మురళి, కృష్ణారావు, రావురి శీను, ఆలూరి రమణ,,ఈ కార్యక్రమానికి, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వివో ఏలు, జయప్రద ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొని వైద్య సేవలు అందించారు.





# అభివృద్ధి కమిటీ అట్టహాసం... కౌంటర్ల వద్ద నిరీక్షణే రోగుల భాగ్యం

### నెల దాటినా మారని ప్రభుత్వ ఆసుపత్రి తీరు

### వైద్యులున్నా... ఓపీడీ కౌంటర్ల వద్దే గంటల తరబడి జాప్యం

### స్పందించని ఆర్ఎంఓ, అభివృద్ధి కమిటీ సభ్యులు

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి ఏర్పాటైనా, రోగుల కష్టాలు మాత్రం తీరడం లేదు. కమిటీ కొలువుదీరి నెల రోజులు గడుస్తున్నా, ఆసుపత్రిలో కనీస సేవల మెరుగుదలకు, సిబ్బంది కొరతను అధిగమించడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రి లోపల వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ... రోగులకు ప్రాథమికంగా ఇచ్చే ఓపీడీ (OPD) స్లిప్పుల కౌంటర్ల వద్దే గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం ఇక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది.కౌంటర్ల వద్దే చుక్కలు చూస్తున్న రోగులు!ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యకు, అక్కడ ఉన్న కౌంటర్ల సంఖ్యకు అస్సలు పొంతన లేదు.లోపల వైద్యుల వద్దకు వెళ్లే పేషెంట్ల సంఖ్య తక్కువగానే ఉంటున్నా... బయట ఓపీడీ కౌంటర్ల వద్ద మాత్రం వందలాది మంది క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోంది.సిబ్బంది కొరత కారణంగా ఒక్కో స్లిప్ ఇవ్వడానికి నిమిషాల సమయం పడుతుండటంతో, అనారోగ్యంతో వచ్చిన వృద్ధులు, మహిళలు, పిల్లలు గంటల తరబడి నిలబడలేక నీరసించిపోతున్నారు.ఉదయం 8 గంటలకే లైన్లలో నిలబడితే, మధ్యాహ్నం వరకు కూడా ఓపీ స్లిప్ చేతికి రాని పరిస్థితి నెలకొంది."నెల రోజుల క్రితం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వేశారు. ఏదో మార్పు వస్తుందని ఆశపడ్డాం. కానీ క్యూలైన్లలో మా నిరీక్షణ మాత్రం మారలేదు. రోగంతో వచ్చి గంటల తరబడి నిలబడటం నరకంగా ఉందని ఆసుపత్రికి వచ్చిన ఒక బాధితుడు ఆవేదన చెందాడు.

**ఇప్పటికైనా 'ఆర్ఎంఓ' స్పందిస్తారా?..** ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులు, ఆర్ఎంఓ (RMO) ఇప్పటికైనా ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు. ఓపీడీ కౌంటర్ల వద్ద సిబ్బంది సంఖ్యను తక్షణమే పెంచి, రోగుల నిరీక్షణ సమయాన్ని తగ్గించాలని 'ప్రజాభూమి' వేదికగా ప్రజలు కోరుతున్నారు. కమిటీ సభ్యులు కేవలం బోర్డులకే పరిమితం కాకుండా, తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# దేవుడి తోట ఎస్టీ కాలనీలో రూ. లక్ష విలువైన దుస్తుల పంపిణీ

### శ్రీ ధర్మ శాస్త్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం

### ముఖ్య అతిథులుగా లంకిశెట్టి బాలాజీ, నడకుదిటి అర్జున, సన్నిధి నాగ సాయి



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

స్థానిక దేవుడి తోటలోని యానాదుల (ఎస్టీ) కాలనీలో శ్రీ ధర్మ శాస్త్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయల విలువైన నూతన వస్త్రాలను నిరుపేదలకు పంపిణీ చేశారు. కాలనీకి చెందిన సుమారు 150 మంది మహిళలకు కొత్త చీరలు, 100 మంది పురుషులకు లుంగీలు, టవల్స్ ను పంపిణీ చేశారు.ఈ సేవా కార్యక్రమానికి మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, నగర తెలుగుదేశం పార్టీ నాయకులు నడకుదిటి అర్జున, కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగ సాయి ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ముఖ్య అతిథుల ప్రసంగాల ముఖ్యాంశాలు:

**దాతృత్వానికి నిదర్శనం – లంకిశెట్టి బాలాజీ:**"గత నాలుగేళ్లుగా 'మన కన్వెన్షన్' అధినేత గొరిపర్తి శ్రీధర్, ఆయన స్నేహితుల బృందం క్రమం తప్పకుండా ప్రతి ఆషాఢ మాసంలో నిరుపేద యానాదులకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయం. తమ సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు కేటాయిం చడం ఇతరులకు ఆదర్శప్రాయం. ఇదే కాలనీకి చెందిన ఒక బాలికను ఫైర్ ఆఫీసర్ సుధాకర్ తన సొంత ఖర్చులతో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదివించడం గొప్ప విషయం. ఎస్టీ కాలనీ ప్రజలు గంజాయి, వైట్నర్, మద్యం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, పిల్లలను తప్పనిసరిగా చదివించాలి.

**"స్వచ్ఛంద సంస్థల పాత్ర అమోఘం – నడకుదిటి అర్జున:"**పేద ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా పెద్ద మనసుతో ముందుకు రావడం స్వాగతించదగ్గ పరిణామం.

**"ఆదర్శప్రాయమైన సేవ – సన్నిధి నాగ సాయి:"**'సొంత లాభం కొంత మానుకు పొరుగువానికి తోడుపడవోయ్' అనే మహాకవి సూక్తిని గొరిపర్తి శ్రీధర్ బృందం నిజం చేసి చూపించారు."పాల్గొన్న ప్రముఖులు:ఈ సేవా కార్యక్రమంలో ముఖ్య దాతలు గొరిపర్తి శ్రీధర్, ఆయన స్నేహితుడు గంగాధర్ మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన వస్త్రాలు అందుకున్న కాలనీవాసులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఐటిఐ ఖరగ్‌పూర్‌లో సీటు సాధించిన విద్యార్థి మద్దుల జీవన్ జశ్వంత్‌ను అభినందించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

జగ్గయ్యపేట, ప్రజాభూమి

జగ్గయ్యపేట పట్టణం కాగితాల బజార్‌కు చెందిన మద్దుల సురేష్‌బాబు, శ్రీదేవి దంపతుల కుమా రుడు మద్దుల జీవన్ జశ్వంత్ ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ ఖరగ్‌పూర్లో బీఎస్ (ఫిజిక్స్) కోర్సులో సీటు సాధించిన సందర్భంగా, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే తాతయ్య గకె జీవన్ జశ్వం త్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. కృషి, పట్టుదలతో ఈ అరుదైన విజయాన్ని సాధించడం అభినందనీయమని పేర్కొంటూ, ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి కుటుంబానికి, జగ్గయ్యపేటకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జీవన్ జశ్వంత్ తల్లిదండ్రులను కూడా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పేరూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి



శనివారం 18 జూలై 2026


## పగిలిన డ్రైనేజీ పలకలు.. ప్రమాదానికి ఆహ్వానం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి నుంచి విజయవాడకు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని గన్నవరం రోడ్డులోని కుంకప వార్ల బజారు మార్గంలో డ్రైనేజీపై ఉన్న నాలుగు సిమెంట్ పలకలు గత రెండేళ్లుగా పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాస్త ఏమరపాటుగా ప్రయాణించినా డ్రైనేజీలో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే పగిలిన పలకల స్థానంలో కొత్త సిమెంట్ పలకలు ఏర్పాటు చేసి సమస్యను వెంట నే పరిష్కరించాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మిని సంప్రదించగా, సమస్యను పరిశీలించి త్వరలోనే నివారణ చర్యలు చేపడతామని తెలిపారు.

## పి హెచ్ సి లలో హెచ్ పి వి వ్యాక్సిన్‌ను రాష్ట్ర బృందం పరిశీలన.



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మహమ్మారి నుండి 14 సంవత్సరాల లోపు బాలికలకు ఉపయోగపడే హెచ్ పి వి వ్యాక్సిన్ పంపిణీ విధానాలను పరిశీలించుటకు రాష్ట్రస్థాయి బృందం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. రాష్ట్ర హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శృతి. జిల్లా ఇమ్యునైజేషన్ టెక్నికల్ అధికారి సోమిత్ వ్యాక్సిన్ పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శృతి మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు బాలికలకు ఈ హెచ్ పి వి వ్యాక్సిన్ వేయడం వల్ల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుండి రక్షింపబడతారని. ఇది ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు.పిహెచ్ సి లలో వ్యాక్సిన్ అందించే విధానంలో పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్.డాక్టర్ జి దినేష్.ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు. పి హెచ్ ఎన్ పి. ఎలిజిబెత్.ఫార్మసీ అధికారి పీవీ స్వామి.సూపర్వైజర్లు ఎస్కే అమలేశ్వర రావు. గంగాభవాని, స్టాఫ్ నర్స్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

-ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు.



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

పోలవరం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపడుతుందని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బూసరాజపల్లి, నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ (ప్రజా వినతుల పరిష్కార వేదిక) కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బొరగం శ్రీనివాసులు వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుండి స్వయంగా వినతులను స్వీకరించారు. స్థానిక సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, మౌలిక సదుపాయాల సమస్యలపై అధికారులతో మాట్లాడి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను తీర్చడమే ధ్యేయంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, మనెల్లి బాలు మడి సోమరాజు, మడకం కన్నపరాజు, దెయ్యాల కృష్ణమోహన్,మణికల శ్రీను, సున్నం పోసి,గజ్జల కనకరావు,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోడు భూములకు వెంటనే పట్టాలివ్వాలి



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయిగూడెం

గిరిజనులు తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు వెంటనే పట్టాలిచ్చి హక్కులు కల్పించాలని, అటవీ హక్కుల చట్టం-2006ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం ఏలూరు జిల్లా కమిటీ పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అటవీ హక్కుల చట్టం వచ్చి 20 కావ వస్తున్నప్పటికీ పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, అడవుల ఆధారంగా జీవిస్తున్న గిరిజనంకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం గిరిజనుల భూ హక్కులను పరిరక్షించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. 1/70 చట్టాన్ని సవరించాలని కొంత మంది గిరిజనేతరులు సుప్రీం కోర్టుని ఆశ్రయించారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వహించటం సరికాదన్నారు. జీవో నెంబర్ 3 రద్దు అవటంతో దాని స్థానంలో ప్రత్యామ్నాయ జివో తీసుకొస్తామని ఇచ్చినహామీ నేటికీ అమలు కాలేదని, వీటి పట్ల ప్రభుత్వం వైఖరి ప్రకటించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమస్యలపై ఈ నెల 29వ తేదీన ఐటీడీఏ కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

మన వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే

# అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి

- ఒప్పందంపై సంతకం చేయవద్దు అంటూ 22న జిల్లా వ్యాప్తంగా నిరసనలు.
- రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపు.



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసి నాశనం చేసే అమెరికాతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దు అంటూ ఈనెల 22న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపునిచ్చింది.శుక్రవారం ఏలూరు,అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం బి కే ఎం యు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన రావు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కారం రాఘవ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస డాంగే తదితరులు మాట్లాడారు. అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసేందుకు కేంద్ర మోడీ ప్రభుత్వం తహతహలాడుతోందని, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే ఈ ఒప్పందం అని విమర్శించారు. అమెరికా నుండి ఎటువంటి సుంకాలు లేకుండా పాలు,పాలు పదార్థాలు, కోడి మాంసం, మొక్కజొన్నలు, పత్తి, సోయాబీన్, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయ్యి దేశీయంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజల స్వయం సమృద్ధిని, సార్వభౌమాధికారాన్ని నాశనం చేసి ప్రపంచ కార్పొరేట్ సంస్థలకు, అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ ప్రభుత్వం లొంగిపోయి వ్యవహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇప్పటికే దేశంలో రైతులు వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోయి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు పెట్టవద్దని డిమాండ్ చేశారు. సంతకం చేస్తే ఎఫ్ టి ఏ కు వ్యతిరేకంగా మరో చారిత్రాత్మక రైతు ఉద్యమానికి సమాయత్తం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈనెల 22న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాలలో సంయుక్త కిసాన్ మోర్చాలోని భాగస్వామ్య సంఘాలతో పాటు జిల్లాలోని అన్ని పంటల రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు,కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 22వ తేదీ లోపు రాష్ట్రపతికి వినతపత్రాలు పంపాలని, 22న మండల,జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది.

## ప్రత్యేక పిజిఆర్ఎస్‌లో రెండు భూసంబంధిత ఫిర్యాదులు

### తక్షణ పరిష్కారంతో అర్జీదారు కళ్ళల్లో ఆనందం

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

దెందులూరు యంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రత్యేక పిజిఆర్ఎస్ లో దెందులూరు మండలం దెందులూరు గ్రామ నివాసి తెట్టు లక్ష్మీపార్వతి తన భూమి 22 (ఏ) జాబితాలో నమోదు అయిందని, దాని తొలగించాలని దెందులూరు మండలం దోసపాడు గ్రామనివాసి వల్లభనేని ఫణివీర్ రాంజీ లు తమ భూములు తన భూమి వేరేవారి భూమిలో నమోదు అయిందని నాలుగేళ్లుగా తిరుగుతున్నానని దెందులూరు ఎమ్మెల్యేకు విన్నవించడంతో, వెంటనే రెండు సమస్యలను జిల్లా జాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ దృష్టికి చింతమనేని ప్రభాకర్ తీసుకువచ్చారు. జేసీ వెంటనే స్పందించి అధికారులతో సంబంధిత రికార్డు లను రప్పించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించా రు. ఆ రెండు సమస్యలు సరైనవని ధృవీకరించుకుని, వెంటనే రెండు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించి, దగ్గరుండి ఆ సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నారు.ఎన్నో సంవత్సరాలుగా పెండింగులో ఉన్న తమ సమస్యలకు అంత తక్కువ సమయంలో పరి



ష్కారం లభించడంతో అర్జీదారులు హర్షం వ్యక్తంచేస్తూ, రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ఇటువంటి వేదిక ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, సానుకూల దృక్పథంతో సమస్యలను పరిష్కరిస్తున్న జిల్లా యంత్రాంగానికి, జేసీ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు తమ కృతజ్ఞతలను తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్ ,పాలకొల్లు ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్సలు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

వాకర్స్ క్లబ్, పాలకొల్లు ఆధ్వర్యం లో 13 మంది వృద్ధులకు 40 వేల రూపాయల తో కంటి శస్త్ర చికిత్సలు చేయించిన అనంతరం వారికి క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లో క్లబ్ ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు,కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, జవ్వాజి కల్యాణ్, కఠారి నాగేంద్ర కుమార్, కర్రి కిరణ్ కుమార్ మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# పశ్చిమ వరి సాగుకు తాకిన ఎల్నినో ముప్పు

- 10 శాతం మించని వరి నాట్లు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ప్రపంచవ్యాప్తంగా ముంచుకొస్తున్న ఎల్ నినో (అసాధారణ ఉష్ణోగ్రత వాతావరణం) ముప్పు పశ్చిమగోదావరి జిల్లాకు తాకింది. జిల్లాలో 250000 ఎకరాల్లో వరి, మెట్ట పంటలు పండిస్తున్నారు. అయితే ఎల్ నినో కారణంగా ఇంతవరకు వర్షాలు రాకపోవడంతో నైరుతి రుతుపవనాలు కూడా కనుమరుగయ్యాయి. వరి చేలల్లో ఇప్పటికీ 50% ఖరీఫ్ వరి నాట్లు పూర్తి కావాల్సి ఉండగా కేవలం 10 శాతం మించి పూర్తిగా లేదు. దీంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ ఖరీఫ్ సాగుతుందా లేదా అనే అనుమానాలు మధ్య ఊగిసలాడుతున్నారు. కొన్ని మండలాల్లో అయితే వరి నారుమల్లు కూడా బీటలు వారాయి.

**వర్షాభావ పరిస్థితులు వల్లే వరి నాట్లు ఆలస్యం :ఏ డి ఏ మురళీకృష్ణ**

ఈ ఖరీఫ్ సీజన్లో వర్షాభావ పరిస్థితులు వల్ల వారి నాట్లు ఆలస్య మయ్యాయని పాలకొల్లు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడిఏ పి మురళీకృష్ణ తెలిపారు. గోదావరి నీటితోపాటు వర్షం నీరు కూడా ఉంటే ఇప్పటికీ 50 శాతం




వరి నాట్లు పూర్తయ్యేవని అన్నారు. ఎరువులు ఎక్కడ కొరతలేదని తెలిపారు. ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా ఎకరానికి 70 కేజీలు మాత్రమే యూరియా వాడుకోవాలని, అది 25 కేజీలు నాట్లు సమయంలోను, 25 కేజీలు పిలక సమయంలోను, 20 కేజీలు సిరి పొట్ట దశలోనూ వినియోగించాలని తెలిపారు. యూరియో బస్తా ఒకటికి కి 2000 రూపాయలు, డి ఏ పి కి 1350 రూపాయలు సబ్సిడీని కేంద్రం భరిస్తోందన్నారు.సూపర్, ఎం ఓ పి,కాంప్లెక్స్ ఎరువులు ఎన్ని కావాల్సిన దొరుకుతాయని తెలిపారు. ఎల్ నినో కారణంగా వరినాట్లు కొంత ఆలస్యం అయ్యాయని అయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ఏడిఏ మురళీకృష్ణ వివరించారు.

## కోనసీమ తిరుమల వాడపల్లికి టెంపుల్ టౌన్ హోదా కోరిన ఎమ్మెల్యే బండారు

- ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ.. వాడపల్లి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సమర్పణ.
- శ్రీనివాసం-2, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలకు నిధులు, స్థలం కేటాయించాలని విజ్ఞప్తి.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను



ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వాడపల్లి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన సమగ్ర అభివృద్ధి ప్రణాళికను ముఖ్యమంత్రికి అందజేశారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు మెరుగైన వసతి కల్పించేందుకు శ్రీనివాసం-2 వసతి గృహ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయించాలని, అలాగే నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు బండారు సత్యానందరావు వెల్లడించారు. వాడపల్లిని టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేయడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకం మరింత విస్తరించడంతో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, కొత్తపేట నియోజకవర్గం మౌలిక సదుపాయాలు, పర్యాటక అభివృద్ధి పరంగా కొత్త దశలోకి అడుగుపెడుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆలమూరు-చొప్పెల్ల లాకుల ఆధునీకరణకు వినతి

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి టీడీపీ నాయకుల వినతిపత్రం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కొత్తపేట నియోజకవర్గ పర్యటనకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఆలమూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఆలమూరు మండలంలోని ఆలమూరు, చొప్పెల్ల లాకుల ఆధునీకరణ పనులను తక్షణమే చేపట్టాలని కోరారు. దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరుకున్న ఆలమూరు, చొప్పెల్ల లాకుల కారణంగా ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. లాకులను ఆధునీకరించి, నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేస్తే వేలాది ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేసి మరమ్మతులు, ఆధునీకరణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు మంత్రి నిమ్మల రామానాయుడు కొత్తపేట, ఆత్రేయపురం మండలాల్లో బొబ్బర్లంక జి.సి. హెడ్ స్లూయిస్, లోల్ల లాకులు, పలివెల లాకులు, ఆయకట్టు ప్రాంతాలను పరిశీలించి నీటి పారుదల పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటన సందర్భంగా ఆలమూరు మండల నాయకులు తమ ప్రాంత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గంగరాజు, రామానుజుల శేషయ్య, కడియాల శ్రీను పాల్గొన్నారు.

# రూ.కోట్లతో రోడ్డు నిర్మించారు

- సైడ్ బెర్మ్స్ నిర్మాణంలో నిర్లక్ష్యం వహించారు
- క్రుంగిపోతున్న బెర్మ్స్ నిర్మాణ పనులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

కోట్లాది రూపాయల నిధులతో రహదారులను నిర్మిస్తున్న అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఏడాది తిరగకుండా క్రుంగి దిగబడే పరిస్థితి నెలకొంటుంది. ఫలితంగా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనే విమర్శలు వెలివేస్తున్నాయి. దీనికి బాధ్యత అధికారులు వహిస్తారా ఎవరు వహిస్తారు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం పెనుమద్రు గ్రామంలో నిర్మించిన రహదారి ఈ కోవలోకి వస్తుందంటున్నారు.రూ. 189.47









లక్షలతో 2. 250 కి. మీ పొడవునా సిసి, మరియు తారు రోడ్డు నిర్మించారు. సెప్టెంబర్ 2025 లో ప్రారంభించి అనంతరం పూర్తి చేశారు. పి ఐ యు ఆధ్వర్యంలో పనులు చేశారు. అయితే సైడ్ బెర్మ్స్ నిర్మాణ పనుల్లో మాత్రం నిర్లక్ష్య వైఖరి అవలంబించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట బోధి వద్ద రిటైనింగ్ వాల్స్ వద్ద బెరమ్స్ పనులు దిగబడిపోవడంతో సైడ్ బెర్మ్స్ నిర్మాణాలు కుంగిపోయాయి. సైడ్ బెర్మ్స్ వద్ద గుల్లగా గ్రావెల్ను వేసి గట్టిపడే వరకు చదును చేయకుండా హడావిడిగా సైడ్ బెర్మ్స్ పనులు చేసేసారని విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా రహదారి ప్రారంభంలో కూడా సైడ్ బెర్మ్స్ పనులు మంట బోధలోకి కుంగిపోయాయి. బెర్మ్స్ నిర్మాణం ఫన్లో నిర్లక్ష్యంగా అవాలంభించారనడానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. దీనివల్ల రిటైనింగ్ వాల్స్ బోధిలోకి తొక్కేయడం కాకుండా రహదారి కి పట్టుత్వం పోయి నిర్మాణాలు ఆయుష్ తగ్గిపోతుందని, అతి తొందర్లోనే గోతులు పడి రోడ్డు నాశనం అయిపోతుందని పలువురు అంటున్నారు. కావున యుద్ధ ప్రాతిపదికన ఉన్నతాధికారులు ఈ రహదారికి సైడ్ బెర్మ్ పనులు పటిష్టంగా తిరిగి పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

# అయ్యా మాకు సాగునీరు ఇప్పించండి అంటూ బిల్లకుర్రు రైతుల ఆవేదన

- ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం.
- 11000 క్యూసెక్కుల విడుదల చేస్తే సరిపోయే సాగునీరు 14,700 క్యూసెక్కులు విడుదల చేసినా పంటకాల్వల్లోకి చుక్క నీరు రాకపోవడం దారుణం.
- నీరు లేని పంట కాలవలో బైక్ నడిపి నిరసన తెలియజేసిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగిరెడ్డి.
- రైతుల ఆవేదనను పట్టించుకోని మంత్రి, ఎమ్మెల్యేలు - ప్రచార ఆర్భాటాలకే పరిమితం.
- తక్షణమే సాగునీరు విడుదల చేయాలి, లేకుంటే ఇరిగేషన్ అధికారుల కార్యాలయాల ముట్టడి తప్పదు.





ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని బిల్లకుర్రు గ్రామం సమీపంలోని డ్యామ్ కాలువను జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాగునీరు అందక పంటకాల్వ వద్ద రైతులు ఎండ్రిన్ బాటిళ్లతో నిరసన చేపట్టడం బాధాకరమని పేర్కొంటూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఖరీఫ్ సీజన్ మధ్యలోనే సాగునీటి కోసం రైతులు నిరసనలకు దిగాల్సిన పరిస్థితి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని జగ్గిరెడ్డి అన్నారు. రైతులు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా, స్థానిక నాయకులు, అధికారులు వచ్చి రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి వెళ్లిపోవడం తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదని విమర్శించారు. ఉభయగోదావరి జిల్లాలో ప్రతి ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా 11 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరిపోతుందని, అయితే ఈసారి ప్రభుత్వం 14,700 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆ నీరు పంటకాల్వలు, బోదుల్లోకి చేరడం లేదని అన్నారు. ఇది పూర్తిగా నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. వేసవిలో కాల్వల మరమ్మతులు, పూడికతీత, తూములు, గొర్రెపు డెక్కల తొలగింపు వంటి పనులకు నియోజకవర్గానికి రూ.3 కోట్లు కేటాయించామని ప్రకటించినా, ఆ పనులు కాగితాలకే పరిమితమయ్యాయని, బిల్లులు మాత్రమే చెల్లించి రైతులకు ఉపయోగపడే ఒక్క పని కూడా జరగలేదని విమర్శించారు. ఫలితంగా కొత్తపేట నియోజకవర్గం ప్రారంభ ప్రాంతంలోనే నీరు ఆగిపోగా, చివరి ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేవస్థానం భూములను కౌలుకు తీసుకుని, బంగారం తాకట్టు పెట్టి, బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చుకుని సాగుకు సిద్ధమైన రైతులకు కనీసం సాగునీరు అందించలేకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని జగ్గిరెడ్డి అన్నారు. మంత్రి, ఎమ్మెల్యేలు ఒక్కసారి కూడా రైతుల సమస్యలను పరిశీలించలేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఆక్వా రైతులకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆక్వా రైతులతో పాటు వరి రైతులను కూడా తీవ్ర నష్టాల్లోకి నెట్టిందని ఆరోపించారు. ఉభయగోదావరి జిల్లాలో వేల కోట్ల రూపాయల వ్యవసాయ ఉత్పత్తికి కారణమైన రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యంతో కష్టాల్లోకి నెట్టడం దురదృష్టకరమన్నారు. లక్షల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నప్పటికీ సరైన వాటర్ మేనేజ్‌మెంట్ లేక రైతులకు చుక్క నీరు అందించడం లేదని విమర్శించారు. ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధులు, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేయడం కూడా ప్రభుత్వ వైఫల్యాన్ని అంగీకరించినట్లేనని జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లకుర్రుతో పాటు కొత్తపేట నియోజకవర్గంలోని అన్ని పంటకాల్వల్లో సాగునీరు విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఇరిగేషన్ అధికారుల కార్యాలయాలను ముట్టడించే ఉద్యమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంటుందని హెచ్చరించారు. రైతుల సమస్యలను ప్రచారంతో కాకుండా కార్యాచరణతో పరిష్కరించాలని, లేకపోతే రైతాంగం ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతుందని స్పష్టం చేశారు.

## సిబ్బంది సంక్షేమమే మా ధ్యేయం

-ఫిర్యాదులపై తక్షణ ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



ప్రజాభూమి ప్రతినిధి-అనకాపల్లి

జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రవేశపెట్టిన SP-SAMPARK' ఫోన్-ఇన్ కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, స్వయంగా ఫోన్ లైన్ ద్వారా సిబ్బంది సమస్యలను ఆలకించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారులకు మరియు క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య దూరాన్ని తగ్గించి, సిబ్బంది తమ వ్యక్తిగత లేదా వృత్తిపరమైన ఇబ్బందులను ఎటువంటి సంకోచం లేకుండా నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చేలా ఈ సరికొత్త వేదికను రూపొందించారు. జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది 93469 12011 నంబర్ ద్వారా నేరుగా ఎస్పీ తో మాట్లాడి తమ సమస్యలను వివరించారు.

## షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులు ఎంపికైన స్వర్ణ భారతి విద్యార్థులు

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి



మార్చి-2026లో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, ధర్మవరం విద్యార్థులు పోలిశెట్టి వర్షాంజలి (596/600), బెల్లపుకొండ నయన వెంకట సత్యశ్రీ (593/600) ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ పేరిచర్ల పద్మ, పాఠశాల ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు అవార్డులకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించా రు. కొవ్వూరు మండలంలో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో తమ పాఠశాల విద్యార్థులు ఇద్దరూ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, పాఠశాల యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# శివారు భూములకు సైతం నీరందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- వైసీపీ హయాంలో నీటిపారుదల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది.
- ఎల్ నినో ప్రభావంతో తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం.
- లొల్ల లాకుల వరకు మోటార్‌సైకిల్‌పై పర్యటించి పరిస్థితుల పరిశీలన
- మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.






ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

గోదావరి డెల్టాలో కాలువ చివరి భూముల వరకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం బొబ్బర్లంక నుంచి లొల్ల లాకుల వరకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి మోటార్‌సైకిల్‌పై పర్యటించి నీటి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం లొల్ల లాకుల వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జనసేన నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావంతో గోదావరిలో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని, అవసరమైన నీటిని సీలేరు నుంచి విడుదల చేసి డెల్టాకు అందిస్తున్నామని తెలిపారు. నీటి వినియోగంలో అధికారులు, రైతులు సమన్వయంతో వ్యవహరించాలని, ఎక్కడ నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నా వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అవసరమైతే వంతుల వారీగా నీటి పంపిణీ చేపట్టాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను రైతులు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ గోదావరి డెల్టా రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ధవలేశ్వరం బ్యారేజీ మరమ్మత్తులు, లొల్ల లాకుల పునర్నిర్మాణం వంటి పనులతో నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గోదావరి డెల్టా ఆధునీకరణకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెప్పారు.

### నీటి ఎద్దడిపై కలెక్టరేట్లో అధికారులతో

## మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష



ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్ర నీటిపారుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా లొల్ల లాకులు నుండి వన్నె చింతలపూడి లాకుల వరకు మధ్యలో ఉన్న సమస్యలను స్వయంగా పరిశీలించినారు. ఈ పర్యటన అనంతరం అమలాపురం కలెక్టరేట్ నందు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ యొక్క సమావేశానికి హాజరుకాని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది. ప్రతి మండలానికి సంబంధించిన అగ్రికల్చర్ ఆఫీసర్ మరియు ఇరిగేషన్ అధికారులను స్థానికంగా ఉన్న సమస్యలపై వివరణ మరియు అధికారులు తీసుకున్న చర్యలు గురించి ప్రశ్నించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు అగ్రికల్చర్ అధికారులు మరియు ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని ఏ ఒక్క రైతు కూడా నీటి ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్లే ఈ సమస్య వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి చెప్పడం జరిగింది.

# స్వర్ణాంధ్ర @2047 జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం



జిల్లాలో సమ్మిళిత అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి వార్షికంగా 15 శాతానికి పైగా +ఇూ వృద్ధిని సాధించేందుకు రూపొందించిన స్వర్ణాంధ్ర ఏ2047 జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టర్ చాంబర్ నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడానికి వ్యవసాయం, మత్స్యపంపకం, అటవీ, గనుల రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తయారీ రంగాన్ని (ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు) ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు ,సేవారంగ అభివృద్ధి కార్యాచరణ, పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు, అరటి ఉత్పత్తులు మత్స్య సంపద వంటి పరిశ్రమలను ప్రోత్సహించి జిల్లా స్థూల ఉత్పత్తిని పెంచేందుకు ప్రణాళికలు సిద్ధంచేయాలని అధికారులు ఆదేశించారు.

పప్పుధాన్యాలు, ఊరగాయలు, కొబ్బరి ఉత్పత్తు లు, చేపల ప్రాసెసింగ్, వస్త్ర రంగాల్లో పారిశ్రామిక సమూహాలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించడం, ఉత్పత్తుల నాణ్యతను పెంచడం, ఎగుమతుల ను ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో సమర్థవంతంగా వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. స్వర్ణాంధ్ర @2047 విజన్‌కు అనుగుణంగా పారిశ్రామికీకరణ, సుస్థిర అభివృద్ధి, ఉపాధి కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, సమ్మిళిత వృద్ధి లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం. మురళీ కృష్ణ, కోఆర్డినేటర్ మహమ్మద్ ఫైజాన్, ఎనలిస్టులు కె.వి .నారాయణ అబ్దుల్లా గౌరీ గాయత్రి తమీమ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

యువత గంజాయి, డ్రగ్స్ తదితర మాదకద్రవ్యాలు మరియు ఇతర చెడు వ్యసనాలకు పూర్తిగా దూరం ఉండాలని తాళ్లపూడి ఎస్ ఐ టి. రామకృష్ణ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ, కొవ్వూరు రూరల్ సీఐ సూచనలతో శుక్రవారం తిరుగుడుమెట్ట గ్రామంలో యూత్ కనెక్ట్ మీటింగ్ ను పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ తదితర మాదకద్రవ్యాలు మరియు సోషల్ మీడియా, ఇతర చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఎవరైనా మాదకద్రవ్యాలు సేవిస్తున్నా, విక్రయిస్తున్నా లేదా సరఫరా చేస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చినట్లయితే వారి వివరాలను పోలీసులకు తెలియజేసి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు. యువత చట్టాలను గౌరవిస్తూ మంచి మార్గంలో ముందుకు సాగాలని, నేరాలకు దూరంగా ఉండి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సాయి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపాలి

- దళిత యువకుడి హత్యపై ప్రభుత్వ స్పందన కోరిన ఎంఆర్పీఎస్.
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్ కుమార్.






ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

రావులపాలెం కొత్తకాలనీకి చెందిన మాదిగ సామాజిక వర్గ యువకుడు అనెం సాయి హత్య ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఏపీ ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంఘీభావం ప్రకటించింది. మాజీ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్ కుమార్ కూడా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన సునీల్ కుమార్, కేసును నిష్పాక్షికంగా, పారదర్శకంగా దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. హత్య వెనుక ఉన్న ప్రతి కోణాన్ని వెలికితీసి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దాసరి సువర్ణ రాజు మాట్లాడుతూ, దళిత యువకుడు హత్యకు గురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. అనెం సాయి కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్న అనుమానాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. హత్యకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేయాలని కోరారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై జరిగే అత్యాచారాల నిరోధక చట్టం (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం) కింద కూడా కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి ఘటనల్లో ప్రభుత్వం ప్రకటించిన విధంగానే అనెం సాయి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం మంజూరు చేయడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దళిత ప్రజాప్రతినిధులు కూడా ఈ ఘటనపై స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. రాజకీయ ప్రభావాలకు అతీతంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కేసును పారదర్శకంగా దర్యాప్తు చేసి నేరానికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాలని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉందుర్తి సుబ్బారావు మాస్టారు, రాష్ట్ర యువసేన అధ్యక్షుడు పొలిమేర కిరణ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, అంబేద్కర్ కోనసీమ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్‌లో సువర్ణ భారతి విద్యార్థుల ప్రతిభ

## -జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు






ప్రజాభూమి, హిందూపురం టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నీట్-2026 ఫలితాల్లో హిందూపురం సమీపంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాల, పూలకుంట అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మరోసారి తమ సత్తాను చాటుకున్నారు. జాతీయ స్థాయిలో విశిష్ట ర్యాంకులు సాధించి విద్యాసంస్థ ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని విద్యాసంస్థల అధ్యక్షులు




నీలకంఠారెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నీట్‌లో పీ. అశోక్ 559 మార్కులతో కామన్ ర్యాంక్ 14,751, జీ.పీ. రూప 553 మార్కులతో కామన్ ర్యాంక్ 4,278, ఎం.డి. మానస 469 మార్కులతో కామన్ ర్యాంక్ 16,689, కె. నవ్యశ్రీ 460 మార్కులతో కామన్ ర్యాంక్ 73,160, పీ. సాయికిషోర్ రెడ్డి 422 మార్కులతో కామన్ ర్యాంక్ 67,023, పీ. షగుఫ్తా ఖానం 410 మార్కులతో కామన్ ర్యాంక్ 29,181 సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా నీలకంఠారెడ్డి మాట్లాడుతూ, 2012లో ప్రారంభమైన సువర్ణ భారతి విద్యాసంస్థలు నీట్‌తో పాటు జేఈఈ, ఎంసెట్ తదితర పోటీ పరీక్షల్లోనూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయనిపేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి, వారి సామర్థ్యానికి అనుగుణంగా ప్రత్యేక శిక్షణ, క్రమబద్ధమైన పరీక్షలు, సందేహ నివృత్తి తరగతులు, వ్యక్తిగత పర్యవేక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయన్నారు. తమ విద్యాసంస్థలపై అపారమైన విశ్వాసంతో పిల్లలను చేర్పిస్తున్న తల్లిదండ్రుల నమ్మకమే తమకు మరింత బాధ్యతను పెంచుతోందని, వారి విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకే నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పోటీ స్ఫూర్తి, లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. ఈ విజయాలను విద్యార్థుల నిరంతర కృషికి, అధ్యాపకుల అంకితభావానికి, తల్లిదండ్రుల సహకారానికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో మరిన్ని జాతీయ స్థాయి విజయాలను సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని చెప్పారు. నీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యాసంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

# న్యాయమైన జీతాలు చెల్లించాలి

## -ఎంపీఈవోల ఆవేదన

## -రూ.35 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఉచిత వైద్యం, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్

## -20 నుంచి పెన్‌డౌన్

## -26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పచ్చని పంట పొలాల్లో రైతులకు అండగా నిలుస్తూ, ప్రభుత్వ వ్యవసాయ పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేస్తున్న తమలాంటి ఉద్యోగుల జీవితాలు మాత్రం ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతు న్నాయని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎంపీఈవోలు) ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమం కోసం నిత్యం శ్రమిస్తున్న తమ కష్టాలను ప్రభుత్వం గుర్తించి, ఉద్యోగ భద్రతతో పాటు కనీసం నెలకు రూ.35 వేల వేతనం, ఉచిత వైద్య సేవలు, ప్రమాద బీమా, సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎంపీఈవోల అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం హిందూపురం డివిజన్ పరిధిలోని హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, గోరంట్ల మండలాల ఎంపీఈవోలు ఆయా ఏడీఏ, ఏవో కార్యాలయాల్లో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా వ్యవసాయ శాఖకు వెన్నెముకలా పనిచేస్తూ రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ పథకాలను గ్రామీణ స్థాయిలో అమలు చేయించడం, క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలించడం, రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ తమ సేవలకు తగిన గుర్తింపు, గౌరవం, కనీస జీవన భద్రత కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నెలకు కేవలం రూ.12 వేల వేతనం, రూ.3 వేల ఇన్సెంటివ్ మాత్రమే అందుతోందని, పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, కుటుంబ పోషణ, పిల్లల విద్యా ఖర్చుల నేపథ్యంలో ఈ ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పైగా గత ఐదు నెలలుగా జీతాలు కూడా చెల్లించకపోవడం తమను మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసిందని వాపోయారు. ఇప్పటికే తమలో చాలామంది 12 సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ వయోభారానికి చేరుకున్నారని, ఇప్పుడు ఈ ఉద్యోగం వదిలి మరో ఉపాధి వెతుక్కునే పరిస్థితి లేదన్నారు. తమ జీవిత భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రూ.35 వేల కనీస వేతనం, ఉచిత వైద్య సేవలు, ప్రమాద బీమా, హెచ్ఆర్ పాలసీతో సమాన హక్కులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే ఈ నెల 20వ తేదీ నుంచి పెన్‌డౌన్ ఉద్యమం, 26వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉధృత ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. తమ నిరసనలు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కుటుంబాల మనుగడ కోసం చేస్తున్న న్యాయమైన పోరాటమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పల్లపు రాజేష్‌బాబు, విజయ్‌కుమార్‌రెడ్డి, సోమశేఖర్, అనిత, జెస్మా, భాను, తేజస్విని, ప్రమీల, సుకన్యతో పాటు హిందూపురం డివిజన్‌కు చెందిన ఎంపీఈవోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




# అనంతపురం పోలీసులకు ఫోర్టినెట్ ఇండియా సంస్థ నుంచి రూ.10 లక్షల విలువైన అత్యాధునిక ల్యాప్‌టాప్‌లు

## ఫోర్టినెట్ ఎం.డి కిశోర్ ను అభినందించి శాలువాతో సన్మానించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్

## సీఎస్ఆర్ కింద 20 ల్యాప్‌టాప్‌ల అందజేత -- మరో రూ.20 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లు త్వరలో అందజేస్తాం ఫోర్టినెట్ ఎండీ కిషోర్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ అయిన ఫోర్టినెట్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత ( సీ ఎస్ ఆర్) కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా పోలీసులకు రూ.10 లక్షల విలువైన 20 అత్యాధునిక ల్యాప్‌టాప్‌లను విరాళంగా అందించింది. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్‌ఏజీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎ.జి. అనిల్ కుమార్ తో కలిసి ఈ ల్యాప్‌టాప్‌లను జిల్లా ఎస్పీ పి. జగదీష్ కు అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ ఫోర్టినెట్ సంస్థ అందించిన ఈ ఉదార సహకారం పోలీసు శాఖకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రక్షక్ స్కూల్‌తో




పాటు సైబర్ క్రైమ్ విభాగం సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఈ పరికరాలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ ల్యాప్‌టాప్‌లు రక్షక్ స్కూల్లో డిజిటల్ విద్యా సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, జిల్లా పోలీసుల సైబర్ క్రైమ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి సైబర్ నేరాల నియంత్రణలో అనంతపురం పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేయడానికి ఈ సహకారం ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ మాట్లాడుతూ, సమాజంలో సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, ముఖ్యంగా పోలీసు వ్యవస్థను డిజిటల్‌గా మరింత బలోపేతం చేయడానికి తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. అనంతపురం జిల్లా పోలీసులకు మరో రూ.40 లక్షల విలువైన హైఎండ్ ల్యాప్‌టాప్‌లను పది రోజుల్లో అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ కు, అలాగే ఈ సీఎస్ఆర్ కార్యక్రమాన్ని అనంతపురం పోలీసులకు అందేలా సమన్వయం చేసిన ఏజీఎస్ ఫౌండేషన్ ఎ.జి. అనిల్ కుమార్ కు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థలు కలిసి పనిచేస్తే సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఈనెల 24వ తేదీన మెగా పేరెంట్ - టీచర్ మీట్ నిర్వహణ

- జిల్లాలో 1,724 పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహణ.. హాజరుకానున్న 10,499 మంది ఉపాధ్యాయులు, 1,28,644 తల్లిదండ్రులు, 1,67,434 మంది విద్యార్థులు..
- విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా మెగా పీటిఎం కార్యక్రమంలో పాల్గొనాలి
- సమన్వయంతో ఈ నెల24న జరగబోవు మెగా పేరెంట్ టీచర్ మీట్ కార్యక్రమం విజయవంతంగా పండుగ వాతావరణంలో నిర్వహణ- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ఈనెల 24వ తేదీన మెగా పేరెంట్ - టీచర్ మీట్ (మెగా పీటీఎం) కార్యక్రమం జిల్లాలో పండుగ వాతావరణంలో నిర్వహించబడుతుంది అని, సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో మెగా పేరెంట్ - టీచర్ మీట్ (మెగా పీటీఎం)పై ఇంచార్జి డిఈఓ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రాబోయే 24వ తేదీ శుక్రవారం రోజు మెగా పేరెంట్ - టీచర్ మీట్ (మెగా పీటీఎం) నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,724 పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో 10,499 మంది ఉపాధ్యాయులు, 1,28,644 తల్లిదండ్రులు, 1,67,434 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రభుత్వం తరపునుంచి గతేడాది ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో మొదటిసారి మెగా పీటీఎం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను రాబోయే రెండు మూడు రోజుల్లో ఉపాధ్యాయులు ఆహ్వానిస్తారని తెలిపారు. మినిట్ టు మినిట్ కార్యక్రమంను ప్రభుత్వం తరపు నుంచి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకి సంబంధించి అంటే రాబోయే సంవత్సరంలో, ఇంతకు ముందు సంవత్సరంలో ఏ విధంగా చదివి ఉన్నారు, అదే కాకుండా రాబోయే సంవత్సరంలో ఏం చేయబోతున్నాము అన్నది అక్కడ తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా మాట్లాడడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గ్యారంటీడ్ ఫంక్షనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (జిఎఫ్ఎల్ఎన్) గతేడాది 75 రోజుల పాటు ఒక కార్యక్రమం చేయడం జరిగిందని, విద్యార్థులు మొదటి స్థాయిలో ఏ విధంగా ఉన్నారు, వాళ్ళకి మాథ్స్ కానీ, బేసిక్ లాంగ్వేజ్ కానీ, తెలిసిన విషయాలు ఎంతవరకు తెలిసి ఉన్నాయి, ఎంతవరకు ఇంప్రూవ్ చేయగలిగాము అనే దానిపై వివరించడం జరుగుతుందన్నారు. గత ఏడాది ఎక్కువ మంది తల్లులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరు కావడం జరిగిందని, ఈ ఏడాది విద్యార్థులతల్లులతో పాటు తండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ఎక్కడికక్కడ పాల్గొనాలన్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులకు ఎంపిడిఓ, ఎంఇఓ లు తెలిపి పాల్గొనేలా చూడాలని తెలిపారు. అదేకాకుండా ఈ సంవత్సరం మనకు రెండు యాక్టివిటీస్ కూడా అదనంగా చేస్తున్నామన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ద్వారా రెండు మూడు నెలల్లో ప్రతి ఒక్క స్కూల్‌కి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సదుపాయాలకు అదనంగా ఏదైనా అవసరం ఉన్నచో వాటి వివరాలను తీసుకుని ప్రతిపాదనలు చేసుకుని ఒక డోనర్ ప్లాట్ఫామ్ కూడా ఆన్లైన్లో ఉంచడం జరిగిందని, ఆ డోనర్ ప్లాట్ఫామ్ ద్వారా ఎవరైనా చిన్నచిన్న వస్తువులు, పరికరాలు పాఠశాలలకు అందించవచ్చని తెలిపారు. దాతలు నేరుగా డోనర్ ప్లాట్ఫామ్ ద్వారా వివరాలు చూసుకుని డొనేట్ చేయడానికి అవకాశం ఉందని, డోనర్ ప్లాట్ఫామ్



గురించి తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. ప్రభుత్వం తరపు నుంచి లీప్ యాప్ అమలు చేయడం జరిగిందని, ప్రతి ఒక్క తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలకు సంబంధించిన ఎడ్యుకేషన్ సంబంధించిన విషయాలు, అటెండెన్స్, మార్కులు కావచ్చు, లేదంటే తల్లిదండ్రులు పిల్లలతో ఏ విధంగా మాట్లాడాలి, ఏ విధంగా విద్యార్థుల అకడమిక్ ఎక్సలెన్స్ ఇంప్రూవ్ చేయాలంటే ఏం సపోర్ట్ చేయాలి, లాంటివి కూడా ఈ లీప్ యాప్ ద్వారా వ్యక్తిగతంగా తల్లిదండ్రులకి తెలియజేయడానికి ప్రభుత్వం అమలు చేయడం జరిగిందన్నారు. లీప్ యాప్ ప్రతి ఒక్క తల్లిదండ్రులు డౌన్లోడ్ చేసుకోవాలని కోరుతున్నామన్నారు. డోనర్ ప్లాట్ఫామ్, లీప్ యాప్ గురించి మెగా పీటీఎంలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మెగా పీటీఎం నిర్వహణ గురించి విస్తృతంగా ప్రచారం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మినిట్ టు మినిట్ కార్యక్రమం వివరాలు మెగా పీటీఎం నిర్వహణకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమం వివరాలను జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉదయం 9:00 గంటల నుంచి 09:30 గంటల వరకు మెగా పీటీఎం ప్రారంభోత్సవం, తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, తదితరులు సీట్లలో కూర్చోవడం ఉంటుంది. ఉదయం 09:30 గంటల నుంచి 10:50 గంటల వరకు వన్ అండ్ వన్ ఇంటరాక్షన్, లీప్ యాప్ గురించి తెలపడం, కెరీర్ గైడెన్స్, స్కిల్ ఎడ్యుకేషన్, గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, వాటి గురించి వీడియోలు ద్వారా తెలియజేయడం, జిఎఫ్ఎల్ఎన్ యాక్షన్ ప్లాన్, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి వివరించడం, ఎస్ఎస్సి రిజల్ట్స్, ప్రభుత్వ పథకాలు, ముఖ్యమైన కార్యక్రమాల గురించి తెలపడం, తదితర అంశాలు, కార్యక్రమాల గురించి తెలియజేయడం జరుగుతుంది. 10:50 నుంచి 11 గంటల వరకు టిఎఆర్ఎల్ కిట్, ఎస్ఆర్కెవిఎం కిట్, స్పోర్ట్స్ మెటీరియల్, చిల్డ్రన్ మెటీరియల్ అండ్ మదర్ యాక్టివిటీలు, ఫోటో గ్యాలరీ ఉంటుంది. 11 గంటల నుంచి 11:20 గంటల వరకు తల్లులకు రంగోలి/ లెమన్ & స్పూన్ / మ్యూజికల్ చైర్స్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించడం జరుగుతుంది. ఉదయం 11:25 గంటల నుంచి 12:45 గంటల వరకు ఇన్విటేషన్, మా తెలుగు తల్లికి ప్రేయర్, పాఠశాల హెచ్ఎం స్కూల్ అకాడమిక్ ప్రోగ్రెస్ తెలపడం, తల్లికి వందనం గ్రూప్ డాన్స్, స్కూల్ టాపర్ స్పీచ్, లీప్ యాప్ & టెస్టిమోనియల్ యాప్ ఉపయోగం గురించి తెలపడం, డ్రగ్స్ వద్దు బ్రో స్పీచ్, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్పర్సన్ స్పీచ్, డోనార్ యాప్ & రిజిస్ట్రేషన్ ఆఫ్ వన్ డోనర్ లాంచ్, చీఫ్ గెస్ట్ మెసేజ్, విద్యార్థులకు క్వశ్చన్ అండ్ ఆన్సర్స్ సెషన్, వందన సమర్పణం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12:45 గంటల నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనంలో అందరూ పాల్గొననున్నారు. దీంతో ఈ కార్యక్రమం ముగియనుంది.

# గ్రంధాలయాల అభివృద్ధికి కృషి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బి.వెంకటనారాయణ

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లే విధంగా కృషి చేస్తామని అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి వెంకటనారాయణ (బి వెంకట్) తెలిపారు. శుక్రవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఛాంబర్ లో ఉమ్మడి జిల్లా గ్రంధాల సంస్థ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2026 - 27 వార్షిక బడ్జెట్ మంజూరైన నేపథ్యంలో పరిపాలన అనుమతితో సంస్థ నిధులను ఖర్చు చేయుటకు సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ వెంకట్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో పుస్తకాల విభాగాలు, పాఠకులకు అందుతున్న సేవలను మరింతగా విస్తృతంగా చేసి తగినంతగా వసతులు కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకొని వాటి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అంతేగాక విద్యార్థుల కోసం పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలుకు గ్రంథాలయాల మౌలిక వసతులు కల్పనకు గ్రంథాలయాలను దశల వారీగా డిజిటలైజేషన్ చేసే విధంగా ప్రణాళికకు ప్రాధాన్యం కల్పించడం జరిగిందన్నారు. ఈరోజు రాష్ట్రంలో కూటమీ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ సారధ్యంలో గ్రంథాలయాల అభివృద్ధి,




డిజిటలైజేషన్, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పుస్తకాల కొనుగోలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలో ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల పెన్షన్ల చెల్లింపుల కోసం రూ.18.21కోట్లను ఆమోదించారు. గ్రంథాలయాల మరమ్మతులకు రూ.2.28 కోట్లు మహిళా విభాగం మరియు పిల్లల విభాగం ఉన్న ఆడిటోరియంను ఎన్.టి. ఆర్ స్టడీ సెంటర్ మరమత్తుల కొరకు రూ 60,60,000/-. ఈ స్టడీ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతి యువకుల కొరకు పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాల కొనుగోలు, అధునాతన ఫర్నీచర్, కంప్యూటర్స్, ఎ/సి సౌకర్యాలు మొదలగునవి కల్పించి నిరుద్యోగ యువతి యువకులుకు ఉపయోగర్థం ప్రణాళికలు వీలైనంత త్వరగా ఈ ఏడాధి డిసెంబర్-2026 లోపు అందుబాటులో తీసుకొనివస్తామన్నారు. ఇందుకు దాతలు దాతలు సహకరించాలన్నారు. పదవి చేపట్టినప్పుడు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రంథాలయ సెస్ రూపంలో రూ.4 కోట్లు అందాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సెస్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సమావేశంలో గ్రంథాలయ సెస్‌ను చట్టం ప్రకారం నెలవారీగా గ్రంథాలయ ఖాతాలకు జమ చేస్తామని ప్రకటించడాన్ని సమావేశం స్వాగతిస్తూ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా అభివృద్ధి చేసే ప్రణాళికను వివరించారు. అలాగే సిఎన్ఆర్ నిధులతో గ్రంథాలయాలను ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశంలో గ్రంథాలయాల అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సెస్ వసూళ్ల పెంపు, డిజిటలైజేషన్, విద్యార్థులకు నాణ్యమైన సేవలను కల్పించే విధంగా ముందస్తు ప్రణాళిక చర్యలను సమగ్రంగా చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు సమాచారశాఖ ఎ పి ఆర్ ఓ ఆర్ ఫక్రుద్దీన్ గ్రంధాలయ కార్యదర్శి శివ ప్రసాద్ కార్యాలయ సిబ్బంది ఆర్.యస్.రాజు, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

రామాయణ మహాకావ్య సృష్టికర్త, ఆదికవి మహర్షి వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం తెల్లవారుజామున హిందూపురం-- అనంతపురం ప్రధాన రహదారిపై భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం అధ్యక్షులు వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హిందూపురం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్రబాబు, బాలాజీలు హాజరై భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రపంచానికి శ్రీరాముని ఆదర్శ జీవితం, సీతారాముల దాంపత్య మహిమను రామాయణం ద్వారా పరిచయం చేసిన మహర్షి వాల్మీకి భారతీయ సంస్కృతికి చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని కొనియాడారు. ధర్మ పరిరక్షణ, పితృవాక్య పరిపాలన, ప్రజాహితం, సోదరభావం వంటి విలువలను శ్రీరాముని జీవితగాథ ద్వారా ప్రపంచానికి తెలియజేసి, ఆ ఆదర్శ మార్గంలో ప్రజలు నడవాలని ఉపదేశించిన మహాకవి వాల్మీకిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. హిందూపురంలో మహర్షి వాల్మీకి విగ్రహం ఏర్పాటు కావడం వాల్మీకి సమాజానికే కాకుండా పట్టణ ప్రజలందరికీ గర్వకారణమని, ఈ విగ్రహం భావితరాలకు భారతీయ సంస్కృతి, ధర్మ విలువలను గుర్తు చేసే చిహ్నంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఆదినారాయణ, ఆకుల సూరి, లోకేష్, టింబర్ రాజు, శివ, సీతారాం, శీను, పవన్, పూలకుంట మాజీ సర్పంచ్ మంజునాథ్, రిటైర్డ్ ఆర్ఐ నరసింహులు, బద్రీ, వైటీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వైయస్ జగన్మోహన్ రెడ్డి సీమ క్యాన్సర్ గడ్డ అని నారా లోకేష్ విమర్శించడం సిగ్గుచేటు మాజీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జున రెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల : వైయస్ జగన్ మోహన్ రెడ్డి. సీమ. క్యాన్సర్ గడ్డ అని నారా లోకేష్ విమర్శించడం సిగ్గుచేటు అని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి . మాట్లాడుతూ రాష్ట్రానికి నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న నారా చంద్రబాబు . మరియు ఆయన తనయుడు లోకేష్ బాబు రాయలసీమకు సాగునీటి రంగానికి ఏమి చేశారో చెప్పాలని పిమాండ్ చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యు లేటరు. కెపాసిటీని 11 వేల క్యూసెక్కులు నుంచి. 44 వేల క్యూసెక్కులకు. కెపాసిటీని పెంచిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సొంత పార్టీలోనే తెలంగాణ నేతలు బహిరంగంగానే విమర్శించిన. తెలుగుదేశం పార్టీ నాయకులు దేవినేని ఉమా . ఆధ్వర్యంలో ధర్నాలు చేయించిన. లెక్కచేయకుండా. పూర్తి చేసిన ఘనత వైఎస్ఆర్ ది. శజల యజ్ఞం పేరుతో లక్ష కోట్లతో కోటి ఎకరాలకు సాగునీరు త్రాగునీరు కార్యక్రమాన్ని చేపట్టిన ఘనత వైఎస్ఆర్ దే. అయితే ఆయన హఠాత్ మరణంతో. జలయజ్ఞం పూర్తిగా కనుమరుగయిందిఅని. మరి ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు తెలుగు గంగ. గాలేరు నగరి.. ఎస్ ఆర్ బి సి. నెల్లూరు జిల్లా కు నీళ్ల ఇవ్వడం కోసం శ్రీశైలంలో 800.అడుగుల నుంచి. ఒక రోజుకు 3. టీఎంసీల నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా పంపించేసి రాయలసీమ ప్రాంతానికి నీటిని అందించే.విధంగా పనులు



ప్రారంభిస్తే. చంద్రబాబు. ముఖ్యమంత్రి అయిన తర్వాత. తెలంగాణ ప్రభుత్వానికి భయపడి. ఆ పనులను ఆపి వేయడం జరిగిందని. గత రెండు సంవత్సరాల్లో రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎంత ఖర్చు పెట్టారో తెలియజేయాలని కోరారు .ఎప్పుడు చంద్రబాబు. లోకేష్ బాబు. మంత్రులు నాయకులు..వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని విమర్శించడం మే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని. గతంలో వైయస్సార్. మరియు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాయలసీమకు ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎంత ఖర్చు పెట్టారో. మీరు నాలుగో సారి ముఖ్యమంత్రిగా పని చేస్తూ రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు ఎంత ఖర్చు పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని. నాగార్జున రెడ్డి డిమాండుచేశారు. ఇప్పుడు మీరు ఎన్ని అబద్ధాలు చెప్పినా ఎంత ప్రచారం చేసినా ప్రజలు ఎవరు నమ్మేవారు లేరని సోషల్ మీడియా ద్వారా గత ప్రభుత్వంలో ప్రజలకు ఏం చేశారు. ఇప్పుడు మీరేం చెప్పి. మీరేమీ ప్రజలకు చేస్తున్నారు అనేది .అందరూ గమనిస్తున్నారని నాగార్జున రెడ్డి అన్నారు.

# నవీషా జన్మదిన వేడుకల్లో దివ్యాంగులకు గృహోపకరణాల పంపిణీ

## దివ్యాంగుల మధ్య జరిగిన చిన్నారి నవీషా బర్త్‌డే వేడుకలు -అంగవైకల్యం శాపం కాదు: డాక్టర్ శరణ్య నవీన్

ప్రజాభూమి,పులివెందుల

డాక్టర్ శరణ్య నవీన్ దంపతుల కుమార్తె సాయి నవీషా 7వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందుల ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవన్‌లో దివ్యాంగులకు గృహోప కరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ కొండయ్య దంపతులు చిన్నారి నవీషాతో కలిసి జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళా దివ్యాంగులకు వైద్య దంపతులు సమకూర్చిన గృహోపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శరణ్య నవీన్ మాట్లాడుతూ అంగవైకల్యం భౌతిక శారీరక





లోపమే తప్ప అది జీవితాలకు శాపం కాదన్నారు. వికలత్వం శరీరానికే కానీ మనసుకు కాదని, అంగవైకల్యం అనువంశిక, జన్యుపర, వైద్యపర లోపమే గాని జన్మజన్మల శాపం కాదని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎంతోమంది వైకల్యాన్ని అధిగమించి విజేతలుగా నిలిచారని, వారి స్ఫూర్తితో దివ్యాంగులు వివిధ వృత్తుల్లో రాణించాలని కోరారు. చేతివృత్తుల శిక్షణలు అవయవాలు లేని వికలాంగులకు శ్రీరామరక్షగా నిలుస్తా యని చెప్పారు. తమ ఆసుపత్రిలో దివ్యాంగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని, ప్రతి ఏడాది కుటుంబ సభ్యుల పుట్టినరోజులను దివ్యాంగుల మధ్య జరుపుకుంటామని తెలిపారు. దివ్యాంగులు నవీషా ఆయు రారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డా. ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, టైలరింగ్ టీచర్ మల్లీశ్వరి, డా. కొండయ్య, రమాదేవి, డా. నవీన్, సాయి నవీషా, తనయ్ సాయి వత్సవ్, ప్రవీణ్, సోనీ భవాని, సంహిత్, జనార్ధన్, మాధురి, సౌజన్య, ఆసుపత్రి మేనేజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత"కు రూ.50 వేల విరాళం - శాశ్వత సభ్యత్వం స్వీకరించిన దాతలు

## -దాతల దాతృత్వాన్ని అభినందించిన మానవత కార్యవర్గం

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల "మానవత" స్వచ్ఛంద సేవా సంస్థకు ఇరువురు దాతలు కలిసి రూ.50 వేలు విరాళంగా అందజేసి శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. తొండూరు ఎంఈఓగా పనిచేసి దివంగతులైన వెన్నపూస శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం ఆయన శ్రీమతి లక్ష్మీకాంతమ్మ, కుటుంబ సభ్యులు డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ వసుంధరలు రూ.25 వేలు విరాళం అందించారు. అదేవిధంగా బలపనూరుకు చెందిన ఎలుగోటి శివనారాయణ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జగదీశ్వర రెడ్డి, సువర్ణలత దంపతులు రూ.25 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పెన్షనర్ల భవనంలో సంస్థ నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో సంస్థ చైర్మన్ డి.వి.కొండారెడ్డి, నూతన అధ్యక్షుడు చవ్వా కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ దాతల సేవానిరతిని, దాతృత్వాన్ని కొనియాడారు. 2026-27 సంవత్సరానికి పనులను వేగవంతం చేసేందుకు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని తీర్మానించారు. ఈ సమావేశంలో పులివెందుల పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఏ.వి.గోపాల్ రెడ్డి, సంస్థ కోశాధికారి హరిశ్చంద్రారెడ్డి, డైరెక్టర్లు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు బల్క్ వేస్ట్ జనరేటర్స్ అవగాహన ర్యాలీ

ప్రజాభూమి,పులివెందుల



స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 18, 2026న "బల్క్ వేస్ట్ జనరేటర్స్"పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పులివెందుల పురపాలక సంఘం కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8.30 గంటలకు ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించనున్నారు. మెప్మా కార్యాలయం ( బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర) నుండి ప్రారంభమై పూలంగళ్ళు సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, స్పెషల్ ఆఫీసర్ పులివెందుల అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పుర ప్రముఖులు, పుర ప్రజలు పాల్గొనాలని కమిషనర్ కోరారు.

# ఎమ్మార్పీ దరకే యూరియావిక్రయించాలి

## మండల వ్యవసాయ అధికారి వి చెన్నారెడ్డి

ప్రజాభూమి,పులివెందుల

ఎమ్మార్పీ ధరలకే యూరియాను డీలర్లు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయనకార్యాలయంలో యూరియా విక్రయించే ఎరువుల డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మండలంలో కొందరు డీలర్లు యూరియా అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇకనుంచి యూరియా అధిక ధరకు విక్రయిస్తే ఉన్నతాధికారులకు నివేదించి డీలర్ల లైసెన్సు రద్దు చేస్తామని తెలిపారు. పులివెందుల మండలంలో యూరియాతోపాటు అన్ని రకాల ఎరువుల కొరత లేదని తెలిపారు. యూరియా , డిఏపి ఎరువులను ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారావిక్రయించనున్నట్లు ఆయన తెలిపారు. పులివెందులలో ఏ ఎరువుల డీలర్ అయినా యూరియా ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరకు విక్రయిస్తే మండల వ్యవసాయ అధికారికి (8331057359 ) కాల్ చేసి చెప్పాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.



# కప్పల లక్ష్మీదేవి నేత్రదానం - ఇద్దరు అంధులకు చూపునిచ్చిన మహోన్నత సేవ

ప్రజాభూమి,సింహాద్రిపురం



సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన కప్పల లక్ష్మీదేవి (73) మరణించగా, ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించి ఆదర్శంగా నిలిచారు. మృతురాలి కుమారులు వెంకట నారాయణ, కొండప్ప, కుమార్తెలు సరోజ, చంద్రకళ, కోడళ్ళు సావిత్రి, నాగేశ్వరి, అల్లుళ్లు జయసింహ, సూర్య నారా యణ, మనవళ్లు రాఘవేంద్ర, రాజు, పృథ్వీరాజ్, సాయి కిరణ్, భాను కిరణ్, మనవరాళ్లు సువర్ణ, ఊర్మిళ, హేమలత, యశోద, దీపిక, మౌనికలు నేత్రదానం చేయాలని నిర్ణయించి జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ ప్రశాంత్‌తో కలిసి మృతురాలి నివాసానికి చేరుకుని పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించారు. అనంతరం వాటిని హైదరాబాద్‌లోని ఎల్.వి. ప్రసాద్ నేత్రాలయానికి పంపించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం లభించనుంది. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ, కుటుంబ సభ్యుడు లేదా సన్నిహి తుడు మరణించిన సందర్భంలో నేత్రదానం చేయదలచిన వారు 9966509364 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఒక మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు వెలుగు నింపవచ్చని, మరణించిన తర్వాత కూడా వారి చూపు ఈ ప్రపంచాన్ని మరొకరికి చూపించే మహోన్నత సేవగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం నేత్రదానం పట్ల అవగాహన పెంచుకుని ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నేత్రదానం చేసిన కప్పల లక్ష్మీదేవి కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు, బంధువులు, సన్నిహితులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీట్-2026లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థిని ప్రతిభ

## - విద్యార్థిని విజయంపై హర్షం వ్యక్తం చేసిన కరస్పాండెంట్ కొట్టె నారాయణ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని పాత గండి రోడ్డులో ఉన్న నారాయణ విద్యాసంస్థల విద్యార్థిని పి. తేజస్విత ఇటీవల విడుదలైన నీట్--2026 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 720 మార్కులకు 560 మార్కులు సాధించి ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ కొట్టె నారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థిని సాధించిన విజయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం సంస్థలకు గర్వకారణమని పేర్కొన్నారు. తేజస్విత భవిష్యత్తులో వైద్య విద్యను పూర్తి చేసి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించిన సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు ఆమె మరిన్ని ఉన్నత విజయాలు సాధించి సంస్థలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం

**ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడుతూనే ఉంటాం**

**వైకాపా ధ్యేయం ప్రజా సమస్యల పరిష్కారం: ప్రజాదర్బార్‌లో ఎంపీ అవినాష్ రెడ్డి**

ప్రజాభూమి,పులివెందుల



వైకాపా పార్టీ ఎల్లవేళలా నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా పార్టీ ధ్యేయమని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పులివెందుల నివాస ప్రాంగణంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలను అందజేశారు. కొంతమంది నేరుగా సమస్యలు వివరించగా, మరికొంతమంది సమస్యలను సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే పరిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ఎల్లకాలము ఒకేరోజు ఉండవు. మనకు మంచి రోజులు వస్తాయి. నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దు. వైకాపా పార్టీ మీకు ఎల్లవేళలా అండగా ఉంటుంది"అని ధైర్యం చెప్పారు. జగనన్న సంక్షేమ పాలనను గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైకాపా ప్రభుత్వం నవరత్నాల ద్వారా ప్రజా రంజకమైన పాలన అందించిందన్నారు. "జగనన్న ఇంటింటికీ పింఛన్లు, అమ్మ ఒడి, రైతు భరోసా, వాలంటీర్ వ్యవస్థ, గ్రామ సచివాలయాల ద్వారా డోర్ డెలివరీ సంక్షేమం అందించారు. పేదవాడి కోసం రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశారు" అని కొనియాడారు.

కూటమి ప్రభుత్వంపై ఫైర్ : ఎన్నికలకు ముందు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం 25 నెలలైనా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు నత్తనడకన నడుస్తున్నాయని, విద్యార్థులను, నిరుద్యోగులను నిలువెత్తున మోసం చేసిందని ఆరోపించారు. ఓటు వేసిన ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వెన్నుపోటు ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు" అని ఎంపీ అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ అన్ని గమనిస్తున్నారని, మళ్లీ వైకాపా అధికారంలోకి వచ్చి జగనన్న నాయకత్వంలో సంక్షేమ పాలనను కొనసాగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులకు చెక్: డాక్టర్ మురళి

ప్రజాభూమి, సిద్ధవటం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని పి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళి తెలిపారు. సిద్ధవటం మండలం సంటిగారిపల్లె గ్రామం లో శుక్రవారం నిర్వహించిన 104 వైద్య శిబిరంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళి మాట్లాడుతూ, జలుబు, దగ్గు, విరోచనాలు



వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు స్వయంగా మందులు వాడకుండా సమీప ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, 104 వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# శుక్రవారం వేళ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ప్రజాభూమి, సిద్ధవటం: మాచుపల్లి గ్రామంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజైన శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్బరాజు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజల్లో అమ్మవారికి పవిత్ర జలాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి,



అనంతరం పుష్పాలు, పత్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు, కుంకుమార్చనలు, మహామంగళహారతులు ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా మాచుపల్లి గ్రామంతో పాటు సిద్ధవటం మండలంలోని పరిసర గ్రామాలు, జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం అర్చకులు భక్తులకు వేదాశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ సభ్యులు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసి దర్శనం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

# పగిలిన మంచినీటి ట్యాంకుతో విద్యార్థులకు తాగునీటి కష్టాలు

ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని ఉక్కాయపల్లె ప్రాథమిక పాఠశాలలో గత రెండు నెలలుగా మంచినీటి ట్యాంకు పగిలిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజూ తమ ఇళ్ల నుంచి నీటి సీసాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే స్పందించి కొత్త మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేసి విద్యార్థులకు



తాగునీటి సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయురాలు నిహారిక మాట్లాడుతూ, మంచినీటి ట్యాంకు పగిలిపోయిన విషయం వాస్తవమేనని, సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# డీకేటీ రైతు భూమి ఆన్‌లైన్‌లో అక్రమ బదిలీ?..


## - వృద్ధ మహిళా రైతు న్యాయం కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో డీకేటీ పట్టా భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్లకు నమోదు చేసి కబ్జా చేశారని ఓ వృద్ధ మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ, సర్వే నంబర్ 76లో 2.44 ఎకరాల డీకేటీ భూమి 1988లో తన భర్త వెంకరెడ్డి పేరుతో మంజూరైందని, ఆ భూమిలో సాగు చేసుకుంటూ జీవనం సాగించామని తెలిపింది. 2022లో తన భర్త అనారోగ్యంతో మంచానపడి అనంతరం మృతి చెందగా, స్థానికేతర వ్యక్తి రాజకీయ పలుకుబడితో తన బంధువుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూమిని కాజేశాడని ఆరోపించింది. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదని వాపోయింది. ఈ విషయమై స్థానిక వీఆర్వో కేశవులు మాట్లాడుతూ, సర్వే నంబర్ 76లో భూమి ప్రస్తుతం లక్ష్మమ్మ సాగులోనే ఉందని తెలిపారు. మాధవరం గ్రామానికి చెందిన సంబంధిత వ్యక్తికి ఇప్పటికే మూడుసార్లు విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించలేదన్నారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు మరోసారి నోటీసులు జారీ చేసి పూర్తి స్థాయి విచారణ నిర్వహించి, నిజమైన హక్కుదారుడికి న్యాయం చేస్తామని వెల్లడించారు.

# పైప్‌లైన్ లీకేజీతో వృథాగా తాగునీరు..

## - నెలరోజులుగా మరమ్మతులు లేక కాలనీవాసుల ఆగ్రహం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మూలపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా నెలరోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైప్‌లైన్ మరమ్మతుల కోసం గత నెలలో గోతులు తవ్వి పనులు మధ్యలోనే నిలిపివేయడంతో నీరు నిరంతరం వృథా అవుతుండటంతో పాటు, తాగునీటి సరఫరా కూడా సక్రమంగా అందడం లేదని వాపోయారు. గోతులు అలాగే ఉండటంతో చిన్నారులు ప్రమాదవశాత్తు వాటిలో పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్ను వివరణ కోరగా, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, త్వరితగతిన మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# శెట్టిపల్లి--చెన్నాయగుంట సచివాలయ భవనానికి పేరుపలక కూడా లేదు..!

**అధికారులు స్పందించి వెంటనే నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి**



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లి–చెన్నాయగుంట గ్రామ సచివాలయ భవనం ముందు ఇప్పటికీ సచివాలయం పేరును సూచించే కనీస నేమ్‌బోర్డు కూడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ వివిధ ప్రభుత్వ సేవల కోసం వచ్చే ప్రజలు ఇది ఏ సచివాలయమో, ఇక్కడ ఏయే సచివాలయాల పరిధి కార్యాలయాలు పనిచేస్తున్నాయో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుండగా, కనీస గుర్తింపు బోర్డు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు. గ్రామానికి కొత్తగా వచ్చే ప్రజలు, వృద్ధులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే లబ్ధిదారులు సరైన కార్యాలయాన్ని గుర్తించలేక పలుమార్లు ఇతరులను అడుగుతూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయ భవనం ముందు స్పష్టంగా కనిపించేలా శాశ్వత నేమ్‌బోర్డును ఏర్పాటు చేయాలని, అలాగే ఆ భవనంలో ఏయే గ్రామ సచివాలయాలు, ఏ శాఖల కార్యాలయాలు పనిచేస్తున్నాయో వివరాలతో కూడిన సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు కనీస గుర్తింపు లేకుండా ఉండడం తగదని, వెంటనే చర్యలు తీసుకుని నేమ్‌బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ -: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను ఒకే వేదికపై పరిష్కరించే లక్ష్యంతో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లిలోని రఘునాథ్ రిసార్ట్స్‌లో ఉన్న చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను సవివరంగా విన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి, వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే వేదికపై సమస్యలకు పరిష్కారం అందించడమే ప్రజా దర్బార్ ఉద్దేశమని వివరించారు. చిన్న చిన్న సమస్యలను అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ సంబంధిత కోర్టు కేసులను మాత్రం న్యాయస్థానం ద్వారానే పరిష్కరించుకోవాలని అర్జీదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# భక్తుడు పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేసిన సెక్యూరిటీ గార్డ్



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో భక్తుడు పోగొట్టుకున్న సెల్ ఫోను తిరిగి ఇచ్చేసిన సెక్యూరిటీ నిజాయితీ ని భక్తులు ప్రశంసించిన సంఘటన దేవస్థానంలో జరిగింది. వివరాల్లోకి వెళితే శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం నిత్యం భక్తులతో కిటకిలాడుతు ఉంటుంది. శుక్రవారం స్వామి అమ్మవారి దర్శనానికి మహరాష్ట్ర నుంచి కారులో వచ్చిన భక్తులు తొందర పాటులో ఐ ఫోన్ ను కార్ బ్యానట్ పై వదిలి వెళ్లిపోవడం జరిగింది. కార్ పై ఉన్న సెల్ ఫోన్ ను సెక్యూరిటీ మించల చంద్రశేఖర్ గుర్తించి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని సెక్యూరిటీ సుపర్ వైజర్ సుబ్బారావు దృష్టికి తీసుకోని పోవడంతో భక్తులు వచ్చిన తరువాత వారికి అందజేయమని సుబ్బారావు సూచించారు. దీంతో స్వామి అమ్మవారి దర్శనం ముగించుకోని తిరిగి కార్ వద్దకు వచ్చిన భక్తులకు సెక్యూరిటీ మించల చంద్రశేఖర్ సెల్ ఫోన్ ను భక్తులకు అందించడం జరిగింది. శ్రీ కాళహస్తి ఈశ్వర సెక్యూరిటీ సిబ్బంది నిజాయితీని గుర్తించి భక్తులు అనందంతో సెక్యూరిటీ సిబ్బందిని అభినందించి 500 పారితోషికం అందించడం జరిగింది.

# బి.ఎన్. కండ్రిగలో మోటార్ వాహన శాఖ తనిఖీలు -- మూడు వాహనాలు సీజ్, రూ.60 వేల జరిమానా

ప్రజాభూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండలంలో శ్రీకాళహస్తి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ నాయుడు ఆధ్వర్యంలో మండల పరిసర ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన మూడు వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల సందర్భంగా పన్నులు చెల్లించని ఒక ట్రాక్టర్‌తో పాటు అవసరమైన పర్మిట్లు లేని రెండు లారీలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వాహనాలపై మొత్తం రూ.60 వేల మేర పన్నులు, జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దామోదర్ నాయుడు మాట్లాడుతూ వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన పన్నులు, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు, బీమా, పర్మిట్లు తదితర పత్రాలను సకాలంలో పొందాలని సూచించారు. తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బకాయి పన్నులతో పాటు 200 శాతం వరకు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్న ట్రాక్టర్–ట్రైలర్ల యజమానులు తప్పనిసరిగా పన్నులు చెల్లించి, ఫిట్‌నెస్ ధ్రువపత్రం, బీమా, పర్మిట్ వంటి అన్ని పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అలాగే చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలని, వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

# స్మైల్ ఫౌండేషన్ - హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**- గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు -- విశేష స్పందన**



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుపతి గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను చేరవేయాలనే లక్ష్యంతో స్మైల్ ఫౌండేషన్ మరియు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తండలం మండల పరిధిలోని పాడిపేట శేషాద్రి నగర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో డా. ఎన్. భావనా సమంత, స్టాఫ్ నర్స్ ఆర్. శోభన, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) రాజశేఖర్‌లతో కూడిన వైద్య బృందం గ్రామ ప్రజలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని అవసరమైన వైద్య సలహాలు అందించారు. రక్తపోటు, మధుమేహం, జ్వరం, శ్వాసకోశ సమస్యలు, సాధారణ అనారోగ్య లక్షణాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, యువకులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడు తున్నాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు స్మైల్ ఫౌండేషన్ మరియు హెచ్ డీఎఫ్‌సీ బ్యాంక్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను తరచూ నిర్వహించి గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని కోరారు.

పాడిపేట శేషాద్రి నగర్ గ్రామంలో స్మైల్ ఫౌండేషన్ –హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్న వైద్య బృందం.

# మట్టి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన -- నమూనాల సేకరణ విధానంపై ప్రత్యేక శిక్షణ

**భూసార పరీక్షల వ్యవసాయ అధికారి పి. పుష్పాంజలి**



ప్రజాభూమి ప్రతినిధి – బుచ్చినాయుడు కండ్రిగ

ప్రధానమంత్రి రైతు కృషి వికాస్ యోజన పథకం కింద బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కనమనంబేడు ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాల బి.ఎన్. కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మట్టి ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 8వ, 9వ తరగతులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ విధానంపై అవగాహన శిక్షణ అందించారు. తిరుపతి మట్టి పరీక్షల ప్రయోగశాలకు చెందిన వ్యవసాయ అధికారి పి. పుష్పాంజలి విద్యార్థులకు మట్టి నమూనాలు సేకరించే విధానాన్ని సిద్ధాంతపరంగా వివరించారు. అనంతరం మట్టి నమూనాల సేకరణ పద్ధతిని ప్రత్యక్షంగా ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక కేంద్రానికి చెందిన వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, వ్యవసాయవిజ్ఞాన కేంద్రం ప్రయోగశాల సాంకేతిక నిపుణురాలు ప్రియాంక, ఆత్మ బృంద సాంకేతిక నిర్వాహకురాలు ఎం. శైలజ, బుచ్చినాయుడు కండ్రిగ మండల వ్యవసాయ అధికారి కె. షణ్ముగం, వ్యవసాయ విస్తరణ అధికారి రేవతి పాల్గొన్నారు. కనమనంబేడు ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశుతోష్, ప్రిన్సిపాల్ ధర్మేందర్ సింగ్, ఉప ప్రిన్సిపాల్ గోపాల్ ఖామరి, బి.ఎన్. కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉపాధ్యాయులు శివప్రసాద్, జయశ్రీ, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూములలో ఆక్రమణల తొలగింపు

**దీర్ఘకాలిక దారి సమస్య పరిష్కరించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు.**



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై మండల స్థాయి అధికారుల టాస్క్ ఫోర్స్ ఉక్కుపాదం మోపి అక్రమణాలను తొలగించినట్లు తహశీల్దార్ యు మధుసూదన్ రావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం మండలంలోని పాత కందుల వారి పల్లి, కొత్త వేప కుప్పం, గ్రామాలలో ఆక్రమణలు తొలగించి అర్జీదారుల సమస్యలు పరిష్కరించామని తహశీల్దార్ యు మధుసూదన్ రావు, ఎస్సై భక్తవత్సలంలు తెలిపారు. కొత్త వేపకు గ్రామంలో రైతు దేగనాదంరెడ్డి పొలాలకు వెళ్లే దారిని గుర్నాథ్ రెడ్డి ఆక్రమించుకొని ఇబ్బందులు పెడుతున్నారని పిజిఆర్ఎస్ లో అర్జీ పెట్టుకున్నారు. దీనిపై పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుర్నాథ్ రెడ్డి ప్రభుత్వ భూమిలోని దారిని ఆక్రమించుకుని ఉన్నారని నిర్ధారణ కావడంతో వెంటనే ఎక్స్కవేటర్తో ఆక్రమణలు తొలగించి పొలాలకు దారి ఏర్పాటు చేశారు. దీంతో రైతు దేగనాథరెడ్డి కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించి బాధితులకు న్యాయం చేస్తున్నారని, ఇది మంచి ప్రభుత్వమని అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మధుసూదన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేసిన, ఆక్రమణకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను ఎన్ఫోర్స్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పరిరక్షిస్తామన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే వారిపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం మేరకు కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్స్కవేటర్, హిటాచి వాహన యజమానులు కూడా ప్రభుత్వ భూములు ప్రవేశించి, చదును చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని కంచెలు, పక్కా భవనాలు ఏర్పాటు చేసుకున్న వాళ్లు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేకపోతే భారీ యంత్రాలను ఉపయోగించి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ భూములో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం లో ఎస్సై భక్తవత్సలం, ఏఎస్ఐ ఈశ్వరయ్య హెడ్ కానిస్టేబుళ్లు చాకిరి రాజశేఖర్, ఓబుల్ రెడ్డి, గ్రామ సర్వేయర్ అశోక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# డిజిటల్ ఇండియా అంటున్నారు

**ఫోను మాట్లాడాలంటే ఇంటి మేడ ఎక్కాల్సిందే ...?**

**కంచరపాలెం పరిసరాల ప్రాంతంలో మొబైల్ నెట్‌వర్క్ దారుణం**

**సిగ్నల్ కోసం ఫోన్లో లో ఎదురుచూపులు చూస్తున్న గ్రామ ప్రజలు ..!**



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

వరదయ్యపాలెం మండలం కంచరపాలెం గ్రామంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. కాల్స్ మాట్లాడాలన్నా, ఇంటర్నెట్ వినియోగించాలన్నా ప్రజలు ఇళ్ల మిద్దెలు, బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరైతే వేరే ఊరికి వెళ్లిన సందర్భం కూడా ఉంది. డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ విద్య, బ్యాంకింగ్, ఉద్యోగ కార్యకలాపాలు అన్నీ నెట్‌పై ఆధారపడుతున్నప్పటికీ గ్రామంలో సరైన సిగ్నల్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగిగా పనిచేస్తున్న డా. గుత్తి భాగ్యలక్ష్మి కూడా విధుల నిర్వహణలో ఆటంకాలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రజా దర్బార్ లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రం సమర్పించిన డా. భాగ్యలక్ష్మి, గ్రామంలో శాశ్వత పరిష్కారంగా మొబైల్ టవర్ ఏర్పాటు చేయాలని కోరారు. "డిజిటల్ ఇండియా అంటున్నారు... కానీ కంచరపాలెంలో కనీస మొబైల్ సిగ్నల్ కూడా లేదు" అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వపాఠశాలవిద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ









ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలంలోని గుత్తి వారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు శుక్రవారం యు, ఎస్ , ఏ (లూయెనా ఫౌండేషన్) వారి ఆర్థిక సహాయంతో కడప జిల్లా ఖాజీపేట కు చెందిన పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో,డిక్షనరీలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మమహిళా మండలి ప్రాజెక్టుఆఫీసర్, జూలియన్ రాజుమాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతవిద్యార్థులు ఇంగ్లీష్ భాష పై పట్టు సాధించాలన్న ఉద్దేశంతో తమ వంతు సహాయంగా డిక్షనరీలను పంపిణీ చేసామని అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా నిత్యం ఒక్క పదం నేర్చుకుంటే భవిష్యత్తులోఉపయోపడుతుందని తెలిపారు. ప్రధాన ఉపాధ్యాయుడు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి సేవ చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. డిక్షనరీలను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూర్ అహ్మద్, జ్యోతిర్మయి, పురుషోత్తం, సుబ్రహ్మణ్యం, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

# నేడుశ్రీ వారాహి అమ్మవారికి సారె సమర్పణ మహోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

॥ ఓం శ్రీ విజయదుర్గాయై నమః ॥

॥ ఓం శ్రీ వారాహ్యై నమః ॥

శ్రీశ్రీశ్రీ విజయ దుర్గ పీఠాధిపతుల వారి దివ్య ఆశీస్సులతో...సర్వగ్రహ దోష నివారణకు, శత్రువులపై విజయ పరంపరకు మరియు సర్వ కార్య దిగ్విజయానికి గూడూరు లోని మన విజయ దుర్గ అమ్మవారి ఉప పీఠం నందు శ్రీ వారాహి అమ్మవారి పంచమి విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించబడుతున్నాయి. శ్రీ వారాహి అమ్మవారి గుప్త నవరాత్రి మహోత్సవాలలో భాగంగా, 18 జూలై 2026 శనివారం నాడు పంచమి తిథి, శ్రీ వారాహి అమ్మవారి జయంతి మహాపర్వదినం సందర్భంగా శ్రీ వశ్య వారాహి దేవి మహాలంకార పూజ కన్నులపండువగా జరగనుంది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, గూడూరు శివాలయం చైర్మన్ శ్రీ ఆరికట్ల బాలకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో, మంగళకరంగా "సారె సమర్పణ" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడుతుంది. శనివారం ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాల మొదలు మంగళ వాయిద్యాలు, తప్పెట్లు మరియు వేద ఘోషల మధ్య భక్తిశ్రద్ధలతో మన పీఠ భక్తులు పురవీధులలో ఊరేగింపుగా బయలుదేరి శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఉప పీఠానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పిస్తారు. కావున మీరందరూ తప్పనిసరిగా పై విశేష కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి యొక్క తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి యొక్క సంపూర్ణ ఆశీస్సులు పొందగలరు. ఆహ్వానితులు: శ్రీ విజయ దుర్గ ఉప పీఠ నిర్వాహకులు, శివాలయం చైర్మన్ శ్రీ ఆరికట్ల బాలకృష్ణ నాయుడు మరియు భక్త బృందం.

# 160--230 వోల్టేజ్‌తో ప్రజల ప్రాణాలు, పరికరాలు ప్రమాదంలో

**ఏళ్లుగా లో వోల్టేజ్ సమస్య... ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేకు యువకుడి ఘాటు వినతి – గతంలో కూడా అర్జీ ఇచ్చాం... ఫలితం లేదు ... ఇప్పుడైనా నాణ్యమైన విద్యుత్ ఇవ్వండి "**



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

గోవర్ధనపురం గ్రామంలో ఏళ్లుగా కొనసాగుతున్న లో వోల్టేజ్ సమస్యపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సరఫరా అవుతున్న విద్యుత్ తరచూ 190 నుంచి 230 వోల్టేజ్ మధ్య తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతుండటంతో ఇళ్లలోని ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, టీవీలు, మోటార్లు తదితర విద్యుత్ పరికరాలు తరచూ దెబ్బతింటున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ప్రజా దర్బార్‌లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు గోవర్ధనపురం గ్రామానికి చెందిన యువకుడు కల్లూరు మల్లికార్జున్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మీరు గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూడా ఇదే సమస్యపై అర్జీ ఇచ్చాం. కానీ ఎలాంటి పరిష్కారం జరగలేదు. ఇప్పుడు మళ్లీ ప్రజలు అదే కష్టాలు పడుతున్నారు. ఇకనైనా స్పందించి గ్రామానికి స్థిరమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించండి" అని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో లో వోల్టేజ్ సమస్య కారణంగా ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యుత్ శాఖ అధికారులు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా దర్బార్‌లో ఇచ్చిన ఈ వినతిపై ఎమ్మెల్యే స్పందించి సమస్యను త్వరగా పరిష్కరిస్తారా లేదా అన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# గోమాతకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి.



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

మన పురాతన సంస్కృతిలో గోమాతకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. నాకు మొదటి నుండి ఆవులన్నా, ముఖ్యంగా ఈ బుజ్జి ఆవులన్నా ఎంతో ఇష్టం. అందుకే నా నివాసంలో ప్రపంచంలోనే అత్యంత చిన్న జాతికి చెందిన "నాడీపతి నానో ఆవు" ని ఎంతో ముద్దుగా పెంచుకుంటున్నాము. ఉదయాన్నే ఈ చిన్నారి గోమాతతో కాసేపు సమయం గడపడం, దాన్ని ప్రేమగా నిమరడం మనసుకు ఎంతో ప్రశాంతతను ఇస్తుంది. గోరక్షణే మన ధర్మం – గోమాత ఆశీస్సులు మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

# ఆదిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఘనంగా "హ్యాకథాన్ ప్రయోగ్--2026"

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మకత మరియు ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించే లక్ష్యంతో ఆదిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "హ్యాకథాన్ ప్రయోగ్--2026" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ హ్యాకథాన్‌లో మొత్తం 60 బృందాలు, ఒక్కో బృందంలో 2 నుంచి 4 మంది విద్యార్థులతో ఉత్సాహంగా పాల్గొన్నాయి. హెల్త్ టెక్నాలజీ, అగ్రిటెక్ సస్టైనబుల్ సిస్టమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, ఫైనాన్షియల్ టెక్నాలజీస్ బ్లాక్‌చెయిన్, ఎడ్యుకేషన్ టెక్నాలజీ, స్మార్ట్ సిటీస్ ఢ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సోషల్ ఇంపాక్ట్ ఇన్నోవేషన్స్ మరియు ఓపెన్ ఇన్నోవేషన్ వంటి విభాగాల్లో వాస్తవ ప్రపంచ సమస్యలకు




సాంకేతిక పరిష్కారాలను రూపొందించి ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెఫర్సన్ డి., ఈ ఆర్ పి ఇంప్లిమెంటేషన్ ఆటోమేషన్ స్పెషలిస్ట్, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు ఇంజినీర్లకు పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలు, ఆటోమేషన్ సాంకేతికతలు మరియు ఆవిష్కరణాత్మక దృక్పథం ఎంతో అవసరమని పేర్కొన్నారు. 6 గంటల పాటు నిరంతరంగా నిర్వహించిన ఈ హ్యాకథాన్‌లో విద్యార్థులు తమ ఆలోచనలకు రూపకల్పన చేసి, ప్రోటోటైప్స్‌ను అభివృద్ధి చేసి, సాంకేతిక పరిష్కారాలను నిపుణుల ముందు ప్రదర్శించారు. విద్యార్థుల ప్రాజెక్టులను ఆవిష్కరణ, సాంకేతిక సాధ్యత, అమలు విధానం, విస్తరణ సామర్థ్యం మరియు సామాజిక ప్రయోజనం వంటి అంశాల ఆధారంగా నిపుణుల బృందం మూల్యాంకనం చేసింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బృందాలకు ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ బహుమతులతో పాటు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో డా. వంకి పెంచలయ్య, చైర్మన్; వంకి అరవింద, ఛాన్సలర్; శ్రీమతి వంకి అనూష, ప్రో ఛాన్సలర్; డా. ఎ. మోహన్ బాబు, ప్రో వైస్ ఛాన్సలర్; డా. ఎ. రాజయ్య, రిజిస్ట్రార్; డా. ధనుంజయ, ప్రొఫెసర్, డీన్, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ, వివిధ విభాగాల అధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ఇ విభాగాధిపతి మాట్లాడుతూ, "హ్యాకథాన్ ప్రయోగ్--2026" విద్యార్థుల సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా అన్వయించు కోవడానికి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిద్ధమయ్యేందుకు ఉపయోగకరమైన వేదికగా నిలిచిందని తెలిపారు. విద్యార్థుల్లో పరిశోధన, ఆవిష్కరణలు మరియు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంలో విశ్వవిద్యాలయ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తూ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వ్యాపారాలు నిర్వహించేలా చూడాలి

### మటన్, చేపల మార్కెట్ మార్పునకు ఏకగ్రీవ నిర్ణయం- :జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

ప్రజారోగ్యానికి భంగం కలిగించే వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న మటన్, చేపల మార్కెట్లను మరొక చోట మార్చేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం మినీ మీటింగ్ హాల్ నందు నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, డిప్యూటీ కమిషనర్ ఎన్. అమరయ్య, అడిషనల్ ఎస్పి రవి మనోహరాచారి, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ డా. యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, జిల్లా ఫుడ్ కంట్రోలర్ వేంకటేశ్వర రావు, ఏపీపీ పార్వతి ప్రియ, ఫిషరీస్ అధికారులు, తిరుపతి అర్బన్, రూరల్ తహశీల్దార్లు, తుడా విభాగాధిపతులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలోని లీలా మహల్ వద్ద నగర నడిబొడ్డులో వున్న చేపల మార్కెట్ వలన ట్రాఫిక్ కు, చుట్టుపక్కల




నివాస ప్రాంతాల వారికి ఇబ్బందికరంగా ఉ oదని ప్రజల నుండి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అలాగే పెద్దపీర్ల వారి చావిడిలోని మటన్ మార్కెట్ నిర్వహణ వలన పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్న ప్రజలకు అనేకరకాల వ్యాధులు, దుర్వాసన, న్యూసెన్స్ కలుగుతున్నదని, ఆంత్రాక్స్ వంటి వ్యాధులు రావడానికి ఆస్కారమున్నదని ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. కావున ప్రజలకు, వారి ఆరోగ్యానికి ఇబ్బందికరంగా ఉన్న మటన్ మార్కెట్ ను పెద్దపీర్ల చావిడి నుండి వైకుంఠపురం రోడ్డు పార్క్ వద్ద వున్న నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ లోనికి, లీలామహల్ వద్ద వున్న చేపల మార్కెట్ ను ఎమ్మార్ పల్లె, న్యూ బాలాజీ కాలనీ లోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లోనికి వెంటనే మార్చవలసినదిగా నిర్ణయించారు. అందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు వెంటనే చేయవలసినదిగా సంబంధిత విభాగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే భక్తులకు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా ఉండటంతో జూపార్క్ రోడ్డులో తొలగించిన వీధి వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలిపిరి వద్ద జూపార్కు రోడ్డులో తొలగించబడిన షాపులను ఇస్కాన్ రోడ్డు నుండి చెన్నారెడ్డి కాలనీలోకి వెళ్లే అభయ చరణారవింద భక్తి వేదాంత స్వామి ప్రభుపదుల మార్గం రోడ్డులోను, చింతలచేను వద్దగల కులశేఖర్ ఆల్వార్ వంద అడుగుల రోడ్డులో వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత వ్యాపారస్తుల ప్రజారోగ్యానికి భంగం కలుగకుండా తీసుకున్న చర్యలకు సహకరించి, వారి వ్యాపారాలను అధికారులు సూచించిన ప్రదేశాలలో పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని వ్యాపారస్తులకు తెలిపారు.

# ఢిల్లీలో డీ-రిజిస్టర్ చేసిన వాహనాల కొనుగోలుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### -ఒక వాహనం స్వాధీనం - తిరుపతి జిల్లా రవాణా శాఖ హెచ్చరిక

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

ప్రజలు పాత వాహనాలు కొనుగోలు చేసే సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా రవాణా శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ఇటీవల ఢిల్లీలో డి-రిజిస్టర్ చేయబడిన వాహనాలను కొందరు వ్యక్తులు ఇతర రాష్ట్రాలకు తీసుకువచ్చి, నకిలీ లేదా తప్పుడు పత్రాల ఆధారంగా చట్టబద్ధమైన వాహనాలుగా చూపిస్తూ విక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందుతోంది. డి రిజిస్టర్ అయిన ఢిల్లీ వాహనాన్ని మోటార్ వాహనాల తనిఖీ అధికారి శ్రీనివాస్ రావు స్వాధీనం చేసుకొని మంగళం డిపోకు తరలించారు. ఇటువంటి వాహనాలను కొనుగోలు చేయడం వల్ల కొనుగోలుదారులు చట్టపరమైన, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్ మరియు సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు ఢిల్లీలో 10 సంవత్సరాలు పూర్తి చేసిన డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాలు పూర్తి చేసిన పెట్రోల్ వాహనాలు డీ-రిజిస్టర్ చేయబ డుతు






చుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలియజేశారు. అనుమానాస్పదంగా తక్కువ ధరకు విక్రయించే వాహనాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, డి రిజిస్టర్ చేయబడిన వాహనాలు తనిఖీల్లో గుర్తించబడినట్లైతే మోటార్ వాహనాల చట్ట ప్రకారం ఆ వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. వాహన కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండి ఇటువంటి

న్నాయి. ఒకసారి అధికారికంగా డీ-రిజిస్టర్ చేసిన వాహనాలకు సాధారణంగా తిరిగి రిజిస్ట్రేషన్ పొందే అవకాశం ఉండదు. అందువల్ల వాహనం కొనుగోలు చేసే ముందు సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో లేదా వాహన్ పోర్టల్ ద్వారా వాహన రిజిస్ట్రేషన్ వివరాలు యాజమాన్య స్థితి మరియు చట్టబద్ధతను తప్పనిసరిగా ధ్రువీకరిం

అక్రమ లావాదేవీలకు దూరంగా ఉండాలని రవాణా శాఖ ఈ విషయంలో హెచ్చరిస్తోంది. వాహన రిజిస్ట్రేషన్ స్థితిని పోర్టల్ ను ఉపయోగించి సిటిజెన్ లాగిన్ ద్వారా పరిశీలించుకొనవచ్చును. అసలు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, యాజమాన్య వివరాలు, పన్ను చెల్లింపులు మరియు ఇతర పత్రాలను ధ్రువీకరించుకొనవచ్చును. ఢిల్లీ లేదా ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన పాత వాహనాల విషయంలో సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో నిర్ధారణ చేసుకోవాలి. అనుమానాస్పదంగా తక్కువ ధరకు విక్రయించే వాహనాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వాహన కొనుగోలుదారులు సరైన ధ్రువీకరణ చేసుకోకుండా వాహనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, అప్రమత్తంగా ఉండాలని రవాణా శాఖ సూచిస్తోంది. అనుమానాస్పద వాహన సమాచారం తెలిసిన వెంటనే సమీప రవాణా శాఖ కార్యాలయానికి లేదా పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

## - విద్యార్థులు డిజిటల్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ యుగంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా మరియు ఆన్‌లైన్ లావాదేవీలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి, క్రైమ్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ చెల్లింపులను ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోరాదని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, సందేశాలు, కాల్స్‌ను






నమ్మి వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు వెల్లడించరాదని తెలిపారు. ఏదైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. క్రైమ్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెరిగడం వల్లే మోసాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, ఫేక్ అకౌంట్లు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో వచ్చే మోసాలు, లాటరీలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల ఆఫర్లు వంటి వాటి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, పాస్‌వర్డ్ ఇతరులతో పంచుకోవద్దని, బలమైన పాస్‌వర్డ్ ఉపయోగించడంతో పాటు రెండు దశల భద్రత తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ, ప్రస్తుతం సైబర్ నేరస్తులు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఫిషింగ్ లింకులు, క్యూఆర్ కోడ్ మోసాలు, స్క్రీన్ షేరింగ్ యాప్‌లు, ఫేక్ కస్టమర్ కేర్ నంబర్లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాల గురించి విద్యార్థులకు వివరించారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు లేదా లింకులు అందినప్పుడు వెంటనే స్పందించకుండా వాటి నిజానిజాలు తెలుసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ కు కాల్ చేయాలని, అలాగే పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చని వివరించారు. విద్యార్థులు డిజిటల్ ప్రపంచంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సోషల్ మీడియాను సానుకూల ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించాలని వక్తలు సూచించారు. తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించకుండా ఉండడం, వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచడం, ఆన్‌లైన్‌లో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు చేసినా అధికారిక యాప్‌లు, వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించడం ద్వారా సైబర్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు, పోలీసు అధికారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పరామర్శ - ఆరోగ్య సమీక్ష హీలియోస్ ఆసుపత్రి - తిరుపతి జనసేన పార్టీ

### ఆపదలో అండగా... స్పందనలో ముందుగా జనసేన నాయకులు దండి నరేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

బోడవరం నుండి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన నాయకుడు ధనా సోదరులు చిట్టిబాబు ప్రస్తుతం హీలియోస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆయన ఆసుపత్రిలో చేరిన సజావుగా జరిగేలా నిన్న హీలియోస్ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగింది. అనంతరం ఈరోజు ఆసుపత్రికి వెళ్లి చిట్టిబాబు ని పరామర్శించి, చికిత్స అందిస్తున్న డా. శ్రీనివాస్ రెడ్డి, డా. కెన్నెట్, డా. మల్లికార్జున్, డా. హరీష్ తో ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యుల ప్రకారం ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతూ చికిత్సకు సానుకూలంగా స్పందిస్తున్నారని రెండు రోజుల్లో నార్మల్ వార్డ్ కు షిఫ్ట్ చేసే అవకాశం ఉందని తెలిపారు.ఈ సందర్భంగా చిట్టిబాబు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.ఈ పరామర్శ కార్యక్రమంలో జనసేన నాయకులు లక్ష్మణ్, నవీన్, ధనా, మస్తాన్, దివాకర్, వెంకటయ్య గార్లతో పాటు వాగివేడు గ్రామ జనసైనికులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.



# ప్రైవేట్ స్కూల్,కాలేజీ,బస్సు డ్రైవర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి.ఏ.ఐ.ఆర్.టి.డి.డబ్ల్యు.ఎఫ్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు.

కనీస వేతన చట్టాన్ని ప్రైవేటు స్కూల్,కాలేజీ బస్సు డ్రైవర్లకు, అమలు చేయాలని శుక్రవారం రోజు గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో బస్సు డ్రైవర్లు కి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం జిల్లా కార్యదర్శి కె.సురేష్ తెలియజేశారు. నెల్లూరు జిల్లాలో దాదాపుగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లు సుమారు వెయ్యి మందికి పైగా ఉన్నారని, వీళ్లకు నెలకు పదివేల నుండి 18 వేల లోపల జీతం తీసుకుంటే కార్మికులు ఉన్నారని, వీళ్లకు ఎటువంటి కార్మిక హక్కులు లేవని, పి.ఎఫ్,ఇ.ఎస్.ఐ సౌకర్యాలు లేవని, వేతనంతో కూడిన సెలవులు, విశ్రాంతి గదులు,మధ్యాహ్నం భోజన సదుపాయాలు లేవని, సదుపాయాలన్నీ కల్పించడానికి మరియు ప్రతి ఒక్క డ్రైవర్ కు కనీస వేతనం రూ.26,000/- ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, ఆయన డిమాండ్ చేశారు. గూడూరు సి.ఐ.టి.యు కార్యదర్శి మాట్లాడుతూ డ్రైవర్ కు నెలకు కనీసం ఒక సెలవు ఇవ్వాలని,డ్రైవర్ల పిల్లలకు ఆ స్కూలు మరియు కాలేజీ నందు ఒకరికి ఉచిత విద్య అందజేయాలని, ఉదయం నుండి సాయంత్రం వరకు స్కూలు,కాలేజీ,దగ్గర ఉండే డ్రైవర్లకు మధ్యాహ్నం భోజనం మరియు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, విద్యాసంస్థలలో ఎక్కువ బస్సులు కలిగినటువంటి యాజమాన్యం అదనంగా ఇద్దరు డ్రైవర్లను ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు రెండు జతలు యూనిఫారం ఇవ్వాలని, ప్రతినెల 1వ తేదీ జీతం ఇవ్వాలని పలు డిమాండ్లపై ఈనెల 30వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నా కార్యక్రమంలో డ్రైవర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు



# పూలతోట స్కూల్లో తహశీల్దార్ రాజేంద్ర మెరుపు తనిఖీ: స్వయంగా మధ్యాహ్నం భోజనం రుచి చూసి నాణ్యత పరిశీలన!

### మెనూ పక్కాగా అమలు చేయాలని సిబ్బందికి ఆదేశం.. విద్యార్థులతో ముచ్చటించి వివరాలు అడిగి తెలుసుకున్న తహశీల్దార్ రాజేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి దొరవారి సత్రం.

దొరవారిసత్రం మండల తహశీల్దార్ రాజేంద్ర పూలతోట గ్రామ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి, అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించారు. వంటగది పరిసరాల పరిశుభ్రతను, ఆహార నాణ్యతను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన తహశీల్దార్.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజువారీ మెనూను పక్కాగా అమలు చేయాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీల్లో భాగంగా వండిన మధ్యాహ్న భోజనాన్ని తహశీల్దార్ స్వయంగా రుచి చూసి నాణ్యతను పరీక్షించడంతో పాటు, భోజనం ఎలా ఉందో అక్కడ ఉన్న చిన్నారి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని, పాఠశాలలో తాగునీరు, కనీస మౌలిక వసతులు ఎల్లప్పుడూ మెరుగ్గా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.



# ఆపదలో అండగా... స్పందనలో ముందుగా జనసేన నాయకులు దండి నరేంద్ర

### - రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన నాయకులు ధన సోదరులు చిట్టిబాబు ను పరామర్శించిన దండి నరేంద్ర ఆసుపత్రి చేరిక నుంచి చికిత్స పురోగతి వరకు స్వయంగా పర్యవేక్షించిన దండి నరేంద్ర


ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి

బోడవరం నుండి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన నాయకుడు ధనా సోదరులు చిట్టిబాబు గారు ప్రస్తుతం హీలియోస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆసుపత్రిలో చేరిక సజావుగా జరిగేలా నిన్న హీలియోస్ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగింది. అనంతరం ఈరోజు ఆసుపత్రికి వెళ్లి చిట్టిబాబు గారిని పరామర్శించి, చికిత్స అందిస్తున్న డా. శ్రీనివాస్ రెడ్డి, డా. కెన్నెట్, డా. మల్లికార్జున్, డా. హరీష్ తో ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యుల ప్రకారం ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతూ చికిత్సకు సానుకూలంగా స్పందిస్తున్నారని రెండు రోజుల్లో నార్మల్ వార్డ్ కు షిఫ్ట్ చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా చిట్టిబాబు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఈ పరామర్శ కార్యక్రమంలో జనసేన నాయకులు లక్ష్మణ్, నవీన్, ధనా, మస్తాన్, దివాకర్, వెంకటయ్య గార్లతో పాటు వాగివేడు గ్రామ జనసైనికులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.




# ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన రోడ్డు ప్రారంభోత్సవం.

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

ఏర్పేడు మండలం లో ఈరోజు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. చేతులమీదుగా ఏర్పేడు–వెంకటగిరి మెయిన్ రోడ్డు నుండి 45 లక్షల రూపాయలతో నాగంపల్లె కి సిమెంట్ రోడ్డు ను ప్రారంభోత్సవం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు మరియు సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి,శివశంకర్ రెడ్డి, సూరి నాయుడు, మోహన్ నాయుడు, బాలు నాయుడు,పాపిరెడ్డి, క్లస్టర్ రాఘవేంద్ర, యూనిట్ రాచేటి సుబ్రమణ్యం, కేశినేని సుబ్రమణ్యం గాలి క్రిష్ణవేణి, సుబ్రమణ్యం రెడ్డి, జి సుబ్రమణ్యం రెడ్డి, మునిరెడ్డి, మునిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి ,కేకే రమణ, గుణ యాదవ్, వై మనోహర్ నాయుడు మరియు మండల టీడీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాదర్బార్‌లో వినిపించిన మరో ఆవేదన

"రైతులకు సేవలందిస్తున్నాం... కానీ సిబ్బంది ఎక్కడ ?"

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.
సాధారణంగా ప్రజాదర్బార్‌కు ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారు. అయితే శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో రైతుల సమస్యలు సందర్భంగా ప్రభుత్వ అధికారి తన శాఖ ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం ప్రత్యేకత సంతరించుకుంది.వరదయ్య పాలెం మండల వ్యవసా య అధికారి (ఎంఏఓ ) గౌరి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కలిసి మండలంలో వ్యవసాయ శాఖ ఎదుర్కొం టున్న సిబ్బంది కొరతపై ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో సుమారు 10 వేలమంది రైతులు, 19 వేలు ఎకరాలు సాగుకు 12 రైతు సేవా కేంద్రాలు ( ఆర్ ఎస్ కె లు) ఉండగా, ప్రస్తుతం కేవలం నలుగురు రైతు సేవా కేంద్ర సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విత్తనాలు, యూరియా వగైరా పంపిణీ చేయాలన్నా, ఈ క్రాప్ పంట నమోదు చేయాలన్నా, ధాన్యం కొనుగోలు కూడా ఈ నలుగురే చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రతి రైతుకు సకాలంలో సేవలు అందించడం తీవ్ర ఇబ్బందిగా మారిందని చెప్పారు."మా శక్తివంచన లేకుండా రైతులకు సేవలందిస్తున్నాం. అయితే సరిపడా సిబ్బంది లేకపోవడంతో తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తున్నాం. మా పరిస్థితిని కూడా ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేసి తగిన సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకో వాలి" అంటూ



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ అధికారిణి ఆవేదనను ఓర్పుగా విన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మండలానికి అవసరమైన సిబ్బంది నియామకానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో పనిచేసే వ్యవసాయ అధికారులపై పెరుగుతున్న పనిభారం ఆందోళన కలిగిస్తోంది. రైతులకు మెరుగైన సేవలు అందాలంటే ఖాళీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయడం, రైతు సేవా కేంద్రాలను పూర్తిస్థాయిలో సిబ్బందితో బలోపేతం చేయడం అత్యవసరమని రైతులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయవడుతున్నారు. ఎం ఈ ఓ గౌరి తన సమస్యను వివరిస్తున్న సమయంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీఓ విజయమ్మ, పిఏసిఎస్ చైర్మన్ నందకిశోర్ రెడ్డి, డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, అర్జీదారులు ఉన్నారు.

# శాశ్వత క్షత్రియ వివాహ వేదిక సిద్ధం

## -ముఖ్య సలహాదారుగా రామరాజు

ప్రజా భూమి ప్రతినిధి పుత్తూరు
క్షత్రియ వివాహ సంబంధాలను సమకూర్చుటకు శాశ్వత క్షత్రియ వివాహ వేదికను ఏర్పాటు చేయనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీధర్ రాజు డాక్టర్ రవి రాజు పేర్కొన్నారు. పుత్తూరు లోని సుభాషిని ఆసుపత్రి ప్రాంగణంలో




జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్షత్రియ సంస్కృతి సాంప్రదాయాల మేరకు వివాహం కానీ యువతి యువకులకు వివాహ సంబంధాలు సమకూర్చేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్య సలహాదారుగా తిరుపతికి చెందిన రామరాజును నియమించారు. ప్రతి నెల రెండవ ఆదివారం నాలుగు గోత్రాలకు సంబంధించి నియమించిన పెద్దలచే వివాహ సంబంధాలు గురించి చర్చించబడును. ఉమ్మడి చిత్తూరు, ఉమ్మడి అనంతపురం జిల్లాల కొరకు ఒక శాశ్వత క్షత్రియ వివాహ వేదికను పుత్తూరులో ఆగస్టు చివరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.ఎంపిక చేసిన మిగిలిన 8 ప్రాంతాల్లో హైదరాబాద్, రాజంపేట, విజయవాడ, రాజమహేంద్రవరం, భీమవరం, విజయనగరం, తిరువళ్ళూరు, బెంగుళూరులలో కూడా అన్ని లాంఛనాలు పూర్తి చేసుకుని అన్ని కార్యాలయాలు ఒకేసారి ప్రారంభించి క్షత్రియ కుటుంబాలకు చేరువ చేయాలని సంకల్పించారు. పుత్తూరు కేంద్రంగా ప్రముఖ వైద్యులు సుభాషిణి, శ్రీధరరాజు జంపన గార్ల ఆసుపత్రి సుభాషిణి హాస్పిటల్ సెల్లార్ లో ఒక గదిని శాశ్వత క్షత్రియ వివాహ వేదిక కార్యాలయంగా వితరణ చేసినందుకు జిల్లా క్షత్రియ కుటుంబాల తరపున వీరిరువురికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, సభాముఖంగా తీర్మానం చేయడం జరిగింది. వివాహ వయస్సు గురించి, లేటు వయసులో వివాహం అయినవారికి సంతానం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, వీటికి పరిష్కారాలను పుస్తకాల రూపంలో కుటుంబాలకు అందజేస్తే బాగుంటుందని సభాముఖంగా కోరగా, మరొక ప్రముఖ విశ్రాంత ప్రభుత్వ వైద్యులు పాతపాటి రవిరాజు స్పందిస్తూ, తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్షత్రియ వైద్యులు అందరూ కలిసి ఒక బృందంగా ఏర్పడి పుస్తకాలు తయారు చేసి అందజేయడానికి కృషి చేద్దామని తెలిపారు. చెన్నై రాజుక్కల్ సంఘం నుంచి భాస్కర రాజు బృందం బెంగుళూరు క్షత్రియ రాజుల సంఘం నుంచి రవి రాజు బృందం హాజరయ్యి తమ విలువైన అభిప్రాయాలు తెలియజేశారు. సమావేశంలో క్షత్రియ పెద్దలు రామరాజు, యువరాజు, వివిఎస్ రాజు, వాసు దేవరాజు, రెడ్డియ్య రాజు, సుకుమార్ రాజు, నరసింహులు రాజు, సిద్దిరాజు, రామకృష్ణ మారాజు,మధుసూధన రాజు, రుక్మాంగదరాజు మనోహర్ రాజు, దీన దయాల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఫిరోజ్ చికెన్ షాప్ రెండవ బ్రాంచ్ ప్రారంభం

## ముస్లిం మత గురువుల ప్రత్యేక ప్రార్ధనలు

## షాప్ ను ప్రారంభించిన కడివేటి చంద్రశేఖర్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు
గూడూరు పట్టణంలోని సంగం థియేటర్ సమీపంలో శుక్రవారం సాయంత్రం ఫిరోజ్ చికెన్ షాప్ రెండవ బ్రాంచ్ ను ముస్లిం మత గురువుల ప్రత్యేక ప్రార్ధనలతో ప్రారంభించారు. ఫిరోజ్ చికెన్ షాప్ ను ప్రగతి సంస్థ నిర్వాహకులు కడివేటి చంద్ర శేఖర్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ ఫౌండర్ కడివేటి చంద్రశేఖర్, పలువురు వక్తలు



మాట్లాడుతూ ఫిరోజ్ గత కొన్నేళ్లుగా గూడూరు పట్టణంలోని దూడల కాలువ సెంటర్లో చికెన్ షాపు నిర్వహిస్తూ నాణ్యమైన చికెన్ ను ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం రెండవ బ్రాంచ్ ను సంగం థియేటర్ సెంటర్లో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అతిధులు పేర్కొన్నారు. ఫిరోజ్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. చికెన్ షాపు నిర్వాహకులు ఫిరోజ్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన చికెన్ ను తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో రెండవ బ్రాంచ్ ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు ఇమామ్ హారున్ రషీద్, పలువురు ముస్లిం పెద్దలు, సయ్యద్ జమీల్ అహ్మద్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్నా లెజినోవా కు ఘన స్వాగతం



ప్రజా భూమి ప్రతినిధిరేణిగుంట:
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా శుక్రవారం ప్రత్యేక విమానంలో హైదరాబాదు నుంచి రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు జనసేన నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు బయలుదేరి వెళ్లారు.

# నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయంలో ఆణివారి ఆస్థానం వైభవంగా

ప్రజా భూమి ప్రతినిధి నాగలాపురం.
నాగలాపురంలోని శ్రీ వేదనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ఆణివారి ఆస్థానం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను చిన్న శేషవాహనంపై అధిష్ఠింపజేసి వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, నైవేద్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆగమోక్తంగా ఆణివారి ఆస్థాన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి విశేష సేవలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆణివారి ఆస్థానం సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో కూడిన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారి కృపాకటాక్షాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తి నియోజకవర్గం, దేవస్థాన సమగ్ర అభివృద్ధిపై తుడా ఛైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి,ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిల ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

## భక్తులకు నేరుగా కనెక్టివిటీ -- మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం: తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

## తిరుమల తరహా మౌలిక వసతులు - ఆధ్యాత్మిక హబ్ గా శ్రీకాళహస్తి:ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.
శ్రీకాళహస్తి నియోజకవర్గంతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ జ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర దేవస్థానాన్ని అంతర్జాతీయ స్థాయి లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి , శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి. సంయుక్తంగా ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో శ్రీకాళహస్తి మాస్టర్ ప్లాన్ రోడ్లు, భక్తుల వసతులు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం మరియు పర్యావరణ పరిరక్షణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి. మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లోనే ధనిక దేవాలయాలలో ఒకటైన శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమన్నారు రోజురోజుకూ ఇక్కడ భక్తుల సంఖ్యతో పాటు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల రాక విపరీతంగా పెరుగుతోందని, అందుకు తగ్గట్టుగా మౌలిక వసతులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం శ్రీకాళహస్తిలో ప్రైవేట్ వసతులే ఎక్కువగా ఉన్నాయని, భక్తులందరూ తిరుమల తరహాలోనే దేవస్థాన కాటేజీల్లో బస చేసేలా కనీసం 25 నుండి 30



ఎకరాల విస్తీర్ణంలో భారీ కాటేజ్ సముదాయాన్ని డెవలప్ చేయాలని నిర్ణయించారు. దీనివల్ల స్థానికంగా యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయని తెలిపారు. భూసేకరణ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అందరి సమన్వయంతో, దేవస్థానానికి ఆదాయం పెరిగేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. తొండమానాడు నుండి కుడి వైపునకు తీసుకొని రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తే వాస్తు పరంగా కూడా చాలా బాగుంటుందని దివాకర్ రెడ్డి సూచించారు. తమిళనాడులోని తిరువణ్ణామలై (అరుణాచలం) తరహాలోనే శ్రీకాళహస్తిలో కూడా భక్తులు గిరిప్రదక్షిణ చేసేందుకు వీలుగా అధునాతన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పుణ్యనది స్వర్ణముఖిలోకి పట్టణంలోని కలుషిత నీరు వెళ్లకుండా కఠిన నివారణ చర్యలు చేపట్టాలని, అలాగే భక్తుల కోసం నాణ్యమైన, పరిశుభ్రమైన వెజిటేరియన్ హోటల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం ఆర్డీఓ, ఎమ్మార్వో, రెవెన్యూ అధికారులు మరియు తుడా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి తడ-చెన్నై కనెక్టివిటీని వేగవంతం చేయాలని ఆదేశించారు. స్వర్ణముఖి నదిపై నిర్మించే వంతెనను ఇరిగేషన్ శాఖ సమన్వయంతో రెండు రకాలుగా ఉపయోగపడేలా ప్లాన్ చేస్తున్నారు. కింద భాగంలో నీటి నిల్వ కోసం 'చెక్ డ్యామ్', పైన వాహనాల రాకపోకల కోసం వంతెన ఉండేలా దీనిని నిర్మిస్తామన్నారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి. మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రీకాళహస్తి క్షేత్రానికి నేరుగా కనెక్టివిటీని ఇచ్చేలా మాస్టర్ ప్లాన్ రోడ్లను రూపొందిస్తున్నట్లు తెలిపారు. తిరుచానూరు, వకుళమాత ఆలయాల తరహాలోనే శ్రీకాళహస్తిలో కూడా రోడ్ల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. తొండమానాడు నుండి ఒక 40/60 అడుగుల రోడ్డును నిర్మించి, అక్కడి నుండి లోబాయి దగ్గర ఒక భారీ బ్రిడ్జి ద్వారా చెన్నై హైవేకి నేరుగా అనుసంధానం చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. భక్తుల వసతి కోసం తిరుమల తరహాలోనే సిల్వర్, గోల్డ్, డైమండ్ కేటగిరీలలో కాటేజ్‌లను నిర్మిస్తామన్నారు. విరాళాలు ఇచ్చే దోనార్లకు ఆలయంలో ఆర్జిత సేవల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించేలా దేవస్థానం చైర్మన్ మరియు బోర్డుతో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ బృహత్తర ప్రణాళికల ద్వారా శ్రీకాళహస్తి రూపురేఖలు మారడమే కాకుండా, భక్తులకు అత్యుత్తమ దైవదర్శన అనుభూతి కలుగుతుందని తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి. మరియు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సంయుక్తంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థానం ఈవో వెంకటేశ్వర్లు,ఛైర్మన్ కొట్టే సాయి,తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు, సీపిఓ దేవికుమారి,భూసేకరణ అధికారి సుజన,జేపీఓలు ఏపీఓలు రెవెన్యూ , ఇరిగేషన్ శాఖ అధికారులు మరియు తుడా అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆదిమూలం ప్రజాదర్బార్‌కు భారీ స్పందన

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.
సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై తమ సమస్యలను వినిపించారు. వరదయ్యపాలెం మండల కేంద్రంలోని అధికారిక కార్యాలయాల సముదాయంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ, ప్రజా సమస్యలు మరియు మౌలిక సదుపాయాల కల్పన విషయంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల వద్ద వినిపించిన వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, ప్రతి చిన్న విషయాన్ని తన దృష్టికి తీసుకురావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇంటి పట్టాలు, పెన్షన్లు, రేషన్ కార్డుల మంజూరు, రెవెన్యూ, మండల పరిషత్, విద్యుత్, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని, అధికారుల పనితీరుతోనే ప్రభుత్వం మంచి పేరు సంపాదిస్తుందని పేర్కొన్నారు. అధికారులకు తన పూర్తి సహాయ సహకారాలు



ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన ఎమ్మెల్యే ఆదిమూలం, అత్యవసర సమస్యలపై జిల్లా అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ఆదేశించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కూటమి నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడిగా ఆదిమూలం ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి, అనేక ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని ప్రజాసేవలో ముందుకు సాగుతున్న ఆయన పనితీరు అభినందనీయమని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటన అనంతరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతి మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేయడం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నారు. అంతేకాక, నాయకత్వం అనేది పదవిని కాపాడుకోవడంలో కాకుండా, ప్రజలకు సేవ చేయడంలో ఉందని, ప్రజల విశ్వాసమే నాయకుడికి అసలైన బలమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ స్ఫూర్తితో పనిచేసే నాయకత్వం ఉంటే నియోజకవర్గ అభివృద్ధితో పాటు వారి రాజకీయ భవిష్యత్తు కూడా మరింత బలపడుతుందని వారు పేర్కొన్నారు.

# విద్యార్థుల ప్రతిభను గుర్తించిన రాజమోహన్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లం లో 202 5- 26 విద్యా సంవత్సరం లో పాఠశాలలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలలో ప్రతిభ కనబరిచిన బి హేమ, పల్లవి,గాయత్రి విద్యార్థులకు తిరుపతి వాస్తవ్యులు రాజ మోహన్ రెడ్డి పదివేల రూపాయల నగదు బహుమతిని అందించారనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ తెలియజేశారు. రాజమోహన్ రెడ్డి తన కుమారుడైన బాల స్వరూప రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నగదు బహుమతిని ఇచ్చారని తెలియజేశారు . తన కుమారుని జన్మదినం పురస్కరించుకుని ప్రతి సంవత్సరం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతిని అందిస్తానని తెలియజేశారు, అదేవిధంగా పాఠశాలలో మౌలిక వసతులను పెంపొందించుకోవడానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. పాఠశాలలో బాల స్వరూప్ రెడ్డి జన్మదిన పరిష్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేస్తూ రాజమోహన్ రెడ్డి ని ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



# శ్రీ వాసవిమాతకు గోరింటాకు అర్చన పూజలు

## - ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో విశేష పూజలు

ప్రజాభూమి, వేంపల్లె
ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం గోరింటాకు అర్చన పూజలు ఘనంగా నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో పంచామృతాభిషేకం, అర్చన, నివేదన, మహామంగళహారతి తదితర



విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి అమ్మవారిని పీఠంపై కొలువుదీర్చి గోరింటాకుతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం, వాసవి అష్టోత్తర శతనామావళి పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ, యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, నిర్వాహకుడు మిట్టా ప్రవీణ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి అంగన్వాడీ సెంటర్లో మెనూ ప్రకారం చిన్నారులకు గుడ్లు ఇవ్వాలి

### చిన్నారులకు 15 రోజుల నుంచి గుడ్లు ఇవ్వని కడదరకుంట అంగన్వాడి సిబ్బంది

### కడదరకుంట అంగన్వాడి సిబ్బందికి షోకాజ్ నోటీస్ -ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు మెనూ ప్రకారం తప్పకుండా కోడిగుడ్లు ఇవ్వాలని ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కూడేరు మండలంలోని కడదరకుంట అంగన్వాడి కేంద్రం-1,2 లను ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ.... కూడేరు మండలంలోని కడదరకుంట అంగన్వాడీ కేంద్రంలో జూలై 3,వ తేదీ నుంచి ఇప్పటివరకు చిన్నారులకు కోడిగుడ్లు ఇవ్వడం లేదని అక్కడి అంగన్వాడీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల భలే ప్రతానికి అధిక నిధులు ఖర్చు చేస్తూ చిన్నారుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని కూడేరు మండలం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం ఇవ్వక తూతూ మంత్రంగా అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారని అక్కడ సిబ్బందిపై ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా పద్ధతి మార్చుకొని చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి కడదరకుంట అంగన్వాడి సిబ్బందికి వెంటనే షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఐసిడిఎస్ పిడికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ శోభారాణి, ఐసిడిఎస్ పిడి సాహిదా బేగం, పౌరసరఫరాల డిఎం రమేష్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి రాజేశ్వరమ్మ, బీసీ వెల్ఫేర్ డిడి కుశుబు కౌరారి, ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# నల్లపురెడ్డిపల్లి పంచాయతీలో భారీ అవినీతి - బోరు పైపులు, కేబుళ్లు మాయం

- ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం: 600 అడుగుల పైపులు ఏమయ్యాయి?
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: గ్రామస్తులతో టీడీపీ నేత యోగానంద రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లి గ్రామపంచాయతీలో అవినీతి, ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, గత పాలకవర్గానికి చెందిన నాయకులు ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేశారని టీడీపీ నాయకుడు యోగానంద రెడ్డి ఆరోపించారు. గ్రామస్తులతో కలిసి ఆయన ఈ విషయంపై మండిపడ్డారు.బోరు పైపులు, విద్యుత్ కేబుళ్లు ఎక్కడికి వెళ్లాయి?గ్రామంలో గతంలో 1,200 అడుగుల లోతుతో ఏర్పాటు చేసిన బోరుబావుల్లో ప్రస్తుతం 400 నుంచి 450 అడుగులకే నీరు అందుతోందని తెలిపారు. దీంతో మిగిలిన సుమారు 600 అడుగుల పైపులు, విద్యుత్ కేబుళ్లను ఎవరో తొలగించారని అనుమానం వ్యక్తం చేశారు. ఆ సామగ్రి ఏమైంది, ఎక్కడికి తరలించారో అధికారులు వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేశారు.వీధిలైట్ల నిర్వహణ నిర్లక్ష్యం గ్రామంలోని అనేక వీధిలైట్లు నెలల తరబడి పనిచేయడం లేదని, పంచాయతీలో కనీస మౌలిక సదుపాయాల నిర్వహణ కూడా సరిగా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన సామగ్రి మాయమవడం వెనుక భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలతో కలిసి డిమాండ్ చేశారు.

అధికారులు స్పందించడం లేదు

కళ్లముందే ఆధారాలు కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని టీడీపీ అగ్రనాయకుల దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసిన వారిని చట్టపరంగా వదిలిపెట్టబోమని టీడీపీ నేతలు స్పష్టం చేశారన్నారు. నల్లపురెడ్డిపల్లి పంచాయతీలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని యోగానంద రెడ్డి డిమాండ్ చేశారు.

## ఘనంగా శ్రీ వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు

### శ్రీ లక్ష్మి వారాహి దేవి అమ్మగా భక్తులకు దర్శనం

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం



ప్రపంచంలోని అత్యంత మహిమాన్వితమైన ఏకైక శ్రీ పాతాళ శ్వేత వారాహీ మహాక్షేత్రమైన తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం రాయల చెరువు దగ్గర ఉన్న శ్రీ శక్తిపీఠంలో నిర్వహించబడుతున్న శ్రీ వారాహీ నవరాత్రి మహోత్సవములలో మూడవ రోజైన నేడు అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా



ధన ప్రాప్తి, సిరిసంపదలు, ఋణ విమోచనం, భూ/గృహ సమస్యా పరిష్కారం కొరకు విశేష ఫలదాయకమైన శ్రీ లక్ష్మీ వారాహీ దేవి ప్రత్యేక మంత్ర హోమం నిర్వహించబడినది.

మధ్యాహ్నం అమ్మవారికి మహా హారతి సమర్పించబడగా, సాయంత్రం కళా నివేదన రూపంలో సంగీత, నాట్య, సాహిత్య సేవలు అమ్మవారికి అంకితం చేయబడినవి. రాత్రి వేళ పరమపూజ్య శ్రీ మాతాజీ వారి సమక్షంలో నవరాత్రి పూజ, దర్బారు సేవ జరుగగా, నడిచే దైవం జగద్గురువుల వారిచే మహా హారతి, అనంతరం అమ్మవారికి ఏకాంత సేవ నిర్వహించబడినవి. ఈ పుణ్యదినాన సుమారు 10,000 మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించి అమ్మవారి దివ్య దర్శన భాగ్యాన్ని పొందారు. వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ సమృద్ధిగా జరిగినది, ఇది గురు-దైవానుగ్రహానికి, పీఠం సేవాతత్పరతకు నిదర్శనంగా నిలిచింది.

## వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విరాటపర్వం పఠనం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని శ్రీ పద్మావతి సమేత వెంకట రమణ స్వామి ఆలయం లో శుక్ర వారం 3 వ రోజు విజయవంతంగా సాగు



తున్న విరాట పర్వం పఠనం వ్యాఖ్యానంతో పండితులు పఠనం గావిస్తున్నారు . ఈ కార్యక్రమశుక్ర వారం 3 రోజు విజయ వంతంగా కొనసాగు తోంది వ్యాఖ్యాత రామకృష్ణారెడ్డి, పఠనం వ్యాఖ్యాత నరసింహారెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంవచ్చేనెల 12 వరకు విరాట పర్వ పఠనం కొనసాగుతుందన్నారు. ప్రతిఏటాదేవస్థాన కమిటీ సబ్ కమిటీ ,శ్రీమద్భాగవత గీత ప్రచార కమిటీ వారిచే ఈ బృహత్తరకార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడం వలనసకాలం లో వర్షాలు పడి, సర్వ జనులు సుఖంగా ఉండేందుకు,లోకమంతా సుభిక్షంగా ఉండేందుకు, వరణ దేవుని అనుగ్రహం కొరకు లోక కల్యాణంకోసం ఈకార్యక్రమం ఏర్పాటుచేసినట్లు వారు తెలిపా రు. ఈ కార్యక్రమం లో భక్త జనులు అధిక సంఖ్యలోపాల్గొని జయ ప్రదం చేయాలని వారు కోరారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### - డ్వాక్రా సంఘాల బకాయిలు విడుదల చేయాలి
### - ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డా. తులసిరెడ్డి డిమాండ్



ప్రజాభూమి, వేంపల్లె

ఫీజు రీయింబర్స్మెంట్, స్కాల ర్షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యా ర్థులకు చెల్లించాలని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ కింద రూ. 6,300 కోట్లు, స్కాలర్షిప్‌ల కింద రూ. 2,200 కోట్ల మేర ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పై చదువులు, ఉద్యోగాల కోసం అవసరమైన సర్టిఫికెట్లు అందక విద్యార్థులు నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాల పథకం కింద రావాల్సిన బకాయిలను కూడా తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, నాయకులు ఉత్తన్న, అమర్నాథరెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై కుల వివక్ష చూపించడం సరికాదు

### -: ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జోహార్

ప్రజాభూమి పోరుమామిళ్ల :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జోహార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాల నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని, ఇటువంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. దళితుల హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధితులకు న్యాయం జరిగేలా ఎస్సీ కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. బ్రహ్మంగారి మఠం మండలంలోని ముడుమాల గ్రామంలో జరిగిన జంట హత్యల ఘటనను ప్రస్తావిస్తూ, ఆ కేసులో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించకపోవడం విచారకరమని అన్నారు. నిందితులకు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వారికి ధైర్యం చెప్పేందుకు వెళుతున్నాను అన్నారు. న్యాయం జరిగే వరకు ఎస్సీ కమిషన్ ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొని ఆయనకు పూలమాలలు శాలువాలతో స్వాగతం పలికారు.

## బద్వేల్ టీడీపీ ఇంచార్జి మంచూరి సూర్యనారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలియచేసిన బద్వేల్ మార్కెట్ యార్డ్ ఛైర్పర్సన్ నారిశెట్టి సుప్రజ నాగేంద్ర

ప్రజాభూమి పోరుమామిళ్ల :

బద్వేల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నూతన ఇన్‌చార్జ్‌గా నియమితులైన మంచూరు సూర్యనారాయణ రెడ్డిని భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన తన నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమం లో బద్వేల్ బీజేపీ భాస్కర్ రెడ్డి , సీనియర్ నాయకుడు బొమ్మనా సుబ్బారాయుడు , జనరల్ సెక్రటరీ ఉట్టి శ్రీనివాసులు , కిసాన్ మోర్చా అధ్యక్షుడు అశోక్ రెడ్డి , టోలీ ఇంచార్జి పల్లంశెట్టి పందరి , అన్ని మండల అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి , నాగేంద్ర , రవి , నారాయణ రెడ్డి , వెంకటసుబ్బయ్య రాయల్ , సుధాకర్ రెడ్డి ,మల్లెంకొండ రాజు ,దుల్ల శ్రీనివాస్ రెడ్డి , కే చెన్నయ్య , టెంకాయల గురయ్యా , శివ రెడ్డి ,తమ్మిశెట్టి రమణ , జయరాం , ఉండేలా శ్రీనివాస్ రెడ్డి ,సీనియర్ నాయకులూ , మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు



## కన్యకా పరమేశ్వరి దేవికి ఆషాడం సారే సమర్పణ

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి శుక్రవారం సంఘ సభ్యులు, ఆర్యవైశ్యమహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆషాడం చీర సారె అమ్మవారికిసమర్పించారు. పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి అమ్మవారికి చీరే సారే తీసుకొని ఆర్యవైశ్య సభ్యులు, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు పురవీధుల గుండా బ్యాండ్ వాయిద్యాలతోఅమ్మవారి శాల చేరుకొని అమ్మవారికి సారెను సమర్పించి ఒడిబియ్యం కట్టారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ముద్దిరెడ్డిపల్లి రహదారి విస్తరణకు హైటెక్ సర్వే

### -డీజీపీఎస్ రోవర్‌తో భూ హద్దుల నిర్ధారణకు శ్రీకారం
### -పారదర్శకంగా విస్తరణ -సహకరించాలని ప్రజలకు కమిషనర్ మల్లికార్జున విజ్ఞప్తి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ముద్దిరెడ్డిపల్లి రహదారి విస్తరణ పనులకు కీలక ముందడుగు పడింది. రోడ్డు విస్తరణను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా శాస్త్రీయంగా, అత్యంత ఖచ్చితత్వంతో అమలు చేసేందుకు డిజిటల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ రోవర్ సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రారంభించారు. ఆధునిక సాంకేతికతతో చేపడుతున్న ఈ సర్వే ద్వారా రహదారి హద్దులు, ప్రభుత్వ భూములు, ప్రైవేటు ఆస్తుల సరిహద్దులు, మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన రహదారి వెడల్పును ఖచ్చితంగా గుర్తించి రహదారి విస్తరణకు మార్గం సుగమం కానుంది. మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అబ్దుల్ సత్తార్ పర్యవేక్షణలో టౌన్ సర్వేయర్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీయర్లు (టీపీబీఓలు), టౌన్ ప్లానింగ్ సిబ్బంది సమన్వయంతో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. అత్యాధునిక డీజీపీఎస్ రోవర్ ద్వారా ప్రతి అంగుళం భూమిని డిజిటల్ మ్యాపింగ్ చేసి, రహదారి సరిహద్దులు, ప్రభుత్వ భూములు, ప్రైవేటు ఆస్తుల హద్దులను అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేస్తున్నారు. దీంతో భవిష్యత్తులో ఎలాంటి సందిగ్ధతలు, వివాదాలకు అవకాశం లేకుండా రహదారి విస్తరణ ప్రక్రియను చట్టబద్ధంగా పూర్తి చేయడానికి అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. సర్వే నివేదిక ఆధారంగా రోడ్డు విస్తరణకు సంబంధించిన తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టనున్నట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన వెడల్పు మేరకు రహదారి అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గి, పట్టణ రవాణా మరింత సౌకర్యవంతంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి దృష్ట్యా ముద్దిరెడ్డిపల్లి రహదారి విస్తరణ అత్యంత కీలకమైన ప్రాజెక్ట్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో ఈ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు, భూ యజమానులు, వ్యాపారులు అపోహలకు తావివ్వకుండా అధికారులకు సహకరించాలని కోరారు. అందరి సహకారంతో రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తయి, హిందూపురం పట్టణ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బందితో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ నేత పామిశెట్టి చంద్రశేఖర్ కు అస్వస్థత

### -బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స




ప్రజాభూమి, హిందూపురం టౌన్

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, తెలుగు యువత రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పామిశెట్టి చంద్రశేఖర్ అస్వస్థతకు గురయ్యారు. మెదడుకు సంబంధించిన ఆరోగ్య సమస్యతో ఆయనను బెంగళూరులోని మహావీర్ జైన్ ఆసుపత్రిలో చేర్పించి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిని నిపుణులైన వైద్యులు నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, అభిమానులు ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

## వైకాపా నుండి టిడిపిలోకి చేరిక

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ చర్యలకు ఆకర్షితులై లేపాక్షి మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. సుమారు పది కుటుంబాలకు చెందిన నాయకులు స్వచ్ఛందంగా టీడీపీ తీర్థం పుచ్చుకోవడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. హిందూపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే



బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రబాబు వారికి పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలు, గంగరాజు, శివ, ఆది, మంజు, శివప్ప, శేషాద్రి, రూపేష్, నవీన్ కుమార్, శివకుమార్, శంకరప్ప, వెంకటేష్, ఆనందకుమార్, అశ్వర్థనారాయణ తదితరులు అధికారికంగా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే బాలకృష్ణ నాయకత్వంలో హిందూపురంలో రహదారులు, మౌలిక వసతులు, తాగునీటి సదుపాయాలు, పట్టణాభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, ప్రజలకు అందుతున్న పాలనపై విశ్వాసం పెరగడంతో టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకత్వానికి అండగా నిలవాలని భావించి స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకులు వెల్లడించారు. హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలకృష్ణ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విస్తృత ఆదరణ పొందుతున్నాయని, అదే టీడీపీకి రోజురోజుకూ బలాన్ని పెంచుతోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లేపాక్షి మండల అధ్యక్షుడు అబిలాష్, మాజీ పార్లమెంట్ కార్యదర్శి వీరశేఖర్, నాయనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు వై.వి. వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ సదాశివారెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మమతారెడ్డి యూనిట్ ఇన్‌చార్జి మహేష్, బూత్ ఇన్‌చార్జి ఆనంద్, రామాంజి, సురేష్, రాజు, నరసింహమూర్తి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పంటల బీమా ప్రీమియం చెల్లింపుకు గడువు పెంపు -ఏవో చెన్నారెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు పెంచారని పులివెందుల ఏవో చెన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 15వ తేదీకి పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగిసిందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈనెల 24వ తేదీ వరకు గడువు పెంచిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## టీచర్ల వివరాల నమోదులో పొరపాట్లు ఉండొద్దు : డీఈఓ యు.వి. సుబ్బారావు

### మండల విద్యాశాఖాధికారులతో జిల్లా విద్యాశాఖ అధికారి సమీక్ష

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు (MEOs), టెక్నికల్ అసిస్టెంట్లతో జిల్లా విద్యాశాఖ అధికారి (DEO) యు.వి. సుబ్బారావు శుక్రవారం ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నూతన జిల్లాల విభజన ప్రక్రియ వేగవంతమవుతున్న నేపథ్యంలో, ఉపాధ్యాయుల సేవా వివరాల నమోదుపై అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు.

**సమీక్షలోని ముఖ్యాంశాలు – డీఈఓ ఆదేశాలు:ఖచ్చితత్వమే ప్రాధాన్యం:** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల సేవా వివరాల నమోదులో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకూడదు. క్షుణ్ణంగా పరిశీలన: టెక్నికల్ అసిస్టెంట్లు, ఎంఈఓలు ప్రతి ఒక్క ఉపాధ్యాయుని సర్వీస్ రికార్డును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వివరాలను ఖరారు చేయాలి.డెడ్‌లైన్ తప్పనిసరి: జిల్లాల విభజన ప్రక్రియకు ఇది అత్యంత కీలకమైన ఘట్టం కాబట్టి, నిర్దేశిత గడువు లోపలే ఈ ప్రక్రియను పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలి.జిల్లాల విభజన నేపథ్యంలో కసరత్తునూతన జిల్లాల విభజన ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయుల సీనియారిటీ, కేటాయింపుల జాబితాల రూపకల్పన కోసమే ఈ ప్రత్యేక స్క్రీనింగ్, డేటా ఎంట్రీ ప్రక్రియను విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, ఐటీ విభాగం టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పెడన వరకట్న వేధింపులు కేసు కొట్టివేత... ఛానల్ కెమెరామెన్ నిర్దోషిగా విడుదల...

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

పెడన బ్రహ్మపురముకు చెందిన బళ్ళ (25)కామేశ్వరి కి హైదరాబాదులోని ప్రముఖ ఛానల్లో కెమెరామన్ గా పనిచేస్తున్న బళ్ళ దుర్గాప్రసాద్ తో 2013 ఫిబ్రవరి 14వ తారీఖున పెడన లో వివాహం జరిగింది.. వివాహకాలంలో నగదు బంగారం కట్న కానుకలుగా ఇచ్చారు. తర్వాత భర్త ప్రముఖ టీవీ ఛానల్ లో కెమెరా పనిచేస్తూ హైదరాబాదులో కాపురం పెట్టారు. హైదరాబాదులో తన భర్త తనను అధిక కట్నం కోసం వేధింపులకు గురి చేశాడని బాధలు పెట్టాడని భార్య ఆరోపించింది. వారిద్దరికీ 2013 నవంబర్ 20 తారీకున ఆడపిల్ల కూడా పుట్టింది.ఆడపిల్ల పుట్టిన తర్వాత ఇద్దరు కలిసి హైదరాబాదు యూసఫ్ గూడా లో కాపురం పెట్టారు. తాను అందంగా లేనని తన భర్త గొడవ పడుతూ వ్యక్తిగతంగా దూషిస్తూ 2016లో తనను ఇంటి నుండి గెంటివేశాడని తన భర్తతో పాటు తన అత్త బళ్ళ వసుంధర కూడా వే దింపులకు గురిచేస్తుంది అని పేర్కొంటూ 2018లో భార్య కామేశ్వరి మచిలీపట్నం మొబైల్ కోర్టులో కంప్లైంట్ దాఖలు చేసింది. 8 సంవత్సరాల సుదీర్ఘ విచారణ అనంతరం భర్తపై మోపిన నేర రోపణకు తగిన ఆధారాలు లేకపోవడంతో కేసు కొట్టి వేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో విచారణ పెండింగ్ లో ఉండగా అత్త బల్బళ్ళ వసుంధర(62) మరణించింది. నిందితుల తరపున ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, లంకిశెట్టి సాయి ఫణి సంతోష్, చిన్నంశెట్టి ఆశా నాగ మౌనిక, వందంశెట్టి జగతిశ్రీ న్యాయవాదులుగా వ్యవహరించారు.

## రమణ గురుదేవుల జన్మదినం సందర్భంగా గురుదేవులను కలిసిన ప్రముఖులు

### సేవ కార్యక్రమాల నిర్వహణ



జగ్గయ్యపేట, ప్రజా భూమి

బలుసు పాడు గురు ధామ్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు రమణ గురుదేవులను కలిసి వారి ఆశీస్సులను తీసుకున్నారు. రమణ గురుదేవుల జన్మదినం సందర్భంగా బలుసుపాడు గురు ధామ్ ఆశ్రమంలో పండుగ వాతావరణం నెలకొంది. రమణ గురుదేవుల జన్మదిన సందర్భంగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరామ్ ధనుంజయ ( చినబాబు), జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, పలువురుప్రముఖులు పెద్ద సంఖ్య లో గురుధాం భక్త బృందం సభ్యులు గురు ధామ్ కు విచ్చేసి రమణ గురుదేవుల ఆశీస్సులను పొందా రు. జగ్గయ్యపేటలో సుతారు కార్మికులకు అల్పాహారం బలుసు పాడు గురు ధామ్ వ్యవస్థాపకులు వెంకటరమణ గురుదేవుల జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో సుతారు మేస్త్రీలకు అల్పాహారం అందించారు. సుతార్ మేస్త్రి రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నేత, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త శ్రీరామ్ చినబాబు పాల్గొని సుతారు కార్మికులకు అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిల్ సభ్యులు సంగేపు బుజ్జి బాబు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



## ఫసల్ బీమాతో అన్నదాతకు ఆర్థిక ధీమా..

- రుణగ్రహీతలు, రుణేతర రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోండి

- తక్కువ ప్రీమియంతోనే ఆపత్కాలంలో అతి ఎక్కువ భరోసా
- ఎల్‌నినో నేపథ్యంలో బీమా పథకాలపై విస్తృత అవగాహన కల్పించండి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఆపత్కాలంలో అండగా నిలిచే పంట బీమా పథకాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని.. రుణం తీసుకునే రైతులతో పాటు రుణేతర రైతులు కూడా తప్పనిసరిగా పథకాల్లో చేరాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శ్రీ ఏపీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన వ్యవసాయ, ఉద్యాన, సహకార, బ్యాంకింగ్, బీమా సంస్థల అధికారులతో సమావేశం జరిగింది. ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితుల నేపథ్యంలో పంట నష్టాల ప్రమాదం పెరిగే అవకాశం ఉన్నందున రైతులకు ఫసల్ బీమాపై విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకాల్లో చేరేలా ప్రోత్సహించాలన్నారు. ఇందుకు సమన్వయ శాఖల అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఖరీఫ్- 2026 సీజన్‌కు జిల్లాలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వరి, ఎర్ర మిరప, మొక్కజొన్న, పెసర పంటలను నోటిఫై చేయడం జరిగిందని.. అదేవిధంగా పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకం కింద పత్తిని నోటిఫై చేసినట్లు వివరించారు. వీటితో అతి తక్కువ ప్రీమియంతోనే కష్టకాలంలో అధిక ఆర్థిక భరోసా లభించనుందని.. ఉదాహరణకు వరికి ఎకరాకు బీమా మొత్తం రూ. 42,500 కాగా రైతు వాటా ప్రీమియం రూ. 850 చెల్లిస్తే సరిపోతుందన్నారు. వరికి సంబంధించి పథకంలో నమోదుకు ఆగస్టు 15వ తేదీ ఆఖరు



తేదీ కాగా ఎర్ర మిరప, మొక్కజొన్న, పెసరకు జులై 31 చివరితేదీ అని తెలిపారు. పత్తికి ఈ నెల 24వ తేదీలోగా నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. పంట రుణం తీసుకున్న రైతులకు రుణంతో పాటు అదనంగా బీమా ప్రీమియం కూడా మంజూర వుతుందని.. పంట రుణాలు తీసుకోని రైతులు నమోదుకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, కామన్ సర్వీస్ సెంటర్లు, జాతీయ పంట బీమా పోర్టల్, స్వర్ణ గ్రామం, తపాలా కార్యాలయాలను ఉపయోగించుకోవచ్చన్నారు. పంట రుణాలు తీసుకోని రైతుల కోసం స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. పథకలకు సంబంధించిన సమాచారం, సందేహాల నివృత్తి కోసం స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయ కుమారి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, టాటా ఏఐజీ ఇన్సూరెన్స్, ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి



**మచిలీపట్నం విద్యార్థులకు ఏఐపై ప్రముఖ ఎన్నారై 'శ్రద్ధ' శిక్షణ**

**శ్రద్ధ రచించిన 'ఎర్లీ బర్డ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన డిఇఓ**

**యు.వి.సుబ్బారావు**

**ఘనంగా నిర్వహించిన 'మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ'**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

విద్యార్థులు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పై ప్రత్యేక అవగాహన పెంపొందించుకోవాలని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఓ) యు.వి. సుబ్బారావు పిలుపునిచ్చారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని నాలుగు ప్రముఖ పాఠశాలల్లో విద్యార్థులకు కాలిఫోర్నియాకు చెందిన ప్రముఖ ఎన్నారై 'శ్రద్ధ' ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) పై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు.ఘనంగా 'ఎర్లీ బర్డ్' పుస్తకావిష్కరణచిలకలపూడి మున్సిపల్ పాండురంగ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో శ్రద్ధ రచించిన 'ఎర్లీ బర్డ్' పుస్తకాన్ని డిఇఓ యు.వి. సుబ్బారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్, మానవతా జిల్లా కో-కన్వీనర్ ముదిగొండ శాస్త్రి, సమగ్ర శిక్ష ఎఎంఓ రెడ్ రోతు శ్యాంసుందర్ కలిసి సంయుక్తంగా ఆవిష్కరించారు.రానున్న కాలం ఏఐ దే: డిఇఓ యు.వి. సుబ్బారావుఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ, రానున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమాజాన్ని ఏలబోతోందని అన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు కూడా ఆన్‌లైన్‌లో ఏఐపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అమెరికా నుంచి వచ్చి మన మచిలీపట్నం విద్యార్థులకు శ్రద్ధ అవగాహన సదస్సులు నిర్వహించడం ముదావహమన్నారు. అలాగే, త్వరలోనే అర్హులైన పాఠశాల విద్యార్థుల తల్లుల ఖాతాల్లో 'తల్లికి వందనం' సొమ్ము జమ కానుందని ఆయన వెల్లడించారు.విద్యారంగంలో గణనీయమైన మార్పులు: గొర్రెపాటి గోపీచంద్కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నా యని, దీనివల్ల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారని కొనియా డారు.సాంకేతికతపై అప్‌డేట్ కావాలి: పి.వి. ఫణి కుమార్మానవతా సంస్థ ఉపాధ్యక్షుడు, పి.వి. ఫణి కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎప్పటికప్పుడు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై అప్‌డేట్ కావాలన్నారు. పిలవగానే అమెరికా నుండి వచ్చి ఇక్కడి విద్యార్థులకు శ్రద్ధ అవగాహన కల్పించడం సంతోషకరమన్నారు.నాలుగు పాఠశాలల్లో శిక్షణా తరగతులు:రుస్తుంబాధ బాలికల ఉన్నత పాఠశాల: మొదటగా ఇక్కడ హైస్కూల్, ఎలిమెంటరీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.వి. ఫణి కుమార్, మంచాల రాంబాబు, ఆర్ పేట ఎస్ఐ లోకేశ్వరి, మానవతా ప్రతినిధి ముదిగొండ శాస్త్రి, హెచ్ఎం ఇందిర మాట్లాడారు.సన్ స్టార్ స్కూల్: మానవతా సంస్థ అధ్యక్షుడు బి. అయ్యప్ప స్వామి ఆధ్వర్యంలో ఏఐపై సదస్సు విజయవంతంగా సాగింది. బాలాజీ విద్యాలయం: ఇక్కడ జరిగిన సదస్సులో ఎన్నారై శ్రద్ధ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, వారి నుంచి సమాధానాలు రాబడుతూ ఉత్సాహంగా క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కొమరగిరి చంద్రశేఖర్, మానవతా డైరెక్టర్ కారుమూరి రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు.ఎన్నారై శ్రద్ధకు ఘన సత్కారం:మన మచిలీపట్నం విద్యార్థుల కోసం విదేశాల నుండి వచ్చి ఉచితంగా శిక్షణ అందించిన ప్రముఖ ఎన్నారై శ్రద్ధతో పాటు ఆమె తల్లిదండ్రులను విద్యాశాఖ అధికారులు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## నిర్ణీత గడువులోపు టిడ్కో ఇళ్లనుపూర్తి చేసి లబ్ధిదారులకు అందిద్దాం

**టిడ్కో గృహాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన శాసనసభ్యులు శ్రీ రాం రాజగోపాల్ లబ్ధిదారులకు త్వరితగతిన గృహాలు అందించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం**

జగ్గయ్యపేట, ప్రజాభూమి

నిర్ణీత గడువులోపు టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అధికారం ఆదేశించారు. జగ్గయ్యపేట పట్టణంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తన నివాసంలో టిడ్కో గృహాల నిర్మాణ పనులపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హాజరై, టిడ్కో అధికారులతో కలిసి గృహ నిర్మాణ పనుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు.సమావేశంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాల పనుల తీరుతెన్నులను శాసనసభ్యులు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయి, ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి, నిధుల విడుదల, మెటీరియల్ సరఫరా వంటి అంశాలపై అధికారులతో లోతుగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో పనులు నెమ్మదిగా సాగుతున్నట్లు గుర్తించిన ఆయన, వెంటనే వేగవంతం చేయాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ* పేద, మధ్యతరగతి ప్రజల కల అయిన సొంతిల్లు కల నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టామని తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు నాణ్యమైన గృహాలను అందించాలని, నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా పనులు నిలిచిపోయినా, ఆలస్యమైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి



చేస్తామని హామీ ఇచ్చారు.చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ, గృహ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. అధికారులు సైతం పనుల పురోగతి వివరాలను శాసనసభ్యులకు వివరించి, తలెత్తుతున్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమావేశంలో టిడ్కో అధికారులతో పాటు కౌన్సిలర్లు పేరం సైదేశ్వర రావు, ఇ ద్రి నరసింహా రావు, నాయకులు వేదులపురి సైదేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. చివరగా, లబ్ధిదారులకు వీలైనంత త్వరగా గృహాలు అందించి, వారి కలలను సాకారం చేయాలన్న సంకల్పంతో అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని శాసనసభ్యులు పిలుపునిచ్చారు.

## కోవిడ్‌పై ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం..

**- రోజువారీ జీవితంలో జాగ్రత్తలు తీసుకుందాం**
**- ముందు జాగ్రత్తగా జీజీహెచ్‌లో ప్రత్యేక కోవిడ్ వార్డు**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:

రాష్ట్రంలో కోవిడ్ కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి అవసరమైన ముందు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని.. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ముందు జాగ్రత్తగా విజయవాడ జీజీహెచ్‌లో 15 పడకలతో ప్రత్యేక కోవిడ్ వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బందితో పాటు అవసరమైన మందులు, ఉపకరణాలు అన్నింటినీ సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే దాదాపు 45 మందికి పరీక్షలు చేసినా ఎవరికీ పాజిటివ్ రాలేదన్నారు. అయినా ముందస్తు చర్యల్లో భాగంగా అధికార యంత్రాంగం అప్రమత్తంగా



ఉన్నట్లు తెలిపారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు.

వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, అవసరమైన చోట మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలను పాటించాలని సూచించారు.

వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

## సర్.. నూరు శాతం పూర్తి చేశాం..

**జిల్లాలో 17,13,445 మంది ఓటర్ల వివరాలు డిజిటైజేషన్ చేశాం- పారదర్శకంగా ముగిసిన డిజిటైజేషన్ /ఆన్లైన్ ప్రక్రియ- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో కీలక ప్రక్రియ అయిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మొత్తం 17,13,445 మంది ఓటర్లకు సంబంధించి పారదర్శకంగా డిజిటైజేషన్/ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసినట్లు పేర్కొన్నారు.బీఎల్‌వోల ఇంటింటి సందర్శనకు ఈసీఐ ఈ నెల 24వ తేదీ వరకు గడువు పొడిగించినందున కార్యక్రమంలో మరింత పారదర్శకత, కచ్చితత్వానికి సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురణ ఉంటుందని.. అప్పటి నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలకు వీలుంటుందన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు నోటీసు దశ, క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని వివరించారు. చివరిగా అక్టోబర్ 3వ తేదీన తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా విశిష్టత స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లడంలో భాగస్వాములైనట్లు తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలో 2,08,707 మంది ఓటర్లు, విజయవాడ పశ్చిమలో 2,56,980, విజయవాడ మధ్యలో 2,77,822, విజయవాడ తూర్పులో 2,69,734, మైలవరంలో 2,85,168, నందిగామలో 2,07,481, జగ్గయ్యపేటలో 2,07,553 మంది ఓటర్లకు సంబంధించి 100 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

# పిజిఆర్ఎస్ సమస్యలు జీరో శాతానికి చేరాలి

## రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

రాష్ట్ర మంత్రి నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామ సచివాలయం దగ్గర నిర్వహించిన ప్రజా దర్బారుకు విశేష స్పందన లభించింది. ఈ ప్రజా దర్బార్ కు ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి. ఫిర్యాదులన్నీ ఒక్కొక్కటి పరిశీలించి సంబంధిత అధికారులకు వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజాదర్బార్లో మొత్తం: 57 ఫిర్యాదులు రాగా వాటిలో రెవిన్యూ 15 రాగా పంచాయతీరాజ్ 20 ఆర్ అండ్ బి 8 డ్రైనేజీ సమస్యలు 7 హౌసింగ్ 4 విద్యుత్ 3 హోమ్ డిపార్ట్మెంట్ 2 అగ్రికల్చర్ 1 పలు సమస్యలు మంత్రి దృష్టికి రాగా కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కారం కాగా మిగిలిన సమస్యలను త్వరలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించిన మంత్రివర్యులు. వీటిలో ముఖ్యంగా కాట్రేనిపాడు గ్రామానికి చెందిన సొంగా ఏసు ట్రైసైకిల్ ఒకటి కావాలని అడుగుగా తక్షణమే రేపు అందించాలని తమ సిబ్బందికి ఆదేశించారు. ముసునూరు గ్రామానికి చెందిన కొంతమంది పింఛన్లు అందించాలని కోరిగా వీలైనంత త్వరలో అందిస్తామని మంత్రిపేర్కొన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ మాకు గతంలో రేషన్ కార్డు ఉందని ఇప్పుడు లేదని రేషన్ కార్డు ఇప్పించమని కోరగా సావధానంగా స్పందించిన మంత్రివర్యులు వీలైనంత త్వరలో సమస్య పరిష్కరించి కార్డు వచ్చే ఏర్పాటు చేస్తానని అన్నారు. బి, శ్రీను తమ పొలానికి సంబంధించిన సమస్యను పరిష్కరించే మన కోరగా వెంటనే అధికారులు ఆదేశించిన మంత్రివర్యులు. గోపవరం గ్రామానికి చెందిన కే, నాగరాజు గొర్రెల పెంపకానికి తమకు సుమారు,రూ.10 లక్షల రుణాన్ని ఇప్పించవలసిందిగా కోరగా త్వరలో ఇచ్చే ఏర్పాట్లు చేస్తానని మంత్రి హామీఇచ్చారు.పి ,రమాదేవి మాట్లాడుతూ తమ పొలానికి వెళ్లే సరిహద్దు దారిలో మురళి అనే రైతుకు మాకు కొన్ని సమస్యలు ఉన్నాయనిపరిష్కరించమని కోరగా మంత్రివర్యులు కోర్టు పరిధిలో ఉన్నదని తీర్పు వచ్చేవరకు అధికారులు స్పందించరని స్థలానికి వెళ్లి దారి క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి నివేదిక అందించాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించిన మంత్రి. తల్లికి వందనం అందడం లేదని ఒక మహిళ కోరగా టెక్నికల్ సమస్యలు వివిధ కారణాలవల్ల తల్లికి వందన పథకం అందలేదని అధికారులు జవాబు ఇవ్వగా వెంటనే సమస్యను పరిష్కరించి తల్లికి వందనం నగదు అందేలా చూడాలని అధికారులకు సూచించారు.

ఎం,కనకదుర్గ మాట్లాడుతూ ఒక సంవత్సరం నుంచి పాస్ పుస్తకం గురించి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న ఇప్పటికి రాలేదని ఫిర్యాదు ఇవ్వగా వెంటనే రెవిన్యూ అధికారులను పిలిపించి త్వరలో పాస్ పుస్తకం ఇచ్చి రేపటికల్లా అడంగల్లో ఎక్కించాలని అధికారులు ఆదేశించిన మంత్రి ఇలా నేరుగా ప్రజల్లో మమేకమై వారు చెప్పిన సమస్యలను క్షుణ్ణంగా ఆలకించి పరిశీలించి వెంటనే అధికారులు ఆదేశిస్తున్న మంత్రి తీరు చూసి ప్రజలు తమ హర్షాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి శాసనసభ్యులను, మంత్రివర్యులను మునుపెన్నడూ చూడలేదని వారి యొక్క ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తాశీల్దార్ మండల అభివృద్ధి అధికారి సిబ్బంది మరియు ఇతర ప్రభుత్వ అధికారులు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జి రఘు, కూటమి నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య భద్రతే.... ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి కొలుసు పార్థసారథి






ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామ సచివాలయ దగ్గర రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారధి ఇటీవల వైద్యం చేయించుకున్న సుమారు.22మంది బాధిత కుటుంబాలకు సుమారు. రూ.11లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన మంత్రి కొలుసు పార్థసారధి. మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని వంటిదని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.వైద్యం చేసుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవని వరం అన్నారు. రాష్ట్రంలో 104 వాహనం మాదిరిగా 109 వాహనం గ్రామంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని. కానీ కూటమి ప్రభుత్వంలో నూజివీడు నియోజకవర్గములో ఇప్పటి వరకూసుమారు.రూ15కోట్లు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించామన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని మెరుగైన వైద్యం కోసం మెరుగైన వైద్య పరికరాల ఏర్పాటుకు వేలకోట్ల ఖర్చు చేసిందని తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యంఅందుతుందన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య భద్రతతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్ర మంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జి, రఘు వేణు,తహశీల్దార్, ఇతర ప్రభుత్వ అధికారులు,,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పెద్ద వాగు ప్రాజెక్టు నిర్మాణాలు చేపట్టి

# రెండు మండలాల్లో త్రాగు,సాగునీరు కల్పించాలి

## ప్రజా పందా.




ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు

పెదవాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో సాగునీరు, తాగునీరు సౌకర్యం కల్పించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంద ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరింది. ఈ రెండు మండలాలకు జీవన ఆధారమైన పెదవాగు ప్రాజెక్టు గండిపడి రెండు సంవత్సరాలు పూర్తయిన అప్పటికి ప్రభుత్వాలు ఇంతవరకు గండిని పూడ్చ లేదని, వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం మద్దిగట్ల గ్రామంలో ఆయకట్టు రైతులతో సిపిఐ ఎంఎల్ మాస్లైన్ ప్రజా పందా వేలేరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్కే గౌస్ మాట్లాడుతూ, పెదవాగు ప్రాజెక్టు గండి పూడ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, పోలవరం డివిజన్ కార్యదర్శి కట్ట ముత్యాలరావు. పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి ఎస్కె మున్ని, కుకునూరు మండల కార్యదర్శి కంగాల కల్లయ్య,పార్టీ మండల నాయకులు ఆశి లక్ష్మయ్య మచ్చ ప్రశాంత్ సున్నం భీమరాజు మచ్చ సుభద్ర కామరాజు రాణి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో ఈనెల 24వ తేదీన

# అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

- తల్లితండ్రులు ఎవరో ఒకరు పాల్గొనకుండా తల్లితండ్రులు ఇద్దరూ పాల్గొనాలి.
- పండుగ వాతావరణంలో నిర్వహించాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ ఆదేశం



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

ఈ నెల 24వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ చెప్పారు. పాఠశాల, విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపరచేందుకు ఈ మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ లో విద్యా ప్రమాణాల స్థాయి, పాఠశాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు గురించి చర్చించడం జరుగుతుందని, కావున విద్యార్థిని, విద్యార్థుల తల్లితండ్రులలో ఎవరో ఒకరు పాల్గొనకుండా ఇద్దరూ పాల్గొని వారి పిల్లలతో పాల్గొన్నప్పుడే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం నెరవేరుతుందన్నారు. ఈనెల 24వ తేదీ ఉదయం 9. 30 ని.ల నుండి మధ్యాహ్నం 12. 45 ని.ల వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి, పాఠశాలలో సమస్యలపై విస్తృతంగా చర్చించడం జరుగుతుందన్నారు. పాఠశాల విద్యా శాఖకు సంబందించిన లీప్ యాప్ ను ఆయా విద్యార్థుల తల్లితండ్రులు కూడా డౌన్లోడ్ చేసుకుంటే టీచర్స్ అటెండెన్స్, తమ పిల్లల విద్య పురోగతి స్థాయి, మెరుగుపరుచుకునేందుకు తీసుకోవలసిన చర్యలు గురించి తెలుసుకోవచ్చన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ ను పండుగ వాతావరణంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగేలా రంగోలి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధికి సమాజంలోని దాతల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమైనదన్నారు. పాఠశాలలకు పుస్తకాలు, మౌలిక సదుపాయాలు, వంటి కార్యక్రమాల మద్దత్తు కోసం భాగస్వాములయ్యే దాతలు డోనర్స్ యాప్ లో నమోదు అయ్యేలా విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసి) సభ్యులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు, గ్రామ పెద్దలు, విద్యాశాఖ అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారన్నారు. . మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ సందర్భంగా ప్రతి విద్యార్థికి సంబంధించిన ప్రోగ్రెస్ కార్డు, హాజరు వివరాలు, విషయాల వారీగా అభ్యాస స్థాయి, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ ఎల్ ఎన్) పురోగతి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సహపాఠ్య కార్యక్రమాల్లో పాల్గొనడం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై తల్లిదండ్రులకు సమగ్ర సమాచారం అందించబడుతుందన్నారు. రానున్న సోమవారం 10వ తరగతి, ఇంటర్ పరీక్షలలో లలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థినీ, విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ కార్యక్రమం లో అభినందన కార్యక్రమం నిర్వహించి సన్మానించడం జరుగుతుందన్నారు.

## దుర్గా మల్లేశ్వరునికి విశేష పూజలు



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆషాఢ మాస శుక్ల పక్ష తృతీయాశీ సందర్భంగా ఆగిరిపల్లి శోభనాచల గుట్టపై ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి వారికి, బస్టాండ్ సమీపంలోని శ్రీ గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకవారాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన వంటి విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే వరాహ పుష్కరిణి సమీపంలోని స్వయంభూ శ్రీ కనకదుర్గ అమ్మవారికి కుంకుమార్చన, సహస్ర పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సి. హెచ్. సాయి పర్యవేక్షించారు.


## తెలుగుదేశం సీనియర్ కార్యకర్త మృతి



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

బాపులపాడు మండలం సింగన్నగూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త, మాజీ ఉపసర్పంచ్ బత్తుల నాగ భూషణం (90) వృద్ధాప్య సమస్యలతో శుక్రవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరు లక్ష్మీనారాయణ, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లగాని వీరాంజనేయులు, పీఏసీఎస్ అధ్యక్షుడు కనకవల్లి శేషగిరిరావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ, బత్తుల నాగభూషణం గ్రామాభివృద్ధికి, పార్టీ బలోపేతానికి విశేష సేవలందించారని, ఆయన మృతి గ్రామానికి తీరని లోటని అన్నారు.

## పాఠశాలకు విద్యా సామగ్రి అందజేత



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

శోభనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన చుక్కపల్లి విద్యాసంస్థల కరస్పాండెంట్ సుధా ప్రసాద్ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి, పాఠశాలకు ఆరు ఉపాధ్యాయుల బల్లలు, ఒక బీరువా, ఒక పుస్తకాల అల్మరా అందజేశారు. విద్యార్థుల స్వాగతాన్ని అభినందిస్తూ వారు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి త్వరలో క్రీడా సామగ్రి కూడా అందజేస్తామని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు యామినీ కృష్ణప్రియ ఆధ్వర్యంలో సుధా ప్రసాద్ను సన్మానించారు. విద్యార్థులకు కప్ కేకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దాసరి రాంప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు నలజాల హరిబాబు పాల్గొన్నారు.

## పునరావాస గృహాలకోసం స్థల పరిశీలన చేసిన ఆర్డీవో



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

పోలవరం నిర్వాసిత కుటుంబాలకు పునరావాస గృహాల కోసం భూ సేకరణ స్థలాన్ని తిరువూరు ఆర్డీవో శుక్రవారం పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామలలో ఒకటైన వీఆర్ పురం ప్రజలకు పునరావాస గృహాల నిర్మాణం కోసం భూ సేకరణలో భాగంగా, గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామంలో సుమారు 110 ఎకరాల భూమిని రైతులు అందించేందుకు ముందుకు రావడంతో, ఆ స్థలాన్ని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి భూ సేకరణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో గంపలగూడెం తహసీల్దార్, ఇతర అధికారులు, సదరు భూముల రైతులు పాల్గొన్నారు.

### వానపల్లి పశువైద్యశాల నిర్మాణానికి

## రూ.15 లక్షల విరాళం అందించిన దాతకు ఘన సన్మానం



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

వానపల్లి ప్రభుత్వ పశువైద్యశాల నిర్మాణానికి రూ.15 లక్షల విరాళం అందించిన అమెరికాలో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్న వానపల్లి గ్రామానికి చెందిన సత్యపళ్లం రాజును బీజేపీ యువ మోర్చా నాయకులు ఘనంగా సన్మానించారు. యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కోటిపల్లి దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు దుశ్శాలువా కప్పి అభినందనలు తెలిపారు. పుట్టిన గ్రామ అభివృద్ధికి తోడ్పడాలనే సంకల్పంతో రైతులు, పాడి రైతులు, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందేలా పశువైద్యశాల నిర్మాణానికి సత్యపళ్లం రాజు విరాళం అందించారని నాయకులు పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేసిన ఆసుపత్రి నిర్మాణానికి ఈ విరాళం వినియోగించనున్నట్లు తెలిపారు. వానపల్లి, పరిసర లంక గ్రామాల పాడి రైతులకు ఈ ఆసుపత్రి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి పాలూరి జయప్రకాశ్ నారాయణతో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరమర్శించిన రాష్ట్ర మంత్రి

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు



నూజివీడు పట్టణ 28 వార్డు వేమారెడ్డి రామారావు,మరియు డిప్యూటీ తహశీల్దార్ గుండుబోయిన వెంకటేశ్వరరావు ఇరువురు ఇటీవల స్వర్గస్తులైన సంగతి తెలుసుకొని, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి తన స్వయంగా ఇంటీకివెళ్లి తమ కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పిన మంత్రి కుటుంబానికి అన్ని విధాలుగా అండ దండగా ఉంటానని,పార్టీ అన్ని విధాలుగా ఆదు కుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.వీరి మరణం తీరని లోటని మంత్రి తెలిపారు. కుటుంబానికి తెలుగుదేశం అండగా ఉంటుందన్నారు. పార్టీ అన్ని వేళలా ఆదుకుంటుందని మంత్రి అన్నారు. మంత్రి వెంట కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ఆగిరిపల్లికి చెందిన వృద్ధ మహిళకు కరోనా నిర్ధారణ..

### -ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధ మహిళకు కరోనా పాజిటివ్గా నిర్ధారణ అయినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం, రక్తపోటు తదితర ఆరోగ్య సమస్యలతో ఆమె గత 15 రోజులుగా మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సలో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో కరోనా పాజిటివ్గా తేలినట్లు సమాచారం. ఈ విషయమై ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టినా స్పందిస్తూ, సదరు మహిళ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ప్రజలు అనవసర ఆందోళన చెందకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిదని సూచించారు. ప్రస్తుతం భయాందోళనలకు తావులేదని, అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయని ఆమె పేర్కొన్నారు.

## ఎప్సీబా కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

ఇటీవల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుకుంటున్న చిన్నారి ఎప్సిబా కొంత అస్వస్థకు గురైన సంగతి తెలుసుకొని ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులను కుటుంబాన్ని పేరు పేరునా పరామర్శించి ఓదార్చిన మంత్రివర్యులు. చిన్నారితో మాట్లాడుతూ తగినంత పౌష్టికాహారం భుజించాలని ఉన్నత చదువులు చదవాలని ఉన్నత ఉద్యోగాలుఅధిరోహించాలని చిన్నారికి సూచించారు.మంత్రివర్యులు వెంట ఉన్న ఆశ వర్కర్లు మరియు నర్సులకు ఆదేశిస్తూ పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు కావలసిన ఐరన్ మాత్రలు మరియు రక్త పరీక్షలు ఇతర టెస్టులు ప్రతిరోజు పరీక్షించి వారికి కావలసిన ఐరన్,ఇతర మాత్రలు పౌష్టికాహారం అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతీ రోజు విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు, వారికి కావలసిన మౌలిక సదుపాయాల అందేలా నిరంతరం పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులకు ఇతర ప్రభుత్వ అధికారులకు సూచించారు. మంత్రివర్యుల వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 18 జూలై 2026

## అమీనా పేట బాలికల హాస్టల్ల కాంపౌండ్‌కి వాచ్మెన్‌ని నియమించాలి.




ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా

ఏలూరు అమీనా పేట లో గల బాలికల హాస్టల్లు ఉండేటువంటి కాంపౌండ్ కి భద్రత దృష్టిలో ఉంచుకొని వాచ్మెన్ ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించి అనంతరం కార్యాలయ సూపర్డెంట్కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్ యు. జిల్లా అధ్యక్షుడు కాకినాని మాట్లాడుతూ సుమారు 1000కి పైగా ఉండేటువంటి ఆడపిల్లల హాస్టల్లకి కాంపౌండ్ కి సెక్యూరిటీ లేకపోవడం వలన ఉదయం, సాయంత్రం పాఠశాలకు మరియు కళాశాలకి వెళ్తున్న క్రమంలో బయటనుంచి కొంతమంది ఆకతాయిలు వచ్చి ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, బయట వ్యక్తులు కూడా ఇష్టారీతిన హాస్టల్ కాంపౌండ్ లోకి వస్తున్నారని ఈ విషయం నిన్న హాస్టల్ విజిట్ కి పి.డి.ఎస్.యు సంఘం గా వెళ్ళిన క్రమంలో విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని నాని తెలియజేశారు. అదేవిధంగా ఆ కాంపౌండ్ లో సీసీ కెమెరా ఉన్నప్పటికీ దానికి కనెక్షన్ లేకపోవడం వలన విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని నాని తెలియజేశారు. కావున విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని వెంటనే సెక్యూరిటీ ఏర్పాటు చేసి వాచ్మెన్ నియమించాలని నాని డిమాండ్ చేశారు. అదేవిధంగా పూర్తిస్థాయిలో కాంపౌండ్ లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి విద్యార్థుల భవిష్యత్తుకి భద్రతకి ప్రాధాన్యత ఇవ్వాలని నాని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్. ప్రమీల, కె. రాణి, వై. మాలతి తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## జగదాంబ అమ్మవారి ఆలయం ఉన్నచోటే ఉండాలి

### గ్రామసభలో ఏకాభిప్రాయ తీర్మానం

### గుడి నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి

### ఈవో తెలగం శెట్టి లక్ష్మి



ప్రజా భూమి ప్రతినిధి–జీలుగుమిల్లి

మండల కేంద్రం జీలుగుమిల్లిలో కొలువైయున్న శ్రీ జగదాంబ అమ్మవారి ఆలయాన్ని జాతీయ రహదారి విస్తరణలో తొలగిస్తే సహించేది లేదని, అమ్మవారి ఆలయాన్ని ఇక్కడే ఉంచాలని, అవసరమైతే రహదారి నిర్మాణానికి మరింత భూ సేకరణ చేసుకోవాలని అమ్మవారి భక్తులు, గ్రామస్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం అమ్మవారి ఆలయం జాతీయ రహదారి విస్తరణలో తొలగించాల్సి ఉంది. మరోచోట ఆలయ పునః నిర్మాణం పై దేవాదాయశాఖ అధికారులు అమ్మవారి ఆలయం వద్ద ప్రజా అభిప్రాయ గ్రామ సభ కార్య నిర్వహణ అధికారి తెరగాన్ శెట్టి లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణం కోసం 43 లక్షల నిధులు మంజూరు అయ్యాయని ఆమె తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమ ఎండోమెంట్ దృష్టికి, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం ఇక్కడ నుండి కదిలించడానికి తాము ఒప్పుకోమని తెలిపారు. అమ్మవారి ఆలయ తరలిస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అమ్మవారి తమ సెంటిమెంట్ అని, తమ ఇంటి ఆడపడుచుగా కొలుస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ ధర్మకర్త చిర్రి వెంకటేశ్వరరావు, ఆలయ ఈవో లక్ష్మికి అమ్మవారి ఆలయం ఇక్కడే ఉండాలని, గ్రామస్తులంతా సంతకాలు చేసి తీర్మాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చాట్రాతి ప్రసాద్, చాట్రాతి భవాని శేఖర్, చక్రి, కోరుకొండ సూరిబాబు, యాండ్ర చంద్రశేఖర్, చిట్టిబొమ్మ సతీష్, మాతంశెట్టి కిషోర్, మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనగాలని అధికారులకు తెలియజేశారు. వచ్చిన మహిళ భక్తులకు గణాసార్లు తీర్థ ప్రసాదాలు, పసుపు కుంకాలు అందజేశారు.

## సైబర్ క్రైమ్, మహిళా నేరాల పైన విద్యార్థినీ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

### ఎస్సై వల్లి పద్మ



ప్రజా భూమి ప్రతినిధి–కామవరపుకోట

తడికల పూడి మహిళా ఎస్ఐ వల్లి పద్మ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన సైబర్ క్రైమ్, మహిళలపై నేరాలు, మరియు సోషల్ మీడియా వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమమును నిర్వహించినారు. ఈ కార్యక్రమములో మహిళా ఎస్ఐ వల్లి పద్మ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటు లోకి రావడం, ముఖ్యంగా స్మార్ట్ ఫోన్ లు వినియోగం పెరగడంతో, సైబర్ నేరాలు మరియు సోషల్ మీడియా సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, విద్యార్థినులు అప్రమత్తంగా ఉంటూ తమను తాము ఎలా రక్షించుకోవాలో ఎస్ఐ వివరించారు. ఆన్ లైన్ మోసాలు, నకిలీ వీడియో కాల్స్ సోషల్ మీడియా వేధింపులు ఫోటో మార్ఫింగ్ మరియు వ్యక్తిగత సమాచార తస్కరణ వంటి వాటిపై జాగ్రత్తలు.మహిళలు మరియు బాలికలపై జరిగే నేరాలను అరికట్టడానికి ఉన్న చట్టాలు, పోలీసు విభాగం నుంచి లభించే సహాయం.సోషల్ మీడియాను విచక్షణతో ఉపయోగించడం, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను లేదా మెసేజ్‌లను తిరస్కరించడం, ప్రైవేట్ సమాచారం, ఫోటోలు షేర్ చేయవద్దని సూచించారు.సైబర్ నేరాల గురించి ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని, విద్యార్థినులను సైబర్ సైనికులుగా తీర్చిదిద్దే కార్యక్రమం గురించి కూడా ప్రస్తావించారు.ఏదైనా సైబర్ నేరం లేదా అత్యవసర పరిస్థితి ఎదురైతే తక్షణమే సంప్రదించడానికి డయల్ 1930 నెంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు. మీ వ్యక్తిగత వివరాలు, ఫోన్ నెంబర్ లుచిరునామాలు లేదా ఫోటోలను సోషల్ మీడియాలో లేదా ఆన్ లైన్‌లో ఎవరితోనూ పంచు కోవద్దు.మీ సోషల్ మీడియా ఖాతాలు మరియు ఇతర ఆన్ లైన్ సేవలకు బలమైన, సురక్షితమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి.నకిలీ లింక్‌లు/కాల్స్ పట్ల అప్రమత్తత: తెలియని నెంబర్ లు నుండి వచ్చే వీడియో కాల్స్, మెసేజ్‌ల లోని లింక్‌లపై స్పందించ వద్దు. బహుమతులు లేదా లోన్ల పేరుతో వచ్చే మోసపూరిత సందేశాలను నమ్మవద్దు.మీరు మీ చుట్టు పక్కల వారు సైబర్ నేరానికి గురైతే, భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి.నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930. శక్తి టీమ్ టోల్ ఫ్రీ నెంబర్ మహిళల కోసం 7993485111.ఆన్ లైన్‌లో సురక్షితమైన పద్ధతులను సైబర్ హైజీన్ పాటించండి మరియు మీ స్నేహితులు, కుటుంబ సభ్యులకు ఈ విషయాలపై అవగాహన కల్పించండి. ఈ అవగాహన కార్యక్రమాలు విద్యార్థులను డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించేలా ఉండాలి అని మహిళా ఎస్ఐ తెలియ చేసినారు.ఈ కార్యక్రమంలో హై స్కూల్ అధ్యాపకులు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## క్షేత్ర సందర్శనలో 2025-26 పథకాల అమలులో రైతుల అభిప్రాయాలు సేకరణ

### 2026-27 లక్ష్యాలపై సమీక్ష నిర్వహించిన ఉద్యాన శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు.



ప్రజాభూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.

ఉద్యాన పంటల అభివృద్ధి, రైతుల సంక్షేమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉద్యాన శాఖ రాష్ట్ర కార్యాలయం ఉప సంచాలకులు జి. ప్రభాకర రావు చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన శాఖ ద్వారా అమలు చేసిన వివిధ పథకాల పురోగతిని తెలుసుకునేందుకు, క్షేత్ర స్థాయిలో పథకాల అమలు తీరును పరిశీలించేందుకు రాష్ట్ర స్థాయి అధికారులు ఉప సంచాలకులు జి. ప్రభాకరరావు, సహాయ సంచాలకులు సుధ, కె. అనిల్ కుమార్ ల బృందం శుక్రవారం ఏలూరు జిల్లాలో పర్యటించింది. ఈ సందర్భంగా అధికారులు జిల్లాలోని పలు ఉద్యాన రైతుల పొలాలను సందర్శించి, పథకాల ద్వారా లబ్ధి పొందిన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. కోకో పంట, పండ్ల తోటలు, కూరగాయల విస్తరణ, కోకో బీన్స్ నాణ్యత,కోత అనంతర యాజమాన్య పద్ధతులు తదితర పథకాలపై రైతుల నుండి అభిప్రాయాలను సేకరించారు. పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, సబ్సిడీ విడుదల, సాంకేతిక సహాయం తీరుపై రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు మరియు వర్షభవ పరిస్థితుల్లో ఉద్యాన పంటలను సంరక్షించుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై రైతులకు వివరించారు. రైతులు పథకాలు అమలు లో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లాలో పని చేస్తున్న ఉద్యాన శాఖ అధికారులు మరియు క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025-26 సంవత్సరంలో సాధించిన లక్ష్యాలు, నిధుల వినియోగం, భౌతిక ప్రగతిపై సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతీ ఉద్యానవన రైతుకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 2026-27వ సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, లబ్ది దారులు గుర్తింపు పై అధికారులను ఆదేశించారు. ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపు, విలువ ఆధారిత ఉత్పత్తులు, రైతులకు శిక్షణ కార్యక్రమాలు, రక్షిత సాగు విస్తరణ, రిపెనింగ్ ఛాంబర్, నీటి కుంటలు, రిటైల్ మార్కెట్లు, ప్యాక్ హౌస్ లు, కోల్డ్ రూమ్ల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు ఏలి నోవా (వర్షాభావ పరిస్థితులలో) తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులందరికీ చేరువ చేసేందుకు అవగాహన కార్యక్రమాలు మరియు రైతు సేవా కేంద్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చెయ్యాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పథక సంచాలకులు, సూక్ష్మ సేద్యం రామ్మోహన్, , ఏలూరు, జిల్లా ఉద్యాన అధికారి సాజా నాయక్, ఏలూరు సహాయ ఉద్యాన సంచాలకులు, ఏలూరు, వివిధ మండలాల ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.


## రాయనపాడు అమృత్ స్టేషన్

## SelfieWithStation పోటీలలో పెంటమరాజు గోపాల్ రావు దంపతులకు ద్వితీయ స్థానం

### దక్షిణ కోస్తా రైల్వే సోషల్ మీడియా పోటీలో విజేతగా నిలిచిన మంత్రి కందుల దుర్గేష్ పీఆర్వో గోపాల్ రావు

ప్రజా భూమి ప్రతినిధి–విజయవాడ

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద నూతన రూపురేఖలు దిద్దుకున్న ఎన్టీఆర్ జిల్లా రాయనపాడు రైల్వే స్టేషన్ పునర్నిర్మాణాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సోషల్ మీడియా పోటీలలో గుంటుపల్లికి చెందిన పెంటమరాజు గోపాల్ రావు, హిమబిందు దంపతులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దక్షిణ కోస్తా రైల్వే విజయవాడ డివిజన్ అధికారికంగా నిర్వహించిన ఈ »#SelfieWithStationµ పోటీలో పదుల సంఖ్యలో పోటీదారులు పాల్గొనగా, గోపాల్ రావు దంపతులు విజేతలుగా నిలిచి రైల్వే అధికారుల నుండి ఘనంగా అవార్డును అందుకున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మరియు చారిత్రక వైభవం ఉట్టిపడేలా అద్భుతంగా రూపుదిద్దుకున్న రాయనపాడు అమృత్




రైల్వే స్టేషన్ వద్ద గోపాల్ రావు దంపతులు సెల్ఫీ తీసి, విజయవాడ డివిజన్ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను ట్యాగ్ చేస్తూ ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్ట్ చేశారు. పర్యాటక సోయగాలను ప్రతిబింబించేలా ఉన్న ఈ సెల్ఫీ నెటిజన్లను, రైల్వే అధికారులను విశేషంగా ఆకర్షించి అత్యుత్తమ



విజేతగా నిలిచింది. కాగా, పెంటమరాజు గోపాల్ రావు ప్రస్తుతం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ వద్ద పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు.ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడంపై పెంటమరాజు గోపాల్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాయనపాడు రైల్వే స్టేషన్ అమృత్ భారత్ పథకం కింద ఎంతో అద్భుతంగా రూపుదిద్దుకుందని ప్రశంసించారు. అయితే, స్థానిక ప్రయాణికులకు మరియు పర్యాటకులకు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు గుంటుపల్లి సెంటర్ నుండి రాయనపాడు రైల్వే స్టేషన్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. అలాగే, ప్రధాన రహదారిని తక్షణమే మరమ్మత్తు చేసి, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మౌలిక వసతులు కల్పిస్తే రాయనపాడు పరిసర ప్రాంతాలు ఆర్థికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల వద్దకు అధికారులు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండల ఎంపీడీవో కార్యాలయంలో కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ – – ప్రజా సమస్యల పరిష్కార సభ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు వినిపించారు.ప్రధానంగా రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలు, ఇంటి స్థలాల కేటాయింపు, తాగునీటి సరఫరా, వాటర్ ట్యాంకుల ఏర్పాటు తదితర అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు ప్రజల వద్దకే వచ్చి సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు.




నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి నెల కలెక్టర్‌తో సమీక్షలు నిర్వహిస్తూ పెండింగ్



సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల నిర్వ హించిన సమీక్ష సమావేశంలో రూ.8 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్లు వెల్లడించారు. ఇందులో రూ.2 కోట్లు విద్యుత్ పనులకు, రూ.6 కోట్లు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి కేటా యించాలని ప్రతిపాదించామని, నిధులు విడుదలైన వెంటనే విడతల వారీగా పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.మండలంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడం తో పాటు, ఇప్పటివరకు రోడ్లు లేని ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. రాబోయే పుష్కరాల నాటికి అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సమస్యలను పూర్తిగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో లక్ష్మీ లావణ్య, ఎంపీడీవో వేణు గోపాల్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సిద్ద దుర్గారావు, నామన పరమేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఇందుగల రామకృష్ణ, అనపర్తి ప్రసాద్, తిగిరిపల్లి గోపి, మద్దుకూరి శంకరం, బోడపాటి గంగరాజు, కొప్పాక విజయానంద కుమార్, నామ నరేంద్ర కుమార్, అన్నమరెడ్డి సత్తిబాబు, కడలి కిరణ్ కుమార్, కాకర్ల వంశీ, దొండమూడి శేషు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

### రామచంద్రపురం పట్టణంలో

## అభివృద్ధి పనులకు మంత్రి సుభాష్ శ్రీకారం

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మున్సిపల్ కమిషనర్ ఏ వి ఆర్ ఆర్ రాజు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఈ ఈ హుస్సేన్, డిఈ శ్రీకాంత్ కూటమి పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పట్టణంలోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు.మొత్తం రూ.14.14 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆరు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఇందులో అమృత్ 2.0 పథకం కింద రూ.13.40 కోట్లతో రెండు లక్షల 50 వేల లీటర్ల కెపాసిటీతో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ పథకంతో తాగునీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కానునుంది.రామచంద్రపురం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.గత రెండేళ్లలో రామచంద్రపురం పట్టణంలో సుమారు రూ.50 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పార్కుల అభివృద్ధి, విద్యుత్ సౌకర్యాల మెరుగుదల వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.అమృత్ 2.0 కింద చేపట్టిన





తాగునీటి ప్రాజెక్టు పూర్తయిన తర్వాత పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రతి వార్డులో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని చెప్పారు. రామచంద్రపురాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీ నాయకులు, ఆయా వార్డుల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.